

ANGRAU

ఆచార్య ఎన్. జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయము

# వ్యవసాయం

వ్యవసాయ సచిత్ర మాస పత్రిక

సంపుటి - 15 | సంచిక - 07 | జులై 2023 | పేజీలు - 44 | వెల రూ. 20/-



చౌడును తట్టుకునే వరి వంగడాలు

వాక్కాయ - ప్రయోజనాలు



ప్రత్తిలో గులాబిరంగు పురుగు యాజమాన్యంపై ప్రదర్శన

కరివేపాకు - సాగులో మెళకువలు





# ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయములో జరిగిన

# వివిధ కార్యక్రమాల దృశ్యమాలిక




ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ వ్యవస్థాపక దినోత్సవం @ ఆర్.ఎ.ఆర్.ఎస్., లాం.




ఆంగ్రూ మరియు నాబార్డ్ మధ్య రైతుల అభివృద్ధి కొరకు చర్చా కార్యక్రమం @ కృష్ణా ఆడిటోరియం, లాం.



విశ్వ విద్యాలయ పరిశోధనా మరియు విస్తరణ కేంద్రాలకు డ్రోన్‌ల పంపిణీ కార్యక్రమం @ పరిపాలనా భవనం, లాం.

# వ్యవసాయం

ANGRAU

శ్రీ శోభకృత్ నామ సం॥
ఆషాఢ మాస శు.త్రయోదశి మొ॥
శ్రావణ మాస చతుర్దశి వరకు


## సంపాదక వర్గం


ప్రధాన సంపాదకులు
**డా॥ ఎ. లలిత**
ప్రధాన వ్యవసాయ సమాచార అధికారి (ఎఫ్.ఎ.సి.)

సంపాదకులు
**డా॥ యం. వెంకటరాములు**
సీనియర్ శాస్త్రవేత్త (విస్తరణ)



వ్యవసాయం మాస పత్రిక
సంవత్సర చందా రూ. 200/- లేదా
జీవితకాల (10 సంవత్సరములు) చందా
రూ. 1000/- నగదు రూపంలో లేదా డి.డి.
రూపంలో చెల్లించవచ్చు.
మని ఆర్డర్ లేదా డి.డి అయితే PRINCIPAL AGRICULTURAL INFORMATION OFFICER, GUNTUR, ANDHRA PRADESH పేరిట తీసి గుంటూరులో చెల్లే విధంగా పంపించాలి.



చిరునామా :
ప్రధాన వ్యవసాయ సమాచార అధికారి
వ్యవసాయ సమాచార మరియు ప్రసార కేంద్రం
ఆచార్య ఎన్. జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయము
అడ్వాన్స్‌డ్ పోస్టు గ్రాడ్యుయేషన్ సెంటర్ ఆవరణ,
లాం, గుంటూరు - 522 034, ఆంధ్రప్రదేశ్.
ఫోన్ : 91005 00223
ఈ-మెయిల్ : paio@angrau.ac.in


## విషయ సూచిక


1. ఉపకులపతి సందేశం ..... 5
2. విస్తరణ సంచాలకుల సందేశం ..... 6
3. వివిధ పంటలలో ఈ మాసంలో చేయవలసిన వ్యవసాయ పనులు ..... 7
4. సాంకేతిక వ్యాసాలు
- ప్రత్తిలో గులాబీ రంగు పురుగు సమగ్ర యాజమాన్య సాంకేతిక పరిజ్ఞాన ప్రదర్శనా ఫలితాలు ..... 18
- సార్వాలో సాగుకు అనువైన చౌడును తట్టుకునే వరి వంగడాలు ..... 20
- ఖరీఫ్‌లో ఉత్తరాంధ్ర ప్రాంతానికి అనువైన వరి రకాలు ..... 23
- కలుపు మందుల వినియోగంలో తీసుకోవలసిన జాగ్రత్తలు ..... 25
- పొగాకు నారుమళ్ళు - సస్యరక్షణ ..... 28
- కరివేపాకు సాగులో మెలకువలు ..... 31
- వాక్కాయా ?? ఎన్నెన్నో ప్రయోజనాలయ్యా !!! ..... 33
- పశువులు, జీవాలలో దాణా ప్రాముఖ్యత ..... 35
- జూలై మాసంలో పాడి మరియు జీవాల సంరక్షణలో చేపట్టవలసిన చర్యలు ..... 36
- ట్రాక్టర్ల వాడకంలో సమర్ధ యాజమాన్యం మరియు ఇంధనం ఆదా ..... 37

5. విశ్వవిద్యాలయ వార్తలు ..... 40
6. రైతుల సమస్యలు - శాస్త్రవేత్తల సలహాలు ..... 41
7. కర్షక విజయాలు
- ఐరోపా తేనెటీగల పెంపకంలో సిరులు పండిస్తున్న ఉద్యోగి ..... 42


పాఠక మహాశయులు మాసపత్రిక అభ్యున్నతికి తోడ్పడుటకుగాను
తమ అమూల్యమైన సలహాలను, సూచనలను అందచేయవలసిందిగా కోరుచున్నాము.

# జులై మాసం క్యాలెండర్ - 2023

| SUN ఆది | MON సోమ | TUE మంగళ | WED బుధ | THU గురు | FRI శుక్ర | SAT శని |
|---|---|---|---|---|---|---|
| **30** ద్వాదశి ఉ. 7-07, త్రయోదశి తె. 5-12, మూల రా. 7-45 సా.వ. 6-12 ల 7-45, తె.వ. 4-52 ల | **31** చతుర్దశి తె. 3-07 పూర్వాషాఢ సా. 6-34 ఉ.శే.వ. 6-23, రా.వ. 2-05 ల 3-35 | | | | | **1** శు.త్రయోదశి రా. 8-47 అనూరాధ ప. 1-12 సా.వ. 6-39 ల 8-13 |
| **2** చతుర్దశి రా. 7-18 జ్యేష్ఠ ప. 12-36 రా.వ. 8-16 ల 9-49 | **3** ○ పూర్ణిమ సా. 5-28 మూల ఉ. 11-39 ఉ.వ. 10-06 ల 11-39, రా.వ. 8-44 ల 10-15 | **4** బ.పాడ్యమి ప. 3-22 పూర్వాషాఢ ఉ. 10-24 సా.వ. 5-54 ల 7-24 | **5** విదియ ప. 1-03 ఉత్తరాషాఢ ఉ. 8-55 ప.వ. 12-38 ల 2-08 | **6** తదియ ఉ. 10-37 శ్రవణం ఉ. 7-18, ధనిష్ఠ తె. 5-39 ప.వ. 11-01 ల 12-31 | **7** చవితి ఉ. 8-09, పంచమి తె. 5-43 శతభిషం తె. 4-01 ప.వ. 12-21 ల 1-51 | **8** షష్ఠి తె. 3-28 పూర్వాభాద్ర రా. 2-32 ఉ.వ. 10-02 ల 11-32 |
| **9** సప్తమి రా. 1-22 ఉత్తరాభాద్ర రా. 1-14 ఉ.వ. 11-36 ల 1-07 | **10** అష్టమి రా. 11-32 రేవతి రా. 12-12 ప.వ. 12-43 ల 2-14 | **11** నవమి రా. 10-03 అశ్విని రా. 11-30 రా.వ. 7-37 ల 9-10 | **12** దశమి రా. 8-57 భరణి రా. 11-12 ఉ.వ. 8-59 ల 10-34 | **13** ఏకాదశి రా. 8-19 కృత్తిక రా. 11-21 ఉ.వ. 11-16 ల 12-53 | **14** ద్వాదశి రా. 8-08 రోహిణి రా. 11-58 ప.వ. 3-46 ల 5-24, తె.వ. 5-49 ల | **15** త్రయోదశి రా. 8-27 మృగశిర రా. 1-05 ఉ.శే.వ. 7-30 |
| **16** చతుర్దశి రా. 9-20 ఆర్ద్ర రా. 2-42 ఉ.వ. 10-03 ల 11-45 | **17** ● అమావాస్య రా. 10-38 పునర్వసు తె. 4-44 ప.వ. 3-43 ల 5-27 | **18** శు.పాడ్యమి రా. 12-18 పుష్యమి పూర్తి ప.వ. 1-30 ల 3-16 | **19** విదియ రా. 2-13 పుష్యమి ఉ. 7-04 రా.వ. 9-14 ల 11-00 | **20** తదియ తె. 3-13 ఆశ్రేష ఉ. 9-40 రా.వ. 10-58 ల 12-44 | **21** చవితి పూర్తి మఘ ప. 12-16 రా.వ. 9-05 ల 10-51 | **22** చవితి ఉ. 6-15 పుబ్బ ప. 2-45 రా.వ. 10-36 ల 12-20 |
| **23** పంచమి ఉ. 7-52 ఉత్తర సా. 4-56 రా.వ. 1-57 ల 3-41 | **24** షష్ఠి ఉ. 9-11 హస్త సా. 6-44 తె.వ. 3-10 ల 4-52 | **25** సప్తమి ఉ. 10-03 చిత్ర రా. 8-05 రా.వ. 1-52 ల 3-32 | **26** అష్టమి ఉ. 10-24 స్వాతి రా. 8-56 రా.వ. 2-36 ల 4-14 | **27** నవమి ఉ. 10-17 విశాఖ రా. 9-17 రా.వ. 1-16 ల 2-51 | **28** దశమి ఉ. 9-39 అనూరాధ రా. 9-11 రా.వ. 2-39 ల 4-13 | **29** ఏకాదశి ఉ. 8-35 జ్యేష్ఠ రా. 8-39 తె.వ. 4-21 ల 5-23 |

## పునర్వసు కార్తె (06.07.2023 నుండి 19.07.2023)

| | | |
|---|---|---|
| వరి | : | సార్వా వరినాట్లు, ముందుగా నాటిన వరిలో అంతరకృషి, సస్యరక్షణ |
| సజ్జ | : | రసాయనిక ఎరువులు వేసి పునాస లేక ఖరీఫ్‌పైరు విత్తుట |
| వేరుశనగ | : | అంతరకృషి, సస్యరక్షణ |
| ఆముదం | : | రసాయనిక ఎరువులు వేసి విత్తుట |
| జొన్న | : | పునాస లేక ఖరీఫ్ జొన్న విత్తుట. విత్తిన పంటకు ఎరువులు వేయుట. సస్యరక్షణ |
| మొక్కజొన్న | : | అంతరకృషి, సస్యరక్షణ, రెండవ దఫా ఎరువులు వేయుట |
| ప్రత్తి | : | వర్షాధారపు పంట విత్తడం. ముందుగా నాటిన ప్రత్తిలో అంతర కృషి. ఎరువులు వేయుట |
| కొర్ర | : | ఎరువులు వేయుట, దుక్కి తయారు చేయుట |
| ఆముదం | : | కలుపు తీయుట, సస్యరక్షణ |
| చెఱకు | : | జడచుట్లు వేయుట |
| రాగి | : | నారు నాటడం, ఎరువులు వేయుట, అంతరకృషి, సస్యరక్షణి |

## పుష్యమి కార్తె (20.07.2023 నుండి 02.08.2023)

| | | |
|---|---|---|
| వరి | : | సస్యరక్షణ, రసాయనిక ఎరువులు వేయుట |
| జొన్న | : | అంతర కృషి, మొక్కలు పలుచన చేయుట, సస్యరక్షణ |
| మొక్క జొన్న | : | అంతర కృషి, సస్యరక్షణ |
| కొర్ర | : | విత్తనం వేయుట |
| వనమహోత్సవం | : | చెట్ల నాట్లకు తయారి, పొలాల గట్లపై చెట్ల నాట్లకు తయారీ |
| సజ్జ / రాగి | : | సస్యరక్షణ, అంతరకృషి |

# ప్రస్తుత తరుణంలో పంటల సాగు...



**డా॥ ఏ. విష్ణువర్ధన రెడ్డి**
ఉపకులపతి
ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయము

మన రాష్ట్రంలో ఈ సంవత్సరం తొలకరి వర్షాలు ఆలస్యం కావటంతో జూన్ మాసంలో సాధారణం కంటే 41.88 శాతం వర్షపాతం తక్కువగా నమోదయ్యింది. కావున ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో పంటల సరళిని మార్చటం అత్యవసరం కాబట్టి రైతులు ప్రణాళికాబద్ధంగా మార్కెట్ పరిజ్ఞానాన్ని అర్ధం చేసుకొని, నేలలు, నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులను అనుసరించి సరియైన పంటలను ఎన్నుకొని ఖరీఫ్‌లో సాగు చేసినప్పుడు అధిక లాభాలు గడించడానికి అవకాశం ఉంటుంది. అధిక వర్షపాతం తక్కువ రోజుల్లో నమోదు అవటం, మారిన వాతావరణ పరిస్థితులకు అద్దం పడుతుంది. ఈ పరిస్థితుల్లో నీటి వృధాను అరికట్టి సంరక్షణ చర్యలు తీసుకోవటం వలన వర్షపు నీటిని సద్వినియోగ పర్చటమే కాకుండా భూగర్భ జలాలను వృద్ధి చేయవచ్చును మరియు నేల కోతను నివారించవచ్చును.

వర్షపు నీటిని సంరక్షించడానికి సమగ్ర ప్రణాళికలు అవసరం. నీటి సంరక్షణ చర్యల ద్వారా రెండు ప్రయోజనాలు చేకూరతాయి. మొదటిది బెట్ట పరిస్థితుల్లో పంటలను కాపాడుకోవచ్చును. రెండవది భూగర్భ జలాలను వృద్ధి చేయవచ్చును. నీటిని సంగ్రహించడానికి స్వల్ప మరియు దీర్ఘకాలిక చర్యలను చేపట్టాలి. ప్రతి యేటా చేసే లోతు దుక్కులు దున్నటం. గొడ్డు సాలు దున్నటం, మల్చింగ్ మొదలగు స్వల్పకాలిక చర్యల వలన నీటిని అధికముగా భూమిలోనికి సంగ్రహించవచ్చును. అంతేకాకుండా నేలలో సేంద్రీయ కర్బనం అభివృద్ధి చేయవచ్చును మరియు కలుపు మొక్కలను సమర్ధవంతంగా నివారించవచ్చును. దీర్ఘకాలిక చర్యలైన పొలంలో గట్లు వేయటం, ఇంకుడు గుంతలు తవ్వటం, నీటి ప్రవాహనికి అడ్డంగా గట్లు వేయటం, నీటిని నిల్వ చేయటం మొదలగు వాటి వలన జలసంరక్షణ జరిగి దీర్ఘకాలిక ప్రయోజనాలు చేకూరుతాయి

ఖరీఫ్ పంట కాలంలో వివిధ పరిస్థితులకు అనుగుణంగా అధిక దిగుబడులు సాధించగల పంట రకాలను / సంకరాలను ఎంపిక చేసుకోవాలి. ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విడుదల చేసిన వివిధ పంట రకాలు రైతులకు ఉపయుక్తంగా ఉంటాయి. రాబోయే పంట కాలానికి అవసరమైన విత్తనాలను, ఎరువులను గుర్తింపు పొందిన సంస్థల నుండి సేకరించుకొని సాగుకు సమాయత్తం కావాలి. పచ్చిరొట్ట ఎరువుల కొరకు జనుము, జీలుగ వంటి పంటలను సాగు చేసి పొలాల్లో కలియదున్నాలి. మెట్ట ప్రాంత రైతులు మధ్యంతర బెట్టను తట్టుకోవడానికి తేమ సంరక్షణ చర్యలు చేపట్టాలి. తప్పనిసరి పరిస్థితుల్లో సాలు విడిచి సాలుకు సేద్యపు నీటిని అందించాలి. బెట్ట పరిస్థితుల్లో రసం పీల్చే పురుగులు ఎక్కువగా ఆశించే అవకాశం ఉంది. కనుక తగు యాజమాన్య చర్యలను చేపట్టాలి. కీలకమైన పూత దశలో రెండు శాతం యూరియాను మరియు 10 గ్రా. పొటాషియం నైట్రేట్‌ను లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

రైతాంగం ఎల్లప్పుడూ వ్యవసాయ విశ్వవిద్యాలయం వారి ఏరువాక, కృషి విజ్ఞాన కేంద్రాలు అందించే సాగు సూచనలు, జాగ్రత్తలు మరియు నివారణ చర్యలను పాటించి పంటలలో అధిక, నాణ్యమైన దిగుబడులను సాధిస్తారని ఆశిస్తున్నాను.

(ఏ. విష్ణువర్ధన రెడ్డి)

# ఖరీఫ్ పంటల సాగులో మెళకువలు



**డా॥ ఏ. సుబ్బరామి రెడ్డి**
విస్తరణ సంచాలకులు
ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయము

ఆంధ్రప్రదేశ్‌లో ఖరీఫ్‌లో దాదాపు 35.75 లక్షల హెక్టార్లలో వివిధ పంటలు సాగవుతాయని అంచనా వేసారు. దీనిలో వర్షాధారంగా సాగయ్యే విస్తీర్ణంలో ఎక్కువ శాతం నేలలు తేమను ఎక్కువ కాలం నిలుపుకోలేని తేలికపాటి లోతు తక్కువ నేలలే. వీటిలో తేమ పరిరక్షణ గుణాన్ని పెంపొందించుట కొరకు వేసవిలో లోతు దుక్కులు, వాలుకు అడ్డంగా సేద్యం, కాంటూరు సేద్యం వంటి పద్ధతులను పాటించడంతో పాటు భూమిలోని సేంద్రీయ పదార్ధాలను పెంపొందించాలి. పెరుగుతున్న ఎరువుల ధరల దృష్ట్యా సమతుల పోషకాల యాజమాన్యంలో భాగంగా రైతులు భూసార పరీక్షా ఫలితాల ఆధారంగా ఎరువుల యాజమాన్య ప్రణాళికలు తయారు చేసుకోవాలి. పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ, పిల్లిపెసర, కట్టెజనుము వంటి పంటలు పూత దశకు చేరుకునే ముందు రోటోవేటర్ సహాయంతో నేలలో కలియదున్నాలి. వర్షాధార ప్రాంతాలలో పడిన వర్షం అంతా సత్వర వినియోగం జరగదు. అందువలన పడిన అధిక వర్షాన్ని పంట పొలంలో పల్లపు ప్రాంతంలో సేకరించి నిల్వ చేయుటకు వీలుగా పొలాల్లో నీటి కుంటలను ఏర్పాటు చేసుకోవాలి. వీటి ద్వారా నిల్వ చేయబడిన నీటిని పంట సున్నిత దశలలో వినియోగించాలి.

ముందుగా పంటలు, వాటి రకాలు, ఎన్నుకోవడంలో రైతులు జాగ్రత్త వహించాలి. నేల రకం, నీటి సదుపాయం మరియు పెట్టుబడి వంటి విషయాలను దృష్టిలో ఉంచుకొని పంటను ఎంపిక చేసుకోవాలి. అంతేకాకుండా విత్తనశుద్ధి తప్పక ఆచరించడం, పంట పొలంలో మొక్కల సాంద్రత ఆయా పంటలను బట్టి సరిపడా ఉండేలా చూసుకోవడం, పంట మార్పిడి చేసుకోవడం, అంతర పంటలు, ఎర పంటలు వేసుకోవడం మరియు ఇతర ప్రత్యామ్నాయ చీడపీడల నివారణ పద్ధతులు వినియోగించడం, సాటి రైతుల విజయగాథల నుండి నేర్చుకోవడం, ఇలా ఆచరించదగ్గ శాస్త్రీయ ప్రత్యామ్నాయాలను పంటల సాగులో రైతులు పాటించాలి.

విశ్వవిద్యాలయంలోని ఏరువాక మరియు కృషి విజ్ఞాన కేంద్రాల శాస్త్రవేత్తలు ఈ ఖరీఫ్ కాలంలో సాగు చేసుకోవలసిన పంటలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. కాబట్టి రైతు సోదరులందరూ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు అందించే సలహాలు సూచనలను పాటించి, ఖరీఫ్‌లో సాగుకు సన్నద్ధమై, వివిధ పంటల సాగు ద్వారా అధిక లాభాలను పొందాలని ఆశిస్తున్నాను.

(ఏ. సుబ్బరామి రెడ్డి)




**1.** జూన్ నెలలో వరి నారుమడులు పోసిన రైతుల పొలాల్లో జులైలో నాట్లు పడే అవకాశం ఉన్నందువలన వరి నాట్లు సమయంలో ఈ క్రింది మెళకువలు పాటించాలి.

- ప్రధాన పొలమును 3-4 సార్లు దమ్ము చేసి బాగా చదును చేసుకోవాలి.
- ఆయా మండలాలకు సిఫారసు చేసిన భాస్వరం ఎరువును ఆఖరి దమ్ములో వేసుకోవాలి.
- దీర్ఘకాలిక మరియు మధ్య కాలిక రకాలకు 25-30 రోజులు వయసున్న నారును ఊడ్చుకోవాలి.
- స్వల్పకాలిక రకాలు సాగు చేస్తున్నపుడు 20-25 రోజులు వయసున్న నారును ఊడ్చుకోవాలి.
- రెండు నుండి మూడు మునల నారును పైపైన ఊడ్చాలి.
- కాలి బాటలు 2-3 మీటర్లు విధిగా ఉండేటట్లు చూసుకోవాలి.
- సిఫారసు చేసిన నత్రజనిని మూడు సమ భాగాలుగా మొదటి సారి నాటటానికి ముందు, రెండవ సారి పిలకల దశలో మరియు ఆఖరుగా అంకురం ఏర్పడే దశలో వేసుకోవాలి. పొటాష్‌లో సగ భాగాన్ని మొదటి దఫాలో మరియు మిగతా సగాన్ని అంకురం ఏర్పడే దశలో వేసుకోవాలి.
- ప్రధాన పొలంలో కలుపు నివారణకు, నాట్లు వేసిన 3-5 రోజులలోపు పల్చగా నీరు పెట్టి ఎకరానికి 1.5 లీటర్ల బుటాక్లోర్ లేదా 500 మి.లీ. ప్రిటిలాక్లోర్ లేదా ఆక్సాడయర్జిల్ 35-50 గ్రా. లేదా బెన్ సల్ఫ్యూరాన్ మిథైల్ + ప్రిటిలాక్లోర్ గుళికలు 4 కిలోలు చొప్పున సమానంగా పడేలాగా ఎకరానికి 20-25 కిలోల ఇసుకతో కలిపి చల్లుకోవాలి.

**2.** జూన్‌లో నారు పోయకుండా పచ్చి రొట్ట వేసుకున్న రైతులకు సూచనలు

- జూన్‌లో జీలుగ వంటి పచ్చి రొట్ట ఎరువులు చల్లిన రైతులు 30 - 40 రోజుల వయసు గల పచ్చి రొట్ట మొక్కలను కాడ పలుచగా ఉన్నప్పుడు కలియ దున్నటం వలన చేనుకు అవసరమైన $^1/_3$ వంతు ఎరువు అంది భూసారం పెరుగుతుంది.

**3.** వరి నారుమళ్ళు వేసుకునే సమయాన్ని బట్టి రకాల ఎంపికలో పాటించవలసిన మెళకువలు

- జులై 15 వ తారీకు వరకు ఆయా మండలాలకు సిఫారసు చేసిన వరి రకాలు వేసుకోవచ్చు.
- జులై 15 నుండి జులై 30 లోపు నారు పోసుకునే రైతులు ఆయా మండలాలకు సిఫారసు చేసిన మధ్యస్థ కాల పరిమితి గల రకాలు వేసుకోవాలి.
- ఆగష్టు వరకు నారు మడులు వేయకపోతే, స్వల్పకాలిక రకాలైన ఎన్.ఎల్.ఆర్. 34449, యం.టి.యు. 1153, యం.టి.యు. 1156, యం.టి.యు. 1010, మరియు ఐ.ఆర్. 64 వంటి రకాలను సాగు చేసుకోవచ్చు.

**4.** ఎద పద్ధతిలో సాగు చేస్తున్న రైతులు తీసుకోవలిసిన మెళకువలు

- ఉత్తర కోస్తాలో మరియు కృష్ణా డెల్టాలో ఎద పద్ధతిలో సాగు చేస్తున్న రైతులు పడి పోని రకాలను ఎంపిక చేసుకోవాలి.
- జులై లోపు మధ్య కాలిక రకాలు మరియు ఆగష్టులో అయితే స్వల్ప కాలిక రకాలు విత్తుకోవాలి.
- సిఫార్సు చేసిన ఎరువులలో భాస్వరం పూర్తిగా, సగ భాగం పొటాష్ ఎరువుకు ఆఖరి దుక్కిలో వేసుకోవాలి. నత్రజనిని మొదటి దఫా విత్తిన 15 రోజులకు, రెండవ సారి పిలకల దశలో మరియు ఆఖరి సారి అంకురం ఏర్పడే దశలో పొటాష్ ఎరువుతో పాటుగా వేసుకోవాలి.
- విత్తిన 3 రోజులకు భూమిలో తేమ ఉండేటట్లు చూసుకొని ఎకరానికి 500 మి.లీ. ప్రిటిలాక్లోర్ + సేఫేనర్ లేదా ఆక్సడయార్జిల్ 35 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి.

**డా॥ టి. శ్రీనివాస్,** ప్రధాన శాస్త్రవేత్త (వరి)
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం,
మారుటేరు - 534 122. చరవాణి : 93968 48380




- నైఋతి ఋతుపవనాలు వచ్చిన తర్వాత 7-10 రోజుల వ్యవధిలో 75 మి.మీ. - 100 మి.మీ.ల వర్షం పడిన తర్వాత పొలంలో విత్తనం వేసుకోవాలి. రైతాంగం వారి గత రెండు మూడు సంవత్సరాల అనుభవాలను దృష్టిలో వుంచుకొని రకాలను ఎంపిక చేసుకోవాలి. స్వల్ప కాలిక రకాలను ఎంచుకోవడం ద్వారా చివర దశలో గులాబిరంగు పురుగు నుండి తప్పించుకోవడానికి అవకాశం ఉంటుంది. వీలయినంత వరకు ఒక ప్రాంతములోని రైతులందరూ ఒకేసారి విత్తుకుంటే, ముఖ్యంగా గులాబి రంగు పురుగు సస్యరక్షణ సులభమవుతుంది.
- సాధారణంగా మనకు మార్కెట్లో లభ్యమయ్యే రకాలన్ని పురుగు మందులతో విత్తన శుద్ధి చేయబడుతున్నాయి. తెగుళ్ళ కొరకు ట్రైకోడెర్మా విరిడె 10 గ్రా. కిలో విత్తనానికి కాని, సుడోమోనాస్ ఫ్లోరిసెన్స్ 10 గ్రా. కిలో విత్తనానికి లేదా కార్భాక్సిన్ 2 గ్రా. కిలో విత్తనానికి పట్టించి విత్తన శుద్ధి చేసుకోవడం ద్వారా దాదాపు 40 నుండి 50 రోజుల వరకు ప్రత్తి పంటకి వివిధ రకాల తెగుళ్ళ నుండి రక్షణ లభిస్తుంది.
- బి.టి. ప్రత్తికి ఎకరాకు 48-60 కిలోల నత్రజని (3 బస్తాల యూరియా), 24 కిలోల భాస్వరం (3 బస్తాల సింగిల్ సూపర్ ఫాస్పేట్) మరియు 24 కిలోల పొటాష్ (40 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్) పోషకాలను అందించాలి. ఆఖరు దుక్కిలో భాస్వరం ఎరువును మొత్తం వేసుకోవాలి.
- ప్రత్తి విత్తిన వెంటనే లేదా విత్తిన 48 గంటల లోపల పెండిమిథాలిన్ 1.5-2.0 లీ./ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి నేలంతా తడిచేటట్లు పిచికారి చేయటం వలన విత్తిన 20 రోజుల వరకు కలుపును సమర్ధవంతంగా నివారించ వచ్చు.
- ప్రత్తి విత్తిన 20-30 రోజులకు మొదటి దఫా సిఫారసు చేసిన నత్రజని మరియు పొటాష్ (50 కిలోల యూరియా + 15 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్) ఎరువులను నేలలో సరిపడినంత తేమ ఉన్నప్పుడు పై పాటుగా వేసుకుని అరకలతో అంతర కృషి చేసుకోవాలి.
- విత్తిన 20-30 రోజులప్పుడు గొర్రు మరియు గుంటకలతో అంతర కృషి ద్వారా కలుపు నివారణ చేయాలి.
- విత్తిన 40 నుండి 50 రోజుల దశలో వేప నూనె ఒక లీటరు ఎకరానికి పిచికారి చేయటం వలన తొలి దశలో ఆశించే రసం పీల్చే పురుగులు గుడ్లు పెట్టకుండా నివారించవచ్చు.
- పురుగుల ఉధృతిని అనుసరించి రసం పీల్చు పురుగుల నివారణకు లీటరు నీటికి ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా ఫిప్రోనిల్ 2.0 మి.లీ. లేదా ఇమిడాక్లోప్రిడ్ 200 యస్.ఎల్. 0.4 మి.లీ. లేదా ఎసిటామాప్రిడ్ 0.2 గ్రా. లేదా థయోమిథాక్సామ్ 0.2 గ్రా. కలిపి పిచికారి చేయాలి. విత్తిన 60 రోజుల వరకు నియోనికోటినైడ్ మందులైనటు వంటి ఇమిడాక్లోప్రిడ్, ఎసిటామాప్రిడ్ మరియు థయోమిథాక్సామ్ మందులను పిచికారి చేయరాదు.

**డా॥ యం. సుధారాణి,** ప్రధాన శాస్త్రవేత్త (ప్రత్తి)
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం,
లాం, గుంటూరు - 522 034. చరవాణి : 99896 25207




**మినుము మరియు పెసర :**

**అనువైన రకాలు :**

**మినుము :** ఎల్.బి.జి. 884, జి.బి.జి. 1, టి.బి.జి. 104, ఎల్.బి.జి. 752, పి.యు. 31.

**పెసర :** ఎల్.జి.జి. 607, ఎల్.జి.జి. 460, ఐ.పి.యం. 2-14, టి.యం. 96-2, డబ్ల్యు.జి.జి. 42.

**నేల తయారీ :** మురుగు నీరు పోవు వసతి గల, తేమను నిలుపుకో గల భూములు అనువైనవి. చవిటి భూములు పనికిరావు. వేసవి దుక్కి చేసి తొలకరి వర్షాలు పడగానే గొర్రుతో నేలను మెత్తగా తయారు చేసుకోవాలి. ఆఖరు దుక్కిలో 20 కిలోల నత్రజని, 50 కిలోల భాస్వరం ఎరువులను హెక్టారుకు వేసి కలియ దున్నాలి.

**విత్తనశుద్ధి :** ఒక కిలో విత్తనానికి 3 గ్రా. థైరమ్ లేదా కాప్టాన్ లేదా మాంకోజెబ్ మందుతో విత్తనశుద్ధి చేసి తరువాత 5 గ్రా. థయోమిథాక్సామ్ లేదా 5 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్ మందుతో విత్తన శుద్ధి చేసి విత్తితే తొలిదశలో ఆశించే రసం పీల్చే పురుగులు మరియు తెగుళ్ళ బారి నుండి కాపాడుకోవచ్చు. చివరగా విత్తే ముందు 200 గ్రా. రైజోబియం కల్చరును 10 కిలోల విత్తనానికి పట్టించి విత్తుకోవాలి.

**విత్తు సమయము :** జూన్ 1 నుండి జులై 15 వరకు

**విత్తన మోతాదు :** పెసర : 15-16 కిలోలు/హెక్టారు
మినుము : 18-20 కిలోలు/హెక్టారు

**విత్తు దూరం :** 30×10 సెం.మీ. దూరంలో గొర్రుతో విత్తుకోవాలి.

**అంతరకృషి :** పెసర/మినుము పైరును 30 రోజుల వరకు కలుపు బారినుండి రక్షించుకోవాలి. 20 రోజులు, 30 రోజుల దశలో గొర్రు / దంతి ద్వారా అంతరకృషి చేస్తే కలుపు నివారణతో బాటు తేమను గూడా నిలుపుకోవచ్చు. కలుపు అధికంగా ఉండే భూములలో అయితే విత్తిన వెంటనే పెండిమిథాలిన్ 30% ఎకరాకు 1.0-1.4 లీటర్లు చొప్పున విత్తిన వెంటనే గానీ మరసటి రోజు గానీ పిచికారి చేయాలి.

## కంది

**రకాలు :** ఎల్.ఆర్.జి. 105, టి.ఆర్.జి. 59, ఎల్.ఆర్.జి. 133-33, ఎల్.ఆర్.జి. 52, ఎల్.ఆర్.జి. 41, ఐ.సి.పి.ఎల్. 85063 (లక్ష్మి), ఐ.సి.పి. 8863 (మారుతి), ఐ.సి.పి.ఎల్. 87119 (ఆశ).

వెర్రి తెగులు ఉధృతి వున్న ప్రాంతాలలో వెర్రితెగులును తట్టుకునే రకాలైన ఎల్.ఆర్.జి. 105, టి.ఆర్.జి. 59, బి.ఎస్.ఎమ్.ఆర్. 736, ఐ.సి.పి.ఎల్. 87119 రకాలను సాగు చేసుకోవాలి. అదేవిధంగా గత పంట తాలూకు వెర్రి తెగులు సోకిన మొక్కలు మరియు వాటి అవశేషాలను సమూలంగా నాశనం చేయటానికి వేసవి దుక్కులు చేయాలి.

**నేలలు - నేల తయారీ :** మురుగు నీరు పోవు వసతి గల భూములు అనువైనవి. వేసవిలో తొలకరి వర్షాలు పడగానే గొర్రుతో మెత్తగా దున్నాలి. ఆఖరు దుక్కిలో హెక్టారుకి 20 కిలోల నత్రజని, 50 కిలోల భాస్వరము నిచ్చు ఎరువులు వేసి కలియదున్నాలి. విత్తుటకు ముందు 10 కిలోల విత్తనానికి 200 గ్రా. రైజోబియం కల్చరు పట్టించి విత్తుకోవాలి.

**విత్తు సమయము :** జూన్, జులై మాసాలు అనువైనవి.

**విత్తన మోతాదు :** 5-6 కిలోలు/హెక్టారుకు నేల స్వభావాన్ని బట్టి 120×20 సెం.మీ. నుండి 240×20 సెం.మీ. వరకు

**కలుపు నివారణ :** కలుపు బెడద ఎక్కువగా ఉన్నపుడు విత్తిన వెంటనే (24 గంటల లోపు) ఎకరానికి 1.0-1.4 లీ. పెండిమిథాలిన్ 200 లీటర్ల నీటికి కలిపి పిచికారి చేయవలెను.

**డా॥ ఎస్. రాజమణి,** ప్రధాన శాస్త్రవేత్త (అపరాలు)
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం. లాం, గుంటూరు.
చరవాణి నెం : 99499 07117

## చెఱకు



- ఫిబ్రవరి - మార్చి మాసాల్లో నాటిన మొక్క తోటల్లో చాళ్లలో మట్టిని ఒక అడుగు లోతు వరకు త్రవ్వి దుబ్బుల మొదళ్ళకు మట్టిని ఎగద్రోయాలి.
- డిసెంబరు - జనవరిలో నాటిన చెరకు తోటలకు, కార్శి చేసిన తోటలకు మొవ్వులో 8 పచ్చటి ఆకులు వదిలి జడచుట్లు వేసుకోవాలి.
- వర్షపాతాన్ని అనుసరించి, చెరకు బాగా ఎదిగే దశలో (జూన్ - జూలై) నేల స్వభావాన్ని బట్టి వర్షాభావ పరిస్థితుల్లో తేలిక నేలలకు 10 రోజులకు, బరువైన నేలలకు 15 రోజులకు తడులు ఇవ్వాలి.
- లోతట్టు ప్రాంతాలలో, మురుగు నీటిని చెరకు తోటల నుండి బయటకు తీసి వేసేందుకు 2 అడుగుల లోతులో ఊట కాలువలు ఏర్పాటు చేసుకోవాలి.
- కొన్ని ప్రాంతాలలో చెరకు పొలం చుట్టూ వరి సాగు ఉంటుంది. అటువంటి పరిస్థితుల్లో వరి పొలంలో నీరు

చెరకు తోటల్లోకి రాకుండా చుట్టూ ఉన్న గట్లను బలంగా వేసుకోవాలి.

**వర్షాధారపు చెరకు సాగు :**

- వర్షాధారంగా చెరకు సాగు చేసే ప్రాంతాల్లో తొలకరి వర్షాలకు చిజిల్ / సబ్ సాయిలర్ తోలడం వలన పంట కాలంలో వర్షపు నీరు భూమి లోపలి పొరల్లోకి ఇంకుతుంది. దీని వలన ఎక్కువ తేమ నిలవ వుండి పంట నీటి ఎద్దడికి గురి కాకుండా వుంటుంది.
- ఉత్తరకోస్తా జిల్లాలలో సాగు చేయబడు వర్షాధారపు చెరకు సాగుకు నేలను ఇనుప నాగళ్ళతో తోతు దుక్కిచేసి, ఎకరానికి 10 టన్నుల బాగా మాగిన పశువుల ఎరువు వేసి కలియ దున్నాలి. నేలను బాగా చదును చేసి 60 సెం.మీ. ఎడంతో చాళ్ళు ఏర్పాటు చేసుకోవాలి.
- చెరకు విత్తనాన్ని 10 శాతం సున్నపు నీటిలో ఒక గంట సమయం ముంచి నాటుకోవాలి. దీని కారణంగా మొలక శాతము బాగుంటుంది.
- చెరకు నాట్లకు ముందుగా ఎకరానికి 125 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేటు మరియు 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌లను చాళ్ళలో వేసుకోవాలి.
- చెరకు నాట్లు జులై 15 లోగా పూర్తి చేసుకోవాలి.
- చెరకు ముచ్చెలు నాటిన మూడు రోజుల లోపు ఎకరానికి 2 కిలోల "అట్రాజిన్" లేదా 600 గ్రా. మెట్రిబ్యుజిన్ కలుపు మందును 200 లీటర్ల నీటిలో కలిపి పొలమంతా పిచికారి చేసుకోవాలి.
- నాటిన 3 రోజుల లోపుగా కలుపు మందు పిచికారి చేసిన పిదప ఎకరానికి 1.25 టన్నుల చెరకు చెత్తను కప్పుట ద్వారా నేలలోని తేమ సంరక్షింపబడి, కలుపు మరియు పీకపురుగు ఉధృతి తగ్గుతుంది.
- వర్షాధారంగా జూన్‌లో నాటిన చెఱకు తోటలకు మొదటి దఫా నత్రజని ఎరువును (ఎకరానికి 30 కిలోల యూరియా) భూమిలో తగినంత పదును ఉన్నప్పుడు వేసుకోవాలి.
- పంట తొలి దశలో దీర్ఘకాలిక బెట్ట పరిస్థితులు నెలకొన్నప్పుడు లీటరు నీటికి 25 గ్రా. యూరియా మరియు 25 గ్రా. మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌లను కలిపి పంటపై పిచికారి చేసుకోవాలి.

**డా॥ టి. చిత్కళా దేవి,** ప్రధాన శాస్త్రవేత్త (చెఱకు),
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, అనకాపల్లి.
చరవాణి : 99896 25216




- వర్షాధారంగా దీర్ఘకాలిక మరియు మధ్యకాలిక రకాలను జూలై 15 వరకు మరియు స్వల్పకాలిక రకాలను జూలై ఆఖరి వరకు విత్తుకోవచ్చు.
- ఎకరాకు 10 కిలోల విత్తనం వాడాలి. మొక్కజొన్నలో ఎకరాకు 33,333 మొక్కల సాంద్రత ఉండేలా చూసుకోవాలి. ఇందుకు వరుసల మధ్య 60 సెం.మీ. ఎడం ఉండేటట్లు బోదెలను చేసుకుని మొక్కల మధ్య 20 సెం.మీ. ఉండేటట్లు విత్తనాన్ని బోదేకు ఒక వైపున పై నుండి $^{1}/_{3}$ వ వంతు ఎత్తులో విత్తుకుంటే నీటి పారుదలకు సులభంగా ఉండడమేకాక, వర్షపాతం ఎక్కువైనప్పుడు నీరు బయటకు పోవడానికి వీలుంటుంది. వర్షాధారంగా పండించే మొక్కజొన్న పైరులో ఎకరాకు 70-80 కిలోల నత్రజని, 24 కిలోల భాస్వరం, 20 కిలోల పొటాష్ నిచ్చు ఎరువులు మరియు 20 కిలోల జింక్ సల్ఫేట్ అవసరం. తొలి దఫాగా $^{1}/_{3}$ వ వంతు నత్రజని, మొత్తం భాస్వరం, సగం పొటాష్, మొత్తం జింక్ ఆఖరి దుక్కిలో వేసి కలియదున్నాలి.
- ఎండు తెగులు ఆశించు భూములలో మొక్కజొన్న విత్తేటప్పుడు, ట్రైకోడెర్మా విరిడి జీవ శిలీంద్రనాశిని మందును కిలో విత్తనానికి 10 గ్రా. చొప్పున కలిపి విత్తన శుద్ధి చేయాలి మరియు 2 కిలోల ట్రైకోడెర్మా విరిడి మందును 100 కిలోలు బాగా మాగిన పశువుల ఎరువుతో కలిపి వృద్ధి పరచి దుక్కిలో వేయాలి.
- విత్తిన 1-2 రోజులకు అట్రజిన్ 50% పొడి మందును ఎకరాకు 800-1200 గ్రా. 200 మి.లీ. నీటిలో కలిపి తేమ నేల పై పిచికారి చేయడం వలన వెడల్పాటి ఆకులు గల కలుపు మొక్కలను దాదాపు ఒక నెల వరకు అదుపు చేసుకోవచ్చు. ఒకవేళ పప్పు జాతి పంటలను మొక్కజొన్నతో అంతర పంటలుగా విత్తుకుంటే పెండిమిథాలిన్ కలుపు

మందును ఎకరాకు 1.0 లీ. చొప్పున పిచికారి చేయాలి. 20-25 రోజుల దశలోని పంటలో టేంబోట్రియాన్ కలుపు మందును 1.15 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసినట్లయితే కలుపును నియంత్రించవచ్చు.

- జూన్ నెలలో విత్తుకున్న మొక్కజొన్న పైరు మోకాలెత్తు దశలో ఉంటుంది. ఎక్కువ వర్షపాతం నమోదైనప్పుడు లేత పైరు అధిక తేమను తట్టుకోలేదు. ఈ పరిస్థితిని అధిగమించుటకు పొలం నుండి వర్షపు నీరును మురుగు నీటి కాలువల ద్వారా బయటకు తీయాలి.
- 25-30 రోజులు వయసున్న పైరులో అంతర కృషి జరిపి ఎకరాకు ఒక బస్తా యూరియాను పైపాటుగా వేసుకుని మట్టిని మొక్కల వేర్లకు ఎగదోయాలి. అవసరమైతే నీరు పెట్టాలి.
- కత్తెర పురుగు మొక్కజొన్న అన్ని దశలలో ఆశిస్తుంది. దీని నివారణకు పంటను సకాలంలో విత్తుకోవాలి, విడతలుగా విత్తకూడదు. సయాంట్రీనిప్రోల్ 19.8% + థయోమిథాక్సామ్ 19.8% 4.0 మి.లీ. ఒక కిలో విత్తనానికి పట్టించి విత్తన శుద్ధి చేసుకోవాలి. విత్తనం విత్తిన వారం రోజులకు ఎకరానికి 4 లింగాకర్షక బుట్టలను అమర్చుకోవాలి. ఈ పురుగు మొక్కల ఆకుల పై పెద్ద పెద్ద రంధ్రాలు చేయడంతో పాటు, మొక్క సుడిలో పురుగు విసర్జన ఎక్కువగా కనిపిస్తుంది. పంట తొలి దశలో 5% వేప గింజల కషాయం లేదా అజాడిరెక్టిన్ వేప సంబంధ మందులు పిచికారి చేయాలి. ఉధృతిని బట్టి ఎమామేక్టిన్ బెంజోయేట్ 5 ఎస్.డి. 0.4 గ్రా. లేదా క్లోరాంట్రనిలిప్రోల్ 18.5% ఎస్.సి. 0.3 మి.లీ. లేదా స్పైనిటోరం 11.7% ఎస్.సి. 0.5 మి.లీ. లీటరు నీటికి కలిపి సుడులు/ మొవ్వు లోపలి ఆకులు పూర్తిగా తడిచేటట్లు పిచికారి చేయాలి. ఈ పురుగు యొక్క ఉనికిని రైతులు ఎప్పటికప్పుడు గమనిస్తూ, సరైన యాజమాన్య పద్ధతులు సరైన సమయంలో పాటించినట్లయితే పురుగు వల్ల కలిగే అపారమైన నష్టాన్ని నివారించుకోవచ్చు.

**డా॥ ఐ. సుధీర్ కుమార్,**
శాస్త్రవేత్త (మొక్కల ప్రజనన శాస్త్రం) వ్యవసాయ పరిశోధనా స్థానం, పెద్దాపురం. చరవాణి : 99597 92568




**1. జొన్న :**

- జొన్న పంట విత్తిన రెండు వారాల లోపు ఒత్తు మొక్కలను తీసివేయాలి. విత్తిన 20-30 రోజులకు గుంటక లేదా దంతితో అంతరకృషి చేయడం వలన పొలంలో తేమ నిలిచి మొక్కలు బాగా పెరుగుతాయి.
- కలుపు తీసిన తర్వాత ఎకరాకు 20 కిలోల నత్రజనినిచ్చు ఎరువును (నీటి పారుదల క్రింద) లేదా 16 కిలోల నత్రజనినిచ్చు ఎరువును (వర్షాధార పంటకు) పై పాటుగా పైరులో వేయాలి.
- మొవ్వు తొలుచు ఈగ లేదా కాండం తొలుచు పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే ఎకరాకు 4 కిలోల కార్బోఫ్యూరాన్ గుళికలను సాళ్ళలో వేయాలి.

**2. సజ్జ :**

- సజ్జ పంటను జులై మాసంలో కూడా విత్తుకోవచ్చు.
- సజ్జ విత్తిన పొలంలో విత్తిన రెండు వారాలలోపు ఒత్తు మొక్కలను తీసివేయాలి. విత్తిన 20-30 రోజులలోపు గుంటక లేదా దంతితో అంతరకృషి చేయాలి.
- జొన్న విత్తిన 30 రోజుల తర్వాత ఎకరాకు 16 కిలోల నత్రజనినిచ్చు ఎరువును (నీటి పారుదల పంటకు) 12 కిలోల నత్రజనినిచ్చు ఎరువును (వర్షాధార పంటకు) పై పాటుగా పైరులో వేయాలి.

**3. రాగి :**

- రాగి పంటను జులై మాసంలో కూడా విత్తుకోవచ్చు.
- 2.5 కిలోల విత్తనంతో పెంచిన 5 సెంట్ల నారు ఎకరా పొలంలో నాటడానికి సరిపోతుంది.
- నారు పోయడానికి పొలంను మెత్తగా దున్ని చదును చేసుకోవాలి. నారు మడులను తయారు చేసుకొని విత్తనాలను విత్తుకోవాలి.
- 21-25 రోజుల వయస్సు గల నారును నాటుకోవాలి.

- వెదజల్లే పద్ధతిలో భూమిని మెత్తగా తయారు చేసుకొని విత్తనాన్ని సమానంగా చల్లుకోవాలి. విత్తిన రెండు వారాలలోపు ఒత్తు మొక్కలను తీసివేయాలి.
- విత్తనం వేసే ముందు లేదా నారు నాటడానికి ముందు పెండిమిథాలిన్ 30% ఎకరాకు 600 మి.లీ. చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేస్తే కలుపు మొక్కలను నివారించుకోవచ్చును.
- ఎకరాకు 12 కిలోల నత్రజని, 12 కిలోల భాస్వరం మరియు 8 కిలోల పొటాష్‌ను నాటేటప్పుడు వేయాలి.

### 4. కొర్ర :

- కొర్ర పంటను జులై మాసంలో కూడా విత్తుకోవచ్చు.
- కొర్ర పంటలో విత్తిన రెండు వారాలలోపు ఒత్తు మొక్కలను తీసివేయాలి.
- విత్తిన 20-30 రోజులలోపు గుంటక / దంతితో అంతరకృషి చేయాలి.
- ఎకరాకు 8 కిలోల నత్రజని మరియు 8 కిలోల ఫాస్ఫరస్‌ను ఇచ్చు ఎరువులను విత్తే ముందు ఆఖరి దుక్కిలో వేసి కలియదున్నాలి.
- విత్తిన 3-4 వారాల తర్వాత (కలుపు తీసిన తర్వాత) ఎకరాకు 8 కిలోల నత్రజనినిచ్చు ఎరువును పైపాటుగా వేయాలి.

**డా॥ యల్. మాధవీలత,**
సీనియర్ శాస్త్రవేత్త (మొక్కల ప్రజనన శాస్త్రం)
వ్యవసాయ పరిశోధనా స్థానము, పెరుమాళ్ళపల్లె.
చరవాణి : 79819 29538




- ఉత్తర కోస్తా ప్రాంతాలలో జూన్ నుండి జూలై చివరి వరకు, రాయలసీమ జిల్లాలలో జూలై నుండి ఆగష్టు మొదటి వారం వరకు వేరుశనగ పంట వర్షాధారంగా విత్తుకోవడానికి అనుకూలము, నీటి ఆధారం క్రింద ఏ సమయంలోనైనా విత్తుకోవచ్చు.
- వేరుశనగ విత్తుకోవడానికి ముందుగ మంచి రకం విత్తనాన్ని ఎంపిక చేసుకొని విత్తుకోవాలి.
- **అనువైన రకాలు :** కదిరి మరియు తిరుపతి పరిశోధన స్థానాల నుండి విడుదల చేయబడిన రకాలు మనకు ఖరీఫ్ సాగుకు అనుకూలము.
- **కదిరి - 6 :** 105-110 రోజుల పంట కాలం, ఎకరానికి వర్షాధారంగా 720 - 920 కిలోల కాయ దిగుబడిని ఇస్తుంది. నూనె శాతం 48 %.
- **కదిరి 7 మరియు 8 (బోల్డ్) :** ఇవి పెద్ద గుత్తి రకము, పంట కాలం 120-125 రోజులు, ఎగుమతికి అనువైనవి, నీటి వసతి ఉన్న రైతాంగానికి అనుకూలం. ఎకరానికి 1600 - 2000 కిలోల కాయ దిగుబడిని ఇస్తుంది.
- **కదిరి -9 :** ఇది చిన్న గుత్తి రకం, 115 -120 రోజుల పంట కాలం, 45 రోజుల వరకూ బెట్టను మరియు పురుగులను, తెగుళ్లను సమర్థవంతంగా తట్టుకుంటుంది, వర్షాధారంగా ఎకరానికి 800 - 1000 కిలోల కాయ దిగుబడిని ఇస్తుంది. పరిపక్వ నిద్రావస్థ 30 రోజులు. నూనె శాతం 52%.
- **కదిరి హరితాంధ్ర :** జాతీయ స్థాయిలో విడుదలైన చిన్న గుత్తి రకం, పంటకాలం 115 రోజులు, వర్షాధారంగా ఎకరానికి 800-1000 కిలోల కాయ దిగుబడిని ఇస్తుంది, పంట చివరి వరకూ పచ్చగా వుండటం వలన పాడి రైతాంగానికి అనుకూలం.
- **ధరణి :** 105 - 110 రోజుల పంట కాలం, బెట్టను పురుగులను మరియు తెగుళ్ళను తట్టుకుంటుంది. వర్షాధారంగా ఎకరానికి 800 - 1000 కిలోల కాయ దిగుబడినిస్తుంది.
- **కదిరి అమరావతి :** ఇది చిన్న గుత్తి రకం, 115 - 120 రోజుల పంట కాలం, బెట్టను మరియు పురుగులను మరియు కాండం కుళ్ళు వైరస్ తెగులును సమర్థవంతంగా తట్టుకుంటుంది, వర్షాధారంగ ఎకరానికి 800 - 1000 కిలోల కాయ దిగుబడిని ఇస్తుంది. పరిపక్వ నిద్రావస్థ 30 రోజులు, నూనె శాతం 50%.
- **కదిరి చిత్రావతి :** చిన్నగుత్తి రకం, అకుమచ్చ, కాండం

కుళ్ళు, మువ్వకుళ్ళు వైరస్, వేరుకుళ్ళు, రసం పీల్చు పచ్చదోమ, తామర పురుగులను తట్టుకుంటుంది. వర్షాధారంగా 800-900 కిలోలు ఎకరానికి కాయ దిగుబడిని ఇస్తుంది.

- **నిత్య హరిత :** పొట్టి రకం, 110-115 రోజుల పంట కాలం, అధిక శాతం 3 గింజల కాయలు, కొద్ది వరకు రసం పీల్చు పురుగులను తట్టుకుంటుంది. పరిపక్వ నిద్రావస్థ 20 రోజులు.
- **ధీరజ్ :** 100-105 రోజుల పంట కాలం, తక్కువ నీటి వినియోగంతో ఎక్కువ దిగుబడిని ఇస్తుంది. అధిక వేడిని, అధిక చలిని కొంత వరకు తట్టుకుంటుంది. నీటి సదుపాయంతో ఖరీఫ్, రబీ సీజన్లలో సాగుకు అనుకూలం.
- **ప్రగతి :** 95-100 రోజుల పంట కాలం, పొట్టి రకం, అధిక నీటి వినియోగ సామర్థ్యం ఉన్న రకం, కాయలు నున్నగా, గింజలు ఆకర్షణీయంగా ఉంటాయి.
- **కదిరి లేపాక్షి :** చిన్నగుత్తి రకం, ఆకుమచ్చ తెగుళ్ళను, వైరస్ తెగుళ్ళను, రసం పీల్చే పురుగులను, ఆకులను తినే పచ్చ, లద్దె పురుగులను తట్టుకుంటుంది. పంటకాలం 125 రోజులు. అధిక నూనె శాతం (51%), అధిక మాంసపు కృతులను కలిగి ఉంటుంది. తీవ్రమైన బెట్ట పరిస్థితులలో కూడా 600-800 కిలోల కాయ దిగుబడిని ఇస్తుంది. సాధారణ వర్షపాత పరిస్థితులలో ఎకరానికి 1400-1800 కిలోల కాయ దిగుబడి ఇస్తుంది.
- విత్తే ముందు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేసుకోవాలి. విత్తన శుద్ధి కొరకు ఒక కిలో విత్తనానికి 2 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్ 600 యఫ్.ఎస్. తరువాత 1.0 గ్రాము టెబ్యుకోనజోల్ 2 డి.యస్. లేదా 3 గ్రాములు మాంకోజెబ్ (75% డబ్ల్యు.పి.) పొడి మందును లేదా 2 గ్రాముల మాంకోజెబ్ 50% + కార్బండెజిమ్ 25% డబ్ల్యు.పి. (స్ప్రింట్) పొడి మందు విత్తనాలకు పట్టించి విత్తుకోవాలి.
- విత్తుకొనే ముందు దుక్కిలో ఎకరానికి 4-5 టన్నుల సేంద్రియ ఎరువును వేయాలి, భూసారానికి అనుగుణంగా సూటి ఎరువులైన నత్రజని కొరకు యూరియా (18 కిలోలు), భాస్వరం కొరకు సింగిల్ సూపర్ ఫాస్పేట్ (100 కిలోలు) మరియు పొటాష్ కొరకు మ్యూరేట్ అఫ్ పొటాష్ (35 కిలోలు) ను సిఫారసు చేసిన మోతాదులో ఆఖరి దుక్కిలో వేసుకోవాలి. జింక్ సల్ఫేట్ ఎకరానికి 20 కిలోలు పైన తెలిపిన ఎరువులలో కలపకుండా వేరుగా చల్లుకోవాలి, కదిరి-7బోల్డ్, కదిరి అమరావతి, కదిరి చిత్రావతి రకాలకు పై ఎరువుల మోతాదును నీటి పారుదల క్రింద రెట్టింపు మోతాదులో వేసుకున్నట్లయితే అత్యధిక దిగుబడి సాధించవచ్చు.
- కాండం కుళ్ళు వైరస్ తెగులు ఆశించే ప్రాంతాలలో పొలం చుట్టూ సజ్జ/జొన్నతో మేరసాళ్ళు (4-6 సాళ్ళు) వేసుకోవాలి.
- వేరుశనగ విత్తే సమయంలో పొలంలో ఒక చదరపు మీటరుకు 33 మొక్కలు ఉండేటట్లుగా చూడాలి. విత్తన పరిమాణంను బట్టి ఒక ఎకరానికి 50-60 కిలోలు విత్తనాన్ని విత్తుకోవాలి.
- మంచి విత్తనాలతో పాటు ముడతలు లేని చిన్న సైజు గింజలను కూడా విత్తనంగా వాడుకోవచ్చును.
- అంతర పంటగా కందిని 7:1 నిష్పత్తిలో (వేరుశనగ 7 సాళ్ళు : కంది 1 సాలు) విత్తుకొన్నట్లయితే మంచి లాభదాయకంగా ఉంటుంది.
- విత్తిన వెంటనే 48 గంటలు లోపల కలుపు నివారణకు "పెండిమిథాలిన్ 30 % ఇ.సి" అనే కలుపు నాశిని 1 ఎకరాకు 1 లీటరును, 200 లీటర్లు నీటిలో కలిపి నేలపై పిచికారి చేయాలి.

**డా॥ ఎ. ప్రసన్న రాజేష్**
ప్రధాన శాస్త్రవేత్త (వేరుశనగ), వ్యవసాయ పరిశోధనా స్థానం,
కదిరి. చరవాణి : 94405 66582



## ప్రొద్దు తిరుగుడు

- ఖరీఫ్‌లో ప్రొద్దుతిరుగుడు పంటను తేలిక పాటి నేలల్లో జూన్ రెండవ పక్షము నుండి జూలై 15 వరకు విత్తుకోవచ్చు.

- ఈ పంటను ఏక పంటగాను లేదా వేరుశనగ, కంది, కొర్ర పంటలతో అంతర పంటగాను వేసుకోవచ్చు.
- భూమిని నాలుగైదు సార్లు బాగా దున్ని మెత్తటి దుక్కిని తయారు చేసి తరువాత చదును చేసి విత్తనం వేసుకోవాలి.
- ఎకరానికి రెండు కిలోల విత్తనం సరిపోతుంది.
- విత్తనాలను విత్తే ముందు 14 గంటలు నీటిలో నానబెట్టిన తరువాత నీడలో ఆరబెట్టి విత్తనశుద్ధి చేయాలి.
- ఈ పంటకు 24:24:12 కిలోల నత్రజని, భాస్వరం మరియు పొటాష్ ఎరువులు ఒక ఎకరాకు అవసరం. భూసార పరీక్ష ద్వారా భాస్వరం నేలలో మధ్యస్థం నుండి అధికంగా ఉన్నట్లయితే భాస్వరం ఎరువులు అవసరం లేదు.
- గంధకం తక్కువగా ఉన్న నేలల్లో ఎకరానికి 55 కిలోల జిప్సం వేయాలి.
- సరైన మొక్కల సాంద్రత కొరకు వరుసల మధ్య తేలిక నేలల్లో 45 సెం.మీ., మొక్కల మధ్య 20-25 సెం.మీ. మరియు బరువు నేలల్లో వరుసల మధ్య 60 సెం.మీ., మొక్కల మధ్య 30 సెం.మీ. దూరం ఉంచాలి.
- కలుపు నివారణకు పెండిమిథాలిన్ 30% అనే మందును లీటరు నీటికి 5 మి.లీ. చొప్పున కలుపుకొని విత్తిన వెంటనే లేదా మరుసటి రోజు పిచికారి చేసుకోవాలి.
- విత్తిన 10-15 రోజుల తరువాత కుదురుకు ఒక ఆరోగ్యవంతమైన మొక్కను ఉంచి మిగిలిన మొక్కలను తీసివేయాలి.
- ఖరీఫ్‌లో ఎక్కువగా ఆల్టర్నేరియా ఆకుమచ్చ తెగులు ఆశిస్తుంది. కనుక దీని నివారణకు క్వింటాల్ (ఇప్రోడియోన్ 25% + కార్బండెజిమ్ 25%) అనే మందుని 2 గ్రా. కిలో విత్తనానికి వాడి విత్తనశుద్ధి చేయాలి.
- నెక్రోసిస్ వైరస్ అధికంగా ఆశించు ప్రాంతాలలో కిలో విత్తనానికి థయోమిథాక్సామ్ 4 గ్రా. కలిపి విత్తనశుద్ధి చేయాలి.

**డా॥ బి.వి. రవి ప్రకాష్ రెడ్డి,**
శాస్త్రవేత్త (మొక్కల ప్రజనన శాస్త్రం), చరవాణి : 99666 65434
**డా॥ కె. వెంకటరమణమ్మ,**
సీనియర్ శాస్త్రవేత్త (మొక్కల తెగుళ్ళ శాస్త్రం) చరవాణి : 99088 29618
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, నంద్యాల.




- జూన్ మాసం నందు వేసిన ఆముదము పంటలో 15-20 రోజులు తర్వాత కణుపుకు ఒక మొక్క ఉండే లాగా, ఒత్తు మొక్కలను పీకి వేయాలి. అదే సమయంలో మొలవని చోట కొత్త గింజను విత్తుకోవాలి.
- మొక్కలు మొలిచిన చోట 20 రోజులకు అంతర కృషితో పాటు ప్రతి వరసకు నీటి సంరక్షణ సాళ్ళు వేసుకున్నట్లు అయితే నీటి మరియు మట్టి సంరక్షణ జరిగి పంట ఎదుగుదలకు మరియు బెట్ట పరిస్థితులను తట్టుకోవడానికి ఉపయోగపడుతుంది.
- పంట 25-30 రోజులు ఉన్న చోట కలుపు నివారణకు గుంటక లేదా గొర్రుతో అంతర కృషి చేసుకోవాలి.
- గాలిలో మరియు నేలలో తేమ అధికంగా ఉన్నప్పుడు లేదా నీరు నిలువ ఉండే ప్రదేశాలలో మొలక కుళ్ళు తెగులు సోకి ఆకులు వాడి కుళ్ళిపోయి మొక్కలు చనిపోయే అవకాశం వుంది. తీవ్రత ఎక్కువగా వున్నప్పుడు మెటలాక్సిల్ పొడి మందును 2 గ్రాముల చొప్పున ఒక లీటరు నీటికి కలిపి పంటపై పిచికారి చేయాలి.
- వర్షాధారంగా ఆముదము పంట సాగు చేయటానికి జులై మాసం చివరి వరకు అనుకూలం. రైతులు మంచి దిగుబడినిచ్చే రకాలు లేదా సంకర జాతి రకాలకై ఈ క్రింది ఇచ్చిన చిరునామాలను సంప్రదించగలరు. క్రాంతి, హరిత, కిరణ్, ప్రగతి సూటి రకాలను మరియు పి.సి.హెచ్.-111, పి.సి.హెచ్.-222 అను హైబ్రిడ్‌లను ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, పాలెం (నాగర్ కర్నూల్ జిల్లా, తెలంగాణ) నుండి పొందవచ్చు. జ్యోతి, జ్వాల, డి.సి.ఎస్.-107 సూటి రకాలను మరియు డి.సి.హెచ్.-519, డి.సి.హెచ్.-177,

ఐ.సి.హెచ్.-66, ఐ.సి.హెచ్.-5 సంకర జాతి రకాలను (హైబ్రిడ్‌లను) అఖిల భారత నూనె గింజల పరిశోధనా సంస్థ, రాజేంద్రనగర్, హైదరాబాద్ నుండి పొందవచ్చు.

- ఎకరానికి 2 టన్నుల పశువుల ఎరువును దుక్కిలో వేసి కలియ దున్నాలి. విత్తేటప్పుడు 12 కిలోల నత్రజని, 16 కిలోల భాస్వరం మరియు 12 కిలోల పొటాషియం ఇచ్చే సూటి ఎరువులను వేసుకోవాలి.
- ఒక కిలో విత్తనానికి 3 గ్రా. థైరమ్ / కాప్టాన్ పొడి మందును కలిపి విత్తన శుద్ధి చేయటం వలన మొలక కుళ్ళు తెగులు (ఫైటోఫ్తోరా బ్లైట్), ఆల్టర్‌నేరియా ఆకుమచ్చ తెగులు మరియు కొంతవరకు వడలు తెగులును అరికట్టవచ్చు. వడలు తెగులు ప్రభావం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో కిలో విత్తనానికి 3 గ్రా. కార్బండెజిమ్ లేదా 10 గ్రా. ట్రైకోడెర్మా విరిడితో విత్తనశుద్ధి చేయాలి.
- వర్షాధారంగా సాగు చేసినప్పుడు అధిక దిగుబడికై సిఫారసు చేసిన 90×60 సెం.మీ.ల కనీస దూరం పాటించాలి. డ్రిప్పు పద్ధతిలో లేటరల్‌కు లేటరల్‌కు మధ్య 120 సెం.మీ. దూరము, డ్రిప్పుకు డ్రిప్పుకు మధ్య దూరము 45 సెం.మీ., 4 లీ. డిశ్చార్జి గల డ్రిప్పులు వాడి $2^1/_2$-8 గంటలు మూడు రోజుల కొకసారి నీటిని ఇస్తే మంచి దిగుబడులు సాధించవచ్చును.
- ఎద్దుల వెంట గొర్రుతో విత్తటం, బోదెల మీద చేతితో విత్తటం మామూలు పద్ధతి. అనంత విత్తు పరికరంతో ఆముదమును తక్కువ సమయంలో అధిక విస్తీర్ణంలో విత్తవచ్చు.
- ఆముదంలో అంతర పంటలుగా వేరుశనగ 1:5 నిష్పత్తిలో; సజ్జ / జొన్న / గోరు చిక్కుడు / అలసంద పంటలుగా 1:2 నిష్పత్తిలో, కంది పంట 1:1 నిష్పత్తిలో వేయవచ్చు.

**డా॥ ఎ.వి.ఎస్. దుర్గాప్రసాద్,**
సీనియర్ శాస్త్రవేత్త (మొక్కల ప్రజనన శాస్త్రం),
చరవాణి : 99892 10879
**డా॥ వై. పవన్ కుమార్ రెడ్డి**, శాస్త్రవేత్త (సేద్య శాస్త్రం)
వ్యవసాయ పరిశోధనా స్థానం. అనంతపురము.
చరవాణి : 99669 70300




**నీటి యాజమాన్యం :** విత్తిన తర్వాత 35-40 రోజుల (పూత దశలోను) నుండి 55-60 రోజుల (కాయ దశలో) వరకు నీటి ఎద్దడి లేకుండా చూడాలి.

**సస్యరక్షణ :**

**రసం పీల్చే పురుగులు (తెల్ల నల్లి, తామర పురుగులు, పచ్చదోమ) :**

పిల్ల, తల్లి పురుగులు ఆకుల అడుగు భాగాన చేరి ఆకుల నుండి రసాన్ని పీల్చి వేస్తాయి. ఆకులు పాలిపోయి, తర్వాత దశలో ఎండిపోతాయి. తెల్లనల్లి ఆశిస్తే ఆకులు ముదురు ఆకుపచ్చ రంగుకు మారి ఈనెలు పొడవుగా సాగి క్రింది వైపుకు ముడుచుకొని పోయి, దోనె ఆకారంగా మారి పాలిపోతాయి.

**నివారణ :** రసం పీల్చే పురుగుల్లో తామర పురుగు, పచ్చదోమ నివారణకు మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా డైమిథోయేట్ 2 మి.లీ. ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

తెల్ల నల్లి నివారణకు డైకోఫాల్ 3 మి.లీ. లేదా డైమిథోయేట్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**వెర్రి తెగులు (ఫిల్లోడి) :**

ఈ తెగులు పూత సమయంలో ఆశిస్తుంది. సాధారణంగా ఆలస్యంగా వేసిన పంటలో ఎక్కువగా వస్తుంది. తెగులు సోకిన మొక్కల్లో ఆకులు చిన్నవై పువ్వులోని భాగాలన్నీ ఆకులు మాదిరిగా మారిపోతాయి. కాయలు ఏర్పడవు. మొక్కల ఎదుగుదల తగ్గి పైభాగం చిన్న ఆకులు గుబురుగా ఉండి వెర్రితల మాదిరిగా ఉంటుంది. ఈ తెగులు దీపపు పురుగుల ద్వారా వ్యాప్తి చెందు తుంది.

**నివారణ :** తెగులు కనిపించిన వెంటనే తెగులు సోకిన మొక్కలను పీకి తగులబెట్టాలి. పైరుపై మిథైల్ డెమటాన్ 1 మి.లీ. లేదా డైమిథోయేట్ 2 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేసి దీపపు పురుగులను అరికట్టాలి.

**వేరుకుళ్ళు, కాండం కుళ్ళు తెగులు :**

కాండం మీద నల్లని చారలేర్పడతాయి. వేర్లు పూర్తిగా లేదా పాక్షికంగా కుళ్ళిపోతాయి. మొక్క మొత్తం ఎండిపోయి ఆకులు పసుపు రంగుకు మారి వ్రేలాడుతూ ఉంటాయి.

**నివారణ :** దీని నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా మాంకోజెబ్ 3 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**ఆకుమచ్చ (ఆల్టర్నేరియా) తెగులు :**

ఆకులపై కాండము మీద గోధుమ రంగు మచ్చలు ఏర్పడతాయి. ముదురు గోధుమ రంగు కలిగిన చిన్న చిన్న వలయాకారపు మచ్చలు ఆకు అంతా వ్యాపించి ఆకులు ఎండిపోయి, రాలిపోతాయి.

**నివారణ :** పంట దశలో కార్బండెజిమ్ 1 గ్రా. లేదా మాంకోజెబ్ 3 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి 15 రోజుల వ్యవధిలో 2-3 సార్లు పిచికారి చేయాలి.

**డా॥ టి. తులసీ లక్ష్మి,**
శాస్త్రవేత్త (సేద్య శాస్త్రం) మరియు అధిపతి,
వ్యవసాయ పరిశోధనా స్థానం, యలమంచిలి,
విశాఖపట్నం జిల్లా. ఫోన్ నెం. 89853 70076




- సాధారణంగా మన రాష్ట్రంలో వర్షాధారంగా పండించే పంటలు మరియు పండించే కాలము జూన్ రెండవ వారంలో ప్రారంభమై అక్టోబర్ చివరి వరకు ఉంటుంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో కురిసే వర్షము, భూమిలో నిల్వ ఉండే తేమను బట్టి, పంట కాల పరిమితి వర్షాధారపు ఎర్ర నేలల్లో 90- 150 రోజులు, నల్ల రేగడి నేలల్లో 150 -180 రోజులు ఉంటుంది.
- భూమి వాలుగా ఉంటే, కాంటూరు సేద్యం (వాలుకడ్డంగా విత్తడము, అంతరకృషి చేయడము) చేసుకోవడం వలన నీటి ఒరవడిని ఎక్కడికక్కడే అరికట్టి ఎక్కువ నీటిని భూమిలోనికి ఇంకింప చేసుకోవచ్చు.
- వర్షాధార భూముల్లో అనువైన పంటలు వేసిన తరువాత, పడిన వర్షపు నీరు భూమిలో ఎక్కువగా ఇంకేందుకు నాగలితో సుమారు 1-3 మీటర్లకు ఒకటి చొప్పున తేమ సంరక్షణా చాళ్ళను లోతుగా, పంట విత్తిన తరువాత 25-30 రోజులకు తీయవలెను. ఈ తేమ సంరక్షణా చాళ్ళు, సాధారణ వర్షం కురిసినప్పుడు వర్షపు నీటిని అడ్డగించి భూమిలోనికి ఇంకునట్లు చేసి పంటకు ఎక్కువ కాలం తేమను అందజేస్తాయి. అధిక వర్షం కురిసినప్పుడు నీటి ప్రవాహం వలన మట్టి కొట్టుకొని పోకుండా మురుగనీటి కాలువ లాగా కూడా పనిచేస్తాయి.
- నల్లరేగడి నేలల్లో వెడల్పాటి బోదెలు మరియు కాలువలుగా నేలను తయారుచేసి, వెడల్పాటి బోదెలపైన విత్తుకోవాలి. కాలువలు ఎక్కువ నీటిని బయటికి పంపడానికి ఉపయోగపడతాయి. లోతైన నల్ల రేగడి నేలలకు ఈ పద్ధతి అనుకూలం. అంతే గాక, ప్రతి 3 మీటర్ల వెడల్పుతో 20 సెం.మీ. ఎత్తు గల ఎత్తైన వెడల్పాటి బోదెలు వేసి విత్తుకొన్నచో మంచి దిగుబడులు వస్తాయి. బోదెల ప్రక్కన కాలువలు తక్కువ వర్షం వచ్చినప్పుడు నీరు ఇంకడానికి, ఎక్కువ వర్షం వచ్చినప్పుడు నీరు బయటకు పోవడానికి ఉపయోగపడతాయి.
- వేరుశనగలో అంతర పంటగా కందిని వేసేటప్పుడు కందితో పాటు వర్షపు నీటి ఒరవడిని అరికట్టే పంటలైన ఉలవ, అలసంద కలిపి విత్తితే, నేల మరియు వర్షపు నీటిని సంరక్షించి, బెట్ట పరిస్థితుల్లో కూడా అధిక దిగుబడితో పాటు అధిక నికర ఆదాయం పొందవచ్చు.
- వర్షాధార ఎర్రనేలల్లో ముఖ్యంగా వేరుశనగ, కంది, ఆముదము, జొన్న మరియు సజ్జ పంటలను జూన్ - జులై నెలల్లో విత్తుకోవచ్చును.
- నల్లరేగడి నేలల్లో ప్రత్తి, కంది మరియు ఆముదము పంటలను జూన్ - జులై నెలల్లో విత్తుకోవచ్చును.

- వేరుశనగలో భూసార పరీక్షలను అనుసరించి ఎరువులను వేసుకోవాలి. వీలైనంత వరకు, సూటి ఎరువులు వాడటం మంచిది. తద్వారా, మొక్కలకు కావాల్సిన పోషకాలు సమాన మోతాదులో అందడమే కాక, ఖర్చు కూడా తగ్గుతుంది.
- మన రాష్ట్రంలో భాస్వరం చాలా వరకు కరగని స్థితిలో భూమిలో నిలువ ఉంది. కావున, నేలలో భాస్వరాన్ని కరిగించే జీవన ఎరువులు ఫాస్ఫేట్ సాల్యుబులైజింగ్ బాక్టీరియా 5 కిలోలు మరియు ఫాస్ఫేట్ మొబిలైజింగ్ మైకోరైజా 12.5 కిలోలు ఒక హెక్టారుకు వేసుకున్నట్లయితే మంచి దిగుబడి సాధించవచ్చు మరియు ఎరువులకయ్యే ఖర్చును కొంతవరకు తగ్గించుకోవచ్చు.
- కొందరు రైతులు వేరుశనగలో లావు గింజలను మాత్రమే వేరు చేసి విత్తుతున్నారు. తద్వారా, సాగు ఖర్చు పెరుగుతుంది. అలా కాకుండా, వేరుశనగలో కాయల నుండి వచ్చే చిన్న, సన్న విత్తనాలను కలిపి కూడా విత్తుకోవడం వలన వేరుశనగ దిగుబడులలో ఎలాంటి తగ్గుదల ఉండదు, సాగు ఖర్చు తగ్గుతుంది.
- వర్షాధారపు ఎర్ర నేలల్లో తేమ తక్కువ రోజులు నిలువ ఉంటుంది, కావున విత్తే సమయం తక్కువగా ఉంటుంది. కావున, తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో విత్తాలంటే ఆటోమాటిక్ వేరుశనగ విత్తు పరికరముతో సరిపడా తేమ ఉన్నప్పుడు మాత్రమే విత్తుకొనవలెను.
- ఎర్ర నేలల్లో వేరుశనగ + కంది అంతర పంటలుగా 8:1/11:1/15:1 నిష్పత్తిలో విత్తుకోవడం వలన అధిక నికర ఆదాయం పొందవచ్చు.
- వ్యవసాయ పరిశోధనా స్థానం, అనంతపురం శాస్త్రవేత్తలు వేరుశనగ + కంది (8:1) విత్తే పరికరాన్ని (9 కొయ్యలు) రూపొందించారు. దీని వలన పొలం అంతా సమానంగా ప్రతి 8 వరుసలు వేరుశనగ, 1 వరుస కందిని విత్తుకోవచ్చు.

**డా॥ బి. సహదేవ రెడ్డి**
ప్రధాన శాస్త్రవేత్త (మెట్ట వ్యవసాయం)
వ్యవసాయ పరిశోధనా స్థానం, అనంతపురము.
చరవాణి : 99896 25222




జులై మాసంలో విస్తారమైన వర్షాలకు అనుకూలంగా పశుగ్రాస పంటల సాగు ప్రణాళికను అనుసరించి తగిన విధంగా పంటలను సాగు చేసుకొన్న యెడల మంచి పచ్చిమేత దిగుబడులు సాధించడానికి అవకాశం ఉండును. జులై మాసంలో ప్రధానంగా ధాన్యపు జాతి పశుగ్రాస పంటలను సాగు చేసుకోవడం వలన అధిక దిగుబడులు వచ్చును. ఇందులో ప్రధానమైన పంటలు జొన్న మరియు మొక్కజొన్న. జొన్నలో ఏకవార్షిక రకాలు మరియు బహువార్షిక రకాలు ఉన్నవి. ఏకవార్షిక జొన్నలో ఒకే కోతనిచ్చు రకాలు మరియు ఒకటి కన్నా ఎక్కువ కోతలనిచ్చు రకాలున్నవి. రైతులు ప్రధానంగా ఎక్కువ కోతలనిచ్చు ఏకవార్షిక రకాలను కోరుకున్నప్పుడు పంత్‌చారి 6, సి.యస్.హెచ్. 24, యం.యస్.యస్.జి. 53-3 మొదలగు రకాలను సాగు చేసుకొనవచ్చును. అలాగే బహువార్షిక రకాలు కావలసిన రైతులు కో.ఎఫ్.ఎస్. 31 రకమును సాగు చేసుకొనవచ్చును. ఏకవార్షిక రకాల సాగుకు ఎకరానికి 10 కిలోల విత్తనం అవసరమగును, అలాగే బహువార్షిక రకాల జొన్నకు ఎకరానికి 3 కిలోల విత్తనం సరిపోతుంది. వీటిని వరుసల మధ్య దూరం 30 సెం.మీ. మరియు వరుసలో మొక్కల మధ్య దూరం 10 సెం.మీ. ఉండేటట్లు సాగు చేసుకోవాలి. దుక్కిలో 16 కిలోల నత్రజని, 16 కిలోల ఫాస్ఫరస్, 12 కిలోల భాస్వరం నిచ్చు ఎరువులను వేసుకోవాలి. పశుగ్రాస మొక్కజొన్న సాగు చేసుకొనదలచిన రైతులు ఆఫ్రికన్ టాల్ రకమును ఎకరానికి 20 కిలోల వంతున విత్తుకోవాలి. వరుసల మధ్య దూరం 45 సెం.మీ. ఉండాలి, అలాగే దుక్కిలో 24 కిలోల నత్రజని, 16 కిలోల ఫాస్ఫరస్, 12 కిలోల భాస్వరం నిచ్చు ఎరువులను వేసుకోవాలి. ధాన్యపు జాతి పశుగ్రాస రకాలను విత్తిన తర్వాత కలుపు నివారణకు విత్తిన 48 గంటల లోపల అట్రాజిన్ మందును 3 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

**డా॥ యస్. తిరుమల రెడ్డి,** శాస్త్రవేత్త (సేద్య శాస్త్రం)
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, తిరుపతి.
చరవాణి : 94920 73308

# ప్రత్తిలో గులాబీ రంగు పురుగు

## సమగ్ర యాజమాన్య సాంకేతిక పరిజ్ఞాన ప్రదర్శనా ఫలితాలు

డా॥ జి. దయానా గ్రేస్, శాస్త్రవేత్త (కీటక శాస్త్రం);
డా॥ ఒ. శారద, ప్రధాన శాస్త్రవేత్త (విస్తరణ శాస్త్రం);
డా॥ బి. శ్రీలక్ష్మి, ప్రధాన శాస్త్రవేత్త (తెగుళ్ళ శాస్త్రం) మరియు
డా॥ ఎం. సుధారాణి, ప్రధాన శాస్త్రవేత్త (ప్రత్తి); ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, లాం, గుంటూరు.

**భా**రత దేశంలో ప్రత్తి ప్రముఖ వాణిజ్య పంట మరియు ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్తిని 2022-23 సంవత్సరంలో సుమారుగా 6.4 లక్షల హెక్టార్లలో సాగు చేయబడింది. బి.టి. ప్రత్తి రాక ముందు అనగా 2006-2007 సంవత్సరం వరకూ ప్రత్తిలో శనగ పచ్చ పురుగు ప్రధానంగా నష్టం కలిగించేది. 2002 వ సంవత్సరంలో భారత దేశంలో బి.జి. I ప్రత్తి మరియు 2006 బి.జి. II ప్రత్తిని పండించడానికి అనుమతి లభించింది. తరువాత శనగ పచ్చ పురుగు వలన ప్రత్తికి నష్టం తగ్గింది. కాని, 2009 సంవత్సరం తరువాత బీటి ప్రత్తిని తట్టుకునే శక్తి గులాబిరంగు పురుగులో ఉత్పన్నం అవ్వడం వలన బీ.టి. ప్రత్తి దిగుబడులు గణనీయంగా తగ్గుతున్నాయి. గులాబిరంగు పురుగు ఉధృతి బీ.టి. ప్రత్తిలో పెరగడానికి బీటి విషానికి నిరోధక శక్తి పెంచుకోవడం, పురుగు కంటికి కనిపించకుండా కాయ లోపల దాగి ఉండే గుణం కలిగి ఉండడం, ప్రత్తిని నిరంతరాయంగా విరామం లేకుండా సేద్యం చేయడం, గులాబి రంగు పురుగు ఇతర పంటలను ఆశించకుండా కేవలం ప్రత్తిని మాత్రమే ఆహారంగా తీసుకోవడం (మోనోఫేగస్), పురుగు మందులను మరియు పురుగు మందు మిశ్రమాలను విచక్షణ రహితంగా వాడడం మొదలైనవి ముఖ్య కారణాలుగా చెప్పవచ్చును. ఇంతే కాకుండా గులాబీ రంగు పురుగు పంట చివరి కాలంలో ప్రతికూల వాతావరణ పరిస్థితులలో అనగా అధిక ఉష్ణోగ్రతలు ఉన్నప్పుడు, గొంగళి పురుగు కాయ లోపల రెండు విత్తనాలను దగ్గరగా కుట్టుకుని దానిలో నిద్రావస్థలోకి చేరుకుంటుంది. ఈ నిద్రావస్థ 60 రోజుల నుండి 6 నెలల వరకు ఉంటుంది. ఈ కారణం వలన పంటలేని సమయంలో కూడా పంట మోడులలో, అవశేషాలలో గులాబీ రంగు పురుగు జీవించి ఉంటుంది. అనుకూల పరిస్థితులు ఏర్పడినప్పుడు, తరువాత కాలంలో వేసే ప్రత్తిని గులాబీ రంగు పురుగు ముందుగానే ఆశించి అధిక నష్టం చేకూరుస్తుంది. వీటన్నిటిని దృష్టిలో పెట్టుకుని ప్రత్తి పంట కాలంలో మరియు పంట లేని కాలంలో కూడా యాజమాన్య చర్యలు చేపట్టాలి.



గులాబీ రంగు పురుగు యాజమాన్యం సకాలంలో చేపట్టని యెడల రైతులకు అధిక నష్టం (40-70 శాతం పంట దిగుబడిలో) వాటిల్లుతుంది. దీనిని దృష్టిలో పెట్టుకుని విశ్వ విద్యాలయం ప్రత్తిలో గులాబీ రంగు పురుగు యాజమాన్యానికి రూపొందించిన సమగ్ర సస్యరక్షణ సాంకేతిక పరిజ్ఞానాన్ని జొన్నలగడ్డ గ్రామంలో శ్రీ కె. నర్సిరెడ్డి (99485 77405) గారి పొలంలో 2 ఎకరాలలో ప్రదర్శించారు. గులాబీ రంగు పురుగు యాజమాన్యంలో భాగంగా ఈ క్రింది యాజమాన్య పద్ధతులను ఆచరింపచేయడం జరిగింది.

- ఎండాకాలములో లోతు దుక్కులు.
- ప్రత్తి పంటను సకాలంలో జూలై రెండవ పక్షంలో విత్తడం.
- సిఫారసు చేసిన ఎరువుల యాజమాన్యం ( 60:30:30 ఎన్.పి.కె. / ఎకరానికి).

- 45 రోజుల నుండి గులాబీ రంగు పురుగు ఉనికిని గమనించడానికి ఎకరానికి 4 లింగాకర్షక బుట్టలు, అలాగే సామూహికంగా రెక్కల పురుగులను పట్టుకోవడానికి ఎకరానికి 10 లింగాకర్షక బుట్టలను పెట్టుకోవడం
- ప్రత్తి పూత సమయంలో 5% వేప గింజల కషాయం పిచికారి చేయడం.
- పూత సమయాలలో ట్రైకోగ్రామ బ్యాక్ట్రే గ్రుడ్డు పరాన్న జీవులను మూడు దఫాలుగా వారానికి ఒకసారి ఎకరానికి 60,000 చొప్పున విడుదల చేయడం.
- గ్రుడ్డి పువ్వులను ఏరి నాశనం చేయడం.
- ఆర్థిక సహన పరిమితి స్థాయి దాటినప్పుడు (రోజుకు 8 రెక్కల పురుగులు వరుసగా మూడు రోజులు బుట్టలలో పడినప్పుడు లేదా 10% కాయ నష్టం కలిగినప్పుడు).
- గ్రుడ్డు మీద పని చేసే మందులైన ప్రొఫినోఫాస్ మరియు వేప నూనె 75- 90 రోజుల వరకు 15 రోజుల వ్యవధిలో పిచికారి చేయడం.
- క్లోరిపైరిఫాస్ 500 మి.లీ. లేదా క్వినాల్‌ఫాస్ 400 మి.లీ. ఎకరానికి 90-120 రోజుల వరకు 15 రోజుల వ్యవధిలో ఎకరానికి పిచికారి చేయడం.
- 120 రోజుల తరువాత మాత్రమే సింథటిక్ పైరిత్రాయిడ్ మందులైన సైపర్ మెత్రిన్ 200 మి.లీ. లేదా లాంబ్డ సైహాలోత్రిన్ 200 మి.లీ. మందులను ఎకరానికి మార్చి మార్చి పిచికారి చేయడం.
- 160 రోజుల తరువాత పంటను పొడిగించకపోవడం.
- పంట తీతల అనంతరం వెంటనే పశువులను మేపి ష్రెడ్డర్ నడిపి, మోడులను చిన్న చిన్న ముక్కలుగా చేసి, రోటావేటర్ సహాయంతో భూమిలో కలియ దున్నడం వంటివి చేపట్టడం జరిగింది.

రైతు వారి పద్ధతిగా శ్రీ కె. సుబ్బారెడ్డి గారి ప్రత్తి పొలంలో చేపట్టిన సస్యరక్షణ చర్యలను నమోదు చేయటం జరిగింది. రైతు వారి పొలంలో పంట ముందస్తు కాలంలోనే సింథటిక్ పైరిత్రాయిడ్ మందులతో పాటు మోనోక్రోటోఫాస్, ఎసిఫేట్ మొదలగు పురుగు మందుల మిశ్రమాలను వాడడం వలన పంట రొట్ట చేసి గులాబీ రంగు పురుగు ఉధృతి పెరిగింది.

జొన్నలగడ్డ గ్రామంలోని శ్రీ కె. నర్సిరెడ్డి గారి పొలంలో గులాబీ రంగు పురుగు యాజమాన్య చర్యలలో లోతు దుక్కుల నుండి, శ్రేడ్డర్ నడిపి రోటావేటర్ సహాయంతో కలియదున్నడం వరకు లాంఫారం శాస్త్రవేత్తల పర్యవేక్షణలో నిర్వహించడం జరిగింది. పంట విత్తిన దగ్గర నుండి ప్రతి వారం గులాబీ రంగు పురుగు యొక్క కాయ నష్టాన్ని అంచనా వేయటం జరిగింది. విశ్వవిద్యాలయం సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుసరించడం వలన గులాబీ రంగు పురుగు వలన కలిగే నష్టాన్ని తగ్గించగలిగాము. నవంబర్ మాసంలో 5-10%, డిసెంబర్ లో 20-33.33%, జనవరి మొదటి వారంలో 42.2% గులాబీ పురుగు వలన కాయ నష్టం సమగ్ర యాజమాన్య పద్ధతిలో నమోదు కాగా, 10-30%, 30-64.6%, 70.52% కాయ నష్టం నవంబర్, డిసెంబర్, జనవరి మాసాలలో రైతు వారి పద్ధతిలో నమోదు అయ్యింది. పంటకాలంలో గులాబీ రంగు పురుగు వలన కాయ నష్టం 20.72% సమగ్ర యాజమాన్యంలో, 36.24% రైతు వారి పద్ధతిలో నమోదు అయ్యింది. సమగ్ర యాజమాన్య పద్ధతి వలన 42.82% గులాబీ రంగు పురుగు వలన రైతు వారి పద్ధతి మీద కాయ నష్టం తగ్గింది.

సమగ్ర యాజమాన్య పద్ధతిలో పది సార్లు సిఫారస్సు చేసిన పురుగు మందులు పిచికారి చేయగా, రైతు వారి పద్ధతిలో 14 సార్లు, పురుగు మందుల మిశ్రమాలను పిచికారి చేసారు. దీనివలన సుమారుగా 10,732/- రూపాయలను పురుగు మందుల మీద ఆదా చేయకలిగారు. సమగ్ర యాజమాన్య పద్ధతిలో 11.33 క్వింటాలు ఎకరానికి దిగుబడి రాగా 9.6 క్వింటాలు రైతు వారి పద్ధతిలో దిగుబడి వచ్చింది. సమగ్ర యాజమాన్య పద్ధతులను అవలంభించినప్పుడు అదనంగా ఎకరానికి 1.73 క్వింటాల దిగుబడి లభించింది. దీనివలన 46,081/- రూపాయల ఆదాయం సమగ్ర యాజమాన్య పొలంలో రాగా రైతు వారి పద్ధతిలో కేవలం 15,909/- రూపాయల ఆదాయం మాత్రమే వచ్చినది.

గులాబీ రంగు పురుగు సమగ్ర యాజమాన్య పద్ధతులు చేపట్టటం వలన శ్రీ కె. నర్సిరెడ్డి గారి పొలంలో పురుగు మందుల మీద అయ్యే ఖర్చు తగ్గి, దిగుబడులు పెరిగి, అదనంగా ఆదాయం రావడం జరిగింది.

ప్రత్తి రైతాంగం గులాబీ రంగు పురుగు అదుపునకై తప్పనిసరిగా ఆంగ్రూ వారు సూచించిన సమగ్ర సస్యరక్షణను తూచ తప్పకుండా పాటించినట్లయితే గులాబీ రంగు పురుగు ఉధృతి తగ్గించి అధిక ఆదాయాన్ని పొందవచ్చు.

మరింత సమాచారం కొరకు సంప్రదించాల్సిన ఫోన్ నెం : 73824 17547

# సార్వాలో సాగుకు అనువైన చౌడును తట్టుకునే వరి వంగడాలు

డా॥ యం. గిరిజారాణి, ప్రధాన శాస్త్రవేత్త (మొక్కల ప్రజనన శాస్త్రం), వ్యవసాయ పరిశోధనా స్థానం, మచిలీపట్నం.

వరి పంట చౌడు భూములలో ఊడ్చిన వెంటనే చనిపోవడం, సరిగా ఎదగక పోవడం, తక్కువ పిలకలు చేయటం, చౌడు తీవ్రతను అనుసరించి కంకులు బయటకు రావకపోవడం, కంకి తెల్లగా తాలుగింజలు ఎక్కువగా ఉండటం జరుగుతుంది. దీని వలన భూమి యొక్క చౌడు తీవ్రతను బట్టి ఎకరానికి 15 నుండి 25 బస్తాల దిగుబడి మాత్రమే వస్తుంది. కొన్ని ప్రాంతాలలో చేపల చెరువులు ప్రక్కన తరచూ మొక్కలు చనిపోవడం జరుగుతుంది. అలాగే కొంతమంది దిగుబడి చాలా తక్కువ వస్తుందని సాగు చేయకుండా భూమి ఖాళీగా ఉంచటం జరుగుతుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సుమారు 3.99 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో చౌడు భూములు ఉన్నాయి. కోస్తా తీర ప్రాంతాలలో వరి మాత్రమే సాగు చేయడానికి వీలవుతుంది. సముద్ర తీర ప్రాంతాలలో వరి మాత్రమే సాగు చేయటానికి వీలవుతుంది. సముద్ర తీర ప్రాంతాలలో తరచూ ఆటు పోటులకు గురి అవుతూ ఉండే ఊరక భూములు (ఉదా : కృష్ణా జిల్లాలోని నాగాయలంక, నర్సాపురం సివారు ప్రాంతాలు). అలాగే భూగర్భ జలాలు అధికంగా ఉండటం వలన సాగు నీటి లవణ సాంద్రత 1.5 నుండి 3.0 డి.సి. సైమన్ లేదా మీటరు కంటే ఎక్కువ ఉన్న నీరు వలన కూడా భూములు చౌడు బారటం వలన దిగుబడులు గణనీయంగా తగ్గుతాయి. సాధారణంగా వరి రకాలు లవణ సాంద్రత 3 డి.ఎస్./మీ. కన్నా ఎక్కువ ఉంటే తట్టుకోలేవు. వరి పంట పూత తిరిగే దశ, పూత దశలో చౌడును తట్టుకోలేదు. చౌడు భూములలో చౌడును తట్టుకునే రకాలు సాగు చేస్తూ, సరియైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చు. ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని వ్యవసాయ పరిశోధనా స్థానం మచిలీపట్నం నందు రూపొందించిన చౌడును తట్టుకునే వరి వంగడాలు పాండురంగా (యం.సి.యం. 100, యం.సి.యం. 103 రకాలు, రెండు సంవత్సరాలు చిరుసంచుల ప్రదర్శన పూర్తి చేసుకున్న యం.సి.యం. 125 రకాల యొక్క గుణగణాలు, సాగు చేసిన రైతుల అభిప్రాయం గమనిద్దాం.

**రకం : పాండురంగా (యం.సి.యం. 100)**

విడుదలైన సంవత్సరం : 2018

సంకరం : యం.టి.యం. 1042 / 1061

కాల పరిమితి (రోజులు) : 140-145

సిఫారసు చేయబడిన కాలం : సార్వా

మొక్క ఎత్తు (సెం.మీ.) : 106

గింజ నాణ్యత : మధ్యస్థ సన్నం, ధాన్యం రంగు : తెలుపు

గింజ పొడవు వెడల్పు, నిష్పత్తి : 2:50, 1000 గింజల బరువు (గ్రా.) : 19.20



దిగుబడి : 6.0 ట./ హె. (సాధారణ స్థితి), 5.0-5.5 ట./ హె. (చౌడు స్థితి)

లక్షణాలు : చౌడును సమర్ధవంతంగా తట్టుకునే రకం. గింజ రాలిక తక్కువ, చేనుపై పడదు. 2-3 వారాలు నిద్రావస్థ కలదు. కొంతవరకు దోమను తట్టుకుంటుంది.

**సాగు చేసిన రైతు అభిప్రాయం :** నా పేరు జి. సురేష్ (83093 02871) మెందుముడి, అవనిగడ్డ మండలం, కృష్ణా జిల్లా, నేను సార్వా 2022 వ సంవత్సరంలో పాండురంగా (యం.సి.యం. 100) అను రకాన్ని వ్యవసాయ పరిశోధనా స్థానం, మచిలీపట్నం నుండి విత్తనాలు తీసుకొని 20 ఎకరాలు సాగు చేసాను. చౌడు భూములలో మొక్కలు చనిపోతూ ఉండేవి. ఈ రకము మొక్కలు చనిపోలేదు. తక్కువ పెట్టుబడితో చౌడు భూమిలో ఎకరానికి 35 బస్తాలు దిగుబడి రాగా మంచి భూమిలో 40 బస్తాలు దిగుబడి వచ్చింది. యంత్రంతో కోత కోసి గవర్నమెంట్ ధరకీ ధాన్యం అమ్మటం వలన మంచి లాభం పొందాము. నా ప్రక్కన వేసిన బి.పి.టి. 5204 రకం 28 బస్తాలు దిగుబడి వచ్చింది. యం.సి.యం. 100 రకం 140 రోజులకు కోతకు రావటం వలన మాకు ఆలస్యంగా నీరు విడుదలైనప్పుడు సాగుకు అనుకూలంగా ఉండటం వలన ఈ సంవత్సరం సాగుకు విత్తనాన్ని తీసుకొన్నాము. గింజలు యం.టి.యు. 1061 రేటుకే అమ్ముడుపోయాయి.

### రకం : యం.సి.యం. వరి 103




విడుదలైన సంవత్సరం : 2022

సంకరం బి.పి.టి. 5204 / యం.టి.యు. 4870

కాల పరిమితి (రోజులు) : 140-145

సిఫారసు చేయబడిన కాలం : సార్వా

మొక్క ఎత్తు : 100 సెం.మీ., గింజ నాణ్యత : మధ్యస్థ సన్నం, ధాన్యం రంగు : తెలుపు

గింజ పొడవు, వెడల్పు నిష్పత్తి : 2:50, 1000 గింజల బరువు (గ్రా.) : 14.50

దిగుబడి : 6.0 ట./హె. (సాధారణ స్థితి), 5.0-5.5 ట./ హె. (చౌడు స్థితి)



లక్షణాలు : చౌడును తట్టుకునే మిక్కిలి సన్న గింజ నాణ్యత కల రకం. సిఫారసు చేసిన ఎరువులు వాడినప్పుడు చేనుపై పడదు. బియ్యం పారదర్శకంగా ఉండి అన్నానికి అనుకూలం. కొంత వరకు అగ్గి తెగులు, తెల్ల వీపు దోమను తట్టుకునే రకం.

**సాగు చేసిన రైతు అభిప్రాయం :**

నా పేరు ఉయ్యూరు అరవింద రెడ్డి (90305 96999), నంబూరు, గుంటూరు జిల్లా, మా భూములు చౌడు భూముల వలన బి.పి.టి. 5204 సాగు చేసినప్పుడు మొక్కలు చనిపోయి ఉండేవి. మరల ఊడ్చుట వలన ఖర్చు పెరిగి దిగుబడి తగ్గుతుంది. సార్వాలో మచిలీపట్నం నుండి విడుదలైన యం.సి.యం. 103 ని సాగు చేసాము, ఈ రకం మొక్కలు చనిపోలేదు. గింజ బి.పి.టి. 5204 వలె సన్నగా ఉండి ఎకరానికి 40 బస్తాలు దిగుబడి రావటం వలన ఈ సంవత్సరం సాగు చేయటానికి విత్తనాలు సేకరించడం జరిగింది.



**చిరు సంచుల దశలో ఉన్న రకం : యం.సి.యం. 125**

సంకరం : యం.టి.యు. 1042 / యం.టి.యు. 1061

చిరుసంచుల ప్రదర్శనం : 2021-2023 సంవత్సరం

కాల పరిమితి : 145 రోజులు

దిగుబడి : 6.5 ట./ హె.

లక్షణాలు : వ్యవసాయ పరిశోధనా స్థానం, మచిలీపట్టణం నుండి రూపొందించిన చౌడును తట్టుకునే సన్న గింజ నాణ్యత కలిగిన రకం.

1000 గింజల బరువు : 15 గ్రా. ధాన్యం తెలుపు, చేనుపై పడదు. రెండు వారాల నిద్రావస్థ కలిగి కొంత వరకు దోమపోటును, ఎండాకు తెగులును తట్టుకుంటుంది.

**సాగు చేసిన రైతు అభిప్రాయం :** శ్రీ శివరామకృష్ణ (96188 31763), ఏటిమొగ, నాగాయలంక మండలం, కృష్ణా జిల్లా.

మాది ఉరకకు గురి అయ్యే చౌడు భూములు. ఈ భూములలో బి.పి.టి. 5204 సాగు చేసినప్పుడు మొక్కలు చనిపోవడం, ఎదగకపోవుట, ఎక్కువ పెట్టుబడి పెట్టినప్పటికి ఎకరానికి 25 బస్తాల దిగుబడి మాత్రమే వచ్చింది. సార్వా 2022 లో చిరుప్రదర్శనలో ఉన్న యం.సి.యం. 125 అను రకాన్ని 20 ఎకరాలో సాగు చేసాను. ఈ రకం చౌడు భూములలో చనిపోలేదు, మొక్క ఎదుగుదల బాగుంది, దోమపోటు రాలదు, పెట్టుబడి తక్కువలో ఎకరానికి 33 బస్తాలు దిగుబడి వచ్చింది. 75 కిలోల బస్తాని రూ. 1,750/- అమ్మాను, ఎకరం వరి గడ్డి రూ. 12,000/- అమ్మాను.

పైన తెలిపిన చౌడును తట్టుకునే రకాలతో పాటు 150 రోజుల కాలపరిమితి కల యం.టి.యు. 1061, ఆలస్యంగా సార్వాలో చౌడు భూములలో సాగు చేయవలసినప్పుడు 130 రోజుల కాల పరిమితి కలిగిన యం.సి.యం. 109; 120 రోజుల కాల పరిమితి కలిగిన యం.టి.యు. 1293 రకాలు సాగు చేసుకోవచ్చు.

**చౌడు భూములలో వరి యాజమాన్యం :**

చౌడు తట్టుకునే రకాలతో పాటు ఈ దిగువ తెలిపిన యాజమాన్య పద్ధతులు పాటిస్తే చౌడు భూములలో కూడా మంచి దిగుబడులు సాధించవచ్చు.

- జీలుగ కలియదున్నాలి.
- దమ్ము చేసిన తర్వాత నీరు 2-3 సార్లు బయటకు తీసివేయాలి.
- 25-30 రోజుల వయస్సు గల నారు ఊడ్చుకోవాలి,
- తరచూ మంచి నీరు పెడుతూ తీసివేయాలి.
- భూపరిస్థితిని అనుసరించి మచిలీపట్నం రకాలకు ఎకరానికి 36 కిలోల నత్రజని, 24 కిలోల భాస్వరం మరియు 24 కిలోల పొటాష్ నిచ్చే ఎరువులు వేసుకుంటే సరిపోతుంది.
- చౌడు భూములలో వెదజల్లు పద్ధతి సాగుకు అంత అనుకూలం కాదు.

**మరింత సమాచారం కొరకు సంప్రదించాల్సిన ఫోన్ నెం : 94901 95904**

# ఖరీఫ్‌లో ఉత్తరాంధ్ర ప్రాంతానికి అనువైన వరి రకాలు

డా॥ ఎన్. రాజ కుమార్, కార్యక్రమ సమన్వయ కర్త;
డా॥ పి.వి.యస్. రామునాయుడు, సహ పరిశోధకులు (సేద్య శాస్త్రం); డా॥ కె. శంకరరావు, శాస్త్రవేత్త (కీటక శాస్త్రం);
డా॥ ఎ. సౌజన్య, శాస్త్రవేత్త (సేద్య శాస్త్రం);
డా॥ ఎన్. సత్తిబాబు, శాస్త్రవేత్త (ఉద్యాన శాస్త్రం);
డా॥ పి. బాబు, శాస్త్రవేత్త (అగ్రి ఇంజనీరింగ్) మరియు
డా॥ ఎన్. కిశోర్ కుమార్, శాస్త్రవేత్త (విస్తరణ శాస్త్రం);
కృషి విజ్ఞాన కేంద్రం, కొండెంపూడి.

**రా**నున్న ఖరీఫ్ కాలంలో వరి రకాలను ఎన్నుకోవడానికి రైతులు సందేహపడుతూ ఉంటారు. వారి సందేహాలను నివృత్తి చేయడానికి వివిధ వరి రకాల గుణగణాలను క్రింద తెలపడం జరిగింది.

**శ్రీకాకుళం సన్నాలు (ఆర్.జి.ఎల్. 2537) :** 165 రోజుల పంట కాలం, ఉల్లికోడును తట్టుకుంటుంది, నారును 60 రోజుల వరకు నాటుకోవచ్చు. సన్న రకం. చేను మీద పడిపోదు. ఎకరాకు 3 టన్నుల వరకు దిగుబడి వస్తుంది.

**స్వర్ణ (యం.టి.యు. 7029) :** 150 రోజుల పంట కాలం, ఎండాకు తెగులును తట్టుకుంటుంది, వివిధ రకాల భూముల్లోనూ, వాతావరణ పరిస్థితులలోనూ, రెండు పంటలు పండించే ప్రాంతాలకు స్థిరమైన దిగుబడిని ఇచ్చే మధ్యస్థ సన్న రకం. తక్కువ నత్రజనితో ఎక్కువ దిగుబడిని ఇస్తుంది. ఎకరాకు 3 టన్నుల వరకు దిగుబడి వస్తుంది.

**సాంబమషూరి (బి.పి.టి. 5204) :** ఖరీఫ్‌లో 145-150 రోజులు, రబీలో 135 రోజుల పంట కాలం కలిగి ఉంటుంది. సన్న బియ్యం, అన్నం మృదువుగా రుచిగా ఉండి మెతుకులు ఒకదానికొకటి అతుక్కోవు. గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండి మధుమేహ వ్యాధి గ్రస్తులు కూడా తినుటకు అనుకూలం. ఎకరాకు 2.5 టన్నుల వరకు దిగుబడి వస్తుంది.


సాంబమషూరి (బి.పి.టి. 5204)

**సోనామషూరి (బి.పి.టి. 3291) :** 135-140 రోజుల పంట కాలం కలిగి ఉంటుంది. అగ్గి తెగులును తట్టుకుంటుంది. సన్న బియ్యం, అన్నానికి బాగుంటుంది. ఎకరాకు 2.5 టన్నుల వరకు దిగుబడి వస్తుంది.

**విజేత (యం.టి.యు. 1001) :** 135 రోజుల పంట కాలం కలిగి ఉంటుంది, సుడిదోమ, అగ్గి తెగులును తట్టుకుంటుంది, చేనుపై పడిపోదు, జింకు ధాతు లోపాన్ని తట్టుకొనలేదు. ఎకరాకు 2.5 టన్నుల వరకు దిగుబడి వస్తుంది.

**పుష్యమి (యం.టి.యు. 1075) :** 135 రోజుల పంట కాలం కలిగి ఉంటుంది, సుడిదోమ, అగ్గితెగులును తట్టుకుంటుంది, చేనుపై పడిపోదు. ఎకరాకు 2.5 టన్నుల వరకు దిగుబడి ఇస్తుంది.

**అమర (యం.టి.యు. 1064) :** 150 రోజుల పంట కాలం కలిగి ఉంటుంది, సుడిదోమ, అగ్గితెగులును తట్టుకుంటుంది, చేనుపై పడిపోదు, గింజ రాలదు, సన్నబియ్యం, ముంపును బాగా తట్టుకుంటుంది. ఎకరాకు 3 టన్నుల వరకు దిగుబడి వస్తుంది.

**మారుటేరు సాంబ (యం.టి.యు. 1224) :** 135 రోజుల పంటకాలం కలిగి ఉంటుంది, సుడిదోమను తట్టుకుంటుంది, చేనుపై పడిపోదు, బియ్యం పారదర్శకంగా ఉండి అన్నానికి అనుకూలం. ఎకరాకు 2 టన్నుల వరకు దిగుబడి వస్తుంది.

**తరంగిణి (యం.టి.యు. 1156) :** రబీకు అనుకూలం 120





రోజుల పంట కాలం కలిగి ఉంటుంది, సుడిదోమ, అగ్గితెగులును తట్టుకుంటుంది, కాండం ధృడంగా ఉండి చేనుపై పడిపోకుండా ఉండుటచే నేరుగా విత్తే విదానంలో సాగుకి, యంత్రాలతో కోతకి అనుకూలం. గింజ రాలిక తక్కువగా ఉండును. బియ్యం సన్నగా, పొడవుగా ఉండి ఎగుమతులకి అనుకూలంగా ఉండును. ఎకరాకు 2 టన్నుల వరకు దిగుబడి వస్తుంది.

**శ్రీధృతి (యం.టి.యు. 1121) :** రబీకు అనుకూలం, 120-125 రోజుల పంట కాలం కలిగి ఉంటుంది, సుడిదోమ, అగ్గి తెగులును తట్టుకుంటుంది, కాండం ధృడంగా ఉండి చేనుపై పడిపోకుండా ఉంటుంది. మధ్యస్థ సన్న రకం. నేరుగా విత్తే విదానంలో సాగుకి కూడా అనుకూలంగా ఉంటుంది. ఎకరాకు 2.41 టన్నుల వరకు దిగుబడి వస్తుంది.

**నెల్లూరి మషూరి (ఎన్.ఎల్.ఆర్. 34449) :** అన్ని కాలాలకు అనుకూలమైనది. 125 రోజుల పంట కాలం కలిగి ఉంటుంది. చేను మీద పడిపోదు, పొట్టి రకం, గింజ నాణ్యత కలిగి, అగ్గి తెగులును తట్టుకుంటుంది. ఎకరాకు 3.2 టన్నుల వరకు దిగుబడి వస్తుంది.

**నెల్లూరి సోనా (ఎన్.ఎల్.ఆర్. 3041) :** 140 రోజుల పంట కాలం కలిగి ఉంటుంది. అతి సన్న బియ్యం, అన్నానికి బాగుంటుంది. తక్కువ నత్రజనితో ఎక్కువ దిగుబడిని ఇస్తుంది. అగ్గితెగులును తట్టుకుంటుంది. ఎకరాకు 3 టన్నుల వరకు దిగుబడి వస్తుంది.

**తెలంగాణ సోనా (ఆర్.ఎన్.ఆర్. 15048) :** ఆలస్యంగా నాట్లు వేయుటకు అనువైన రకం. రెండు కాలాలకు అనుకూలమైన ఈ రకం అగ్గి తెగులును సమర్థవంతంగా తట్టుకుంటుంది. గింజ సాంబ మషూరి కంటే సన్నగా, నాణ్యతగా ఉంటుంది. తక్కువ నూక శాతం (68-70% బియ్యం) కలిగి ఉంటుంది. అయితే ఈ రకానికి కాండం తొలచు




పురుగు ఉధృతి ఎక్కువ ఉంటుంది. ఎకరాకు 2.6-2.8 టన్నుల వరకు దిగుబడి వస్తుంది.

**కూనారం సన్నాలు (కె.ఎన్.యం. 118) :** 125 రోజులు పంట కాలం కలిగి రెండు కాలాలకు అనువైనది. యం.టి.యు. 1010 రకానికి ప్రత్యామ్నాయంగా రూపొందించడం జరిగింది. గింజలు రాలే లక్షణం తక్కువగా ఉండి, ఎక్కువ బరువును కలిగి ఉంటుంది. ఎకరాకు 2.6-2.8 టన్నుల వరకు దిగుబడి వస్తుంది.

**యం.టి.యు. 1318 :** 150 రోజుల పంట కాలం కలిగి ఇటీవలి కాలంలో పడిపోని స్వర్ణగా ప్రాచుర్యం పొందింది. అగ్గితెగులు, పొట్టకుళ్ళు తెగుళ్ళను కొంతమేర తట్టుకుంటుంది. ఎకరాకు 3 టన్నుల వరకు దిగుబడి ఇస్తుంది.

**సుజాత (యం.టి.యు. 1210) :** 135 రోజుల పంటకాలం కలిగి ఉంటుంది. సుడిదోమ, అగ్గి తెగులును తట్టుకుంటుంది. గింజ రాలిక తక్కువ, నేరుగా విత్తే విధానంకు అనుకూలం. ఎకరాకు 2 టన్నుల వరకు దిగుబడి ఇస్తుంది.

మరింత సమాచారం కొరకు సంప్రదించాల్సిన
ఫోన్ నెం : 9848061501

# కలుపు మందుల వినియోగంలో తీసుకోవలసిన జాగ్రత్తలు

డా॥ యస్. జాఫర్ భాష, అసోసియేట్ ప్రొఫెసర్ (సస్య రక్షణ శాస్త్రం) & సాంకేతిక అధికారి, పరిపాలనా భవనం, లాం; డా॥ డి. సుబ్రమణ్యం, ప్రధాన శాస్త్రవేత్త (కలుపు యాజమాన్యం); ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, లాం మరియు డా॥ ఇ. అరుణ, సీనియర్ శాస్త్రవేత్త (సస్య రక్షణ శాస్త్రం); పరిపాలన భవనం, ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, లాం, గుంటూరు.

**క**లుపు మొక్కలు పంట మొక్కలతో పాటు పోటీపడి పెరిగి పంట దిగుబడులను తగ్గించటమే కాకుండా పంట నాణ్యతను కూడా ప్రభావితం చేస్తాయి. ఈ కలుపు మొక్కలు వివిధ రకాలైన చీడపీడలకు ఆశ్రయమిచ్చి సస్యరక్షణకు అయ్యే ఖర్చును కూడా బాగా పెంచుతాయి. కలుపు మొక్కలు పంటకు అందవలసిన పోషక పదార్థాలు, సూర్యరశ్మి మరియు ఇతర అభివృద్ధి కారకాలతో పోటీపడి మన కంటికి కనిపించకుండానే పంటలకు నష్టాన్ని కలుగచేస్తాయి. కలుపు వలన వివిధ పంటలలో జరిగే నష్టం 90 శాతం వరకు ఉండవచ్చును. వైరస్ తెగుళ్ళకు ఆవాసం ఏర్పరచి వైరస్ వ్యాప్తికి దోహదపడతాయి.

కలుపు మొక్కల వలన జరిగే పంట నష్టం ఆహార ధాన్య పంటలలో వాటి జీవిత కాలంలో మొదటి 1/3 వ వంతు సమయం కలుపు ఉన్నప్పుడు చాలా ఎక్కువగా ఉంటుంది కాబట్టి కలుపు మొక్కలను ఈ దశలో పంట పొలాల్లో లేకుండా చేయడం వలన పంట దిగుబడులు తగ్గకుండా చేయవచ్చును. ఈ దశను కలుపు తీయుటకు కీలక దశ (సున్నిత దశ) గా గుర్తించవచ్చును. కలుపు మొక్కలను ప్రధానంగా గడ్డి జాతి, తుంగ జాతి మరియు వెడల్పాకు కలుపు మొక్కలుగా గుర్తించవచ్చును.

కలుపు మందుల వాడకంపైన రైతు సోదరులకు సరైన అవగాహన (కలుపు మందుల ఎంపిక, ఏ కలుపు మందు, ఏ పంటకు, ఏ సమయంలో, ఎంత మోతాదులో, ఎలా వాడాలో) కల్పించినట్లయితే కలుపు మొక్కలను సమర్ధవంతంగా ఏ పంటలోనైనా నిర్మూలించవచ్చును. అలా కాకుండా విచక్షణా రహితంగా కలుపు మందులను, పురుగు మరియు తెగుళ్ళ మందులుగా వాడినట్లయితే పంట పూర్తిగా దెబ్బతినటమే కాకుండా, ఆ తరువాత వేసే పంటలకు కూడా హాని కలిగించే ఆస్కారమున్నది.

**కలుపు మందుల వినియోగంలో తీసుకోవలసిన జాగ్రత్తలు :**

- రైతులు ఏ పైరులో, ఏ కలుపు మందును, ఎంత మోతాదులో, ఏ సమయంలో ఎలా వాడాలో వంటి పూర్తి వివరాలు తెలుసుకున్న పిదప సిఫారసు చేసిన కలుపు మందులను మాత్రమే వాడాలి. సిఫారసు చేయని కలుపు మందులు ఎట్టి పరిస్థితుల్లోను వాడకూడదు.
- కలుపు మందులను పిచికారి చేయుటకు ముందుగా రైతులు కలుపు మందు కంపెనీ వారు ఇచ్చిన పూర్తి వివరాలను (సమాచారాన్ని) క్షుణ్ణంగా చదవాలి.
- ఏ పంటకు సిఫారసు చేసిన మందును ఆ పంటకు మాత్రమే వాడాలి.

ఉదాహరణకు 2,4-డి సోడియం సాల్టు 80% పొడి మందును ఎకరాకు 400 గ్రా. చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి సాధ్యమైనంత వరకు కలుపు మీద మందు పడేటట్లు ఏకదళ బీజ పంటలలో పిచికారి చేయటం ద్వారా ద్విదళ బీజ కలుపు మొక్కలు నాశనం చేయబడతాయి. మందు మోతాదు మించితే పైరు దెబ్బతినే ప్రమాదముంది. ఈ మందును ఎట్టి పరిస్థితులలోను ద్విదళ బీజ పంటలైన మినుము, పెసర, ప్రత్తి, పొగాకు, మిరప మొదలగు పైర్లపై వాడరాదు.

- మిశ్రమ పంటలు వేసేటప్పుడు కలుపు మందుల వాడకంలో చాలా జాగ్రత్తలు కలిగి ఉండాలి. రెండు పంటలకు సిఫారసు చేయబడిన కలుపు మందులు వాడాలి.
- కలుపు మందులు పిచికారి చేయుటకు సరాసరి ఎకరాకు 200 లీటర్ల నీటిని ఉపయోగించాలి.
- పిచికారి చేయుటకు సరైన నాజిల్ (ఫ్లడ్ జెట్, ఫ్లాట్‌పాన్) ను వాడాలి.
- కొన్ని రకాల కలుపు మందులు విత్తనం విత్తిన వెంటనే కాని, పంట విత్తనం మొలకెత్తిన ముందు తగినంత తేమ ఉన్నప్పుడు కాని పిచికారి చేయాలి.

ఉదాహరణకు : పెండిమిథాలిన్, అట్రాజిన్, అలాక్లోర్

- కొన్ని రకాల కలుపు మందులు పైరు, కలుపు మొలకెత్తిన తరువాతనే పిచికారి చేయాలి. కలుపు దశ 3–4 ఆకులు లేదా 4–5 సెం.మీ. ఎత్తులో ఉన్నప్పుడు కలుపు మందులను పిచికారి చేయటం వలన సమర్ధ వంతంగా నిర్మూలించ వచ్చును. ఈ మందులు పైరు విత్తిన వెంటనే పిచికారి చేస్తే ఉపయోగం ఉండదు.

  ఉదాహరణకు సైహలోఫాప్ బ్యూటైల్, ఫెనాక్సా ప్రాప్ ఇథైల్
- కొన్ని రకాల కలుపు మందులకు పంట, కలుపు అని విచక్షణా శక్తి ఉండదు. అనగా అన్ని మొక్కలను నిర్మూలించ గలవు. కనుక వాటిని పైర్లలో వాడరాదు.

ఉదాహరణకు : పారాక్వాట్, గ్లూఫోసినేట్

అయితే ఈ కలుపు మందులను ప్రత్తి, చెఱకు మొదలగు పంటలలో వరుసల మధ్య ఎడం ఎక్కువగా ఉండుట వలన నాజిల్‌కు రక్షణ కవచం (హుడ్) పెట్టి పంటలకు హాని కలుగకుండా కలుపుపై మాత్రమే పడేటట్లు పిచికారి చేయవచ్చు. ఏ కొద్ది పాటి మందు పైరు మీద పడినా పంటలకు హాని కలుగుతుంది.

- విత్తిన వెంటనే వాడే కలుపు మందులను తేలికపాటి (ఇసుక, గరప) నేలల్లో తక్కువ మోతాదులోను, సేంద్రీయ పదార్థం ఎక్కువగా ఉండే నల్లరేగడి నేలల్లో ఎక్కువ మోతాదులోను, ఎర్ర నేలల్లో మధ్యస్థంగా వాడుకోవాలి.

  ఉదాహరణకు : పెండిమిథాలిన్ ఎకరాకు 800 మి.లీ. నుండి 1.2 లీటర్లు సిఫారసు చేసినప్పుడు ఎకరాకు తేలికపాటి నేలల్లో 800 మి.లీ. మధ్య రకం నేలల్లో 1.0 లీటరు, బరువు నేలల్లో 1.2 లీటర్లు వాడుకోవాలి.
- కలుపు మందు పిచికారి చేసే ముందు ప్రక్క పొలంలో పైర్లకు పిచికారి చేసే మందు వల్ల ఏదైనా నష్టం ఉంటుందో లేదో తెలుసుకోవాలి. ఇది ప్రత్యేకించి ఏకదళ బీజ పంటలలో 2,4–డి సంబంధిత మందులు వాడేటప్పుడు చాలా అవసరం. ప్రక్క పొలంలో ద్విదళ బీజ పంటలైన ప్రత్తి, మిరప, మినుము మొదలగునవి ఉంటే 2,4–డి సంబంధిత మందులు వాడరాదు.
- కలుపు మొక్కలను ప్రాథమిక దశలో అనగా 3–4 ఆకుల దశ లేదా 4–5 సెం.మీ. ఎత్తు దశలో నిర్మూలించుట మంచిది.
- స్ప్రేయర్ల నుండి మందు సమంగా వచ్చేటట్లు పిచికారి చేయాలి. ఒకసారి పిచికారి చేసిన తర్వాత ఎట్టి పరిస్థితుల లోను మరలా పిచికారి చేయరాదు. అట్లు చేసిన యెడల మందు మోతాదు ఎక్కువై పైరుకు నష్టం కలుగుతుంది.
- కలుపు మందు పిచికారి చేసిన తర్వాత కనీసం 6–8 గంటల వ్యవధిలో వర్షం కురిస్తే మందు ప్రభావం తగ్గవచ్చును.
- ఎండ మరీ ఎక్కువగా ఉన్నప్పుడు, అలాగే గాలి ఎక్కువగా వీస్తున్నప్పుడు కలుపు మందులను పిచికారి చేయరాదు. కనుక సాయంత్రం లేదా ఉదయం వేళల్లో గాలి తక్కువగా ఉన్నప్పుడు పిచికారి చేయడం మంచిది. అంతేగాక గాలికి ఎదురుగా పిచికారి చేయరాదు.
- నిర్ధిష్టమైన, స్పష్టమైన సూచనలు లేనిదే కలుపు మందులను, ఎరువులతోను, పురుగు మందులతోను, తెగుళ్ళ మందుల తోను కలుపరాదు. కాలపరిమితి దాటిన మందులను వాడరాదు.
- మొండి జాతి మొక్కలైన తుంగ, గరిక, దర్భగడ్డి మొదలగు వాటి నిర్మూలనకు సమగ్ర కలుపు యాజమాన్య పద్ధతులతో పాటుగా సిఫార్సు చేసిన కలుపు మందులను వాడుకోవాలి.

- స్పష్టమైన సూచనలు లేనిదే సాగు నీటిలో కలుపు మందులను కలపరాదు.
- వివిధ పంటలలో సమస్యాత్మక కలుపు మొక్కల నిర్మూలనకు సిఫారసు చేసిన కలుపు మందులనే మార్చి మార్చి ఉపయోగించాలి. ఈవిధంగా ఉపయోగించడం వలన కలుపు మొక్కలు ఒకే మందు వాడటం వలన పెంచుకొనే నిరోధక శక్తిని తగ్గించవచ్చును.
- కలుపు మందులు పిచికారి చేసే వ్యక్తి చేతులకు, శరీరానికి, కళ్ళకు తగు రక్షణ దుస్తులు ధరించి, పిచికారి చేసిన తర్వాత వీటిని సబ్బు నీటితో కడగాలి.
- కలుపు మందులు పిచికారి చేసిన తర్వాత పొలంలో కలుపు మందు ఎంత కాలం ప్రభావంతంగా ఉంటుంది. కలుపు మందు అవశేషాలు ఎంత కాలం భూమిలో ఉండి ఆ తర్వాత వేసే పంటలను ప్రభావితం చేయగలవు అనే విషయాలు రైతులు క్షుణ్ణంగా తెలుసుకొని జాగ్రత్తపడాలి.
- పారాక్వాట్ లేదా ఏ ఇతర కలుపు మందులను పంటలపై పొరపాటున తక్కువ మోతాదులో పిచికారి చేసినప్పుడు పంట పెరుగుదల తగ్గి పసుపు వర్ణంలోనికి మారుతుంది. ఈ ప్రభావాన్ని తగ్గించేందుకు ఎకరానికి 25 కిలోల యూరియాను చల్లాలి. దీనితో పాటుగా యూరియా 10 గ్రా. లేదా బయోజైమ్ 3 మి.లీ. లేదా 19:19:19 5 గ్రా. లీటరు నీటికి కలిపి 7-10 రోజుల వ్యవధిలో 2-3 సార్లు పిచికారి చేయాలి.
- సాధ్యమైనంత వరకు రైతులు కలుపు నిర్మూలనకు పరిమితంగా రసాయనాలను వాడుతూ, అంతరకృషి చేయుట మొదలగు సేద్య పద్ధతులను కూడా పాటిస్తూ సమగ్ర కలుపు యాజమాన్య పద్ధతిని అవలంభిస్తే పర్యావరణ పరిరక్షణతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చును.

**మరింత సమాచారం కొరకు సంప్రదించాల్సిన ఫోన్ నెం : 98498 71975**

## వ్యవసాయ విద్య విస్తృత వ్యాప్తికి సార్వత్రిక మరియు దూర విద్యా కేంద్రం కోర్సులు

**డా॥ కె.ఎస్. పూర్ణిమ, సహాయ ఆచార్యులు (విస్తరణ శాస్త్రం); ఎ.ఎన్.జి.ఆర్.ఎ.యు., లాం, గుంటూరు;**

వ్యవసాయ విద్య విస్తృత వ్యాప్తికి గుంటూరు,లాం ఫారం సార్వత్రిక మరియు దూర విద్యా కేంద్రం ఎంతో మంది రైతులు, మహిళలు, యువత మరియు ఆసక్తి కలిగిన వారు వ్యవసాయ విద్యను పొందేలా దూర విద్య ద్వార వ్యవసాయ సర్టిఫికేట్ కోర్సులను ప్రారంభించడం జరిగింది. జులై, 2023 నుండి ప్రారంభం కానున్న 4 ఆన్‌లైన్ సర్టిఫికేట్ కోర్సులు (సేంద్రీయ వ్యవసాయం, మిద్దె తోటల పెంపకం, తేనెటీగల పెంపకం, పుట్టగొడుగుల పెంపకం), 8 వారాలు (2 నెలలు) వ్యవధిలో నిర్వహించబడును. ఆసక్తి ఉన్న వారు ఒక్కొక్క కోర్సుకు రూ. 1,500/- చొప్పున ఫీజు చెల్లించి కోర్సుకు నమోదు కాగలరు. నమోదు చేసుకున్న అభ్యర్థులకు ఆన్‌లైన్ సదుపాయం (కంప్యూటర్/ఆండ్రాయిడ్ సెల్ ఫోన్/ఐపాడ్) కలిగి ఉండాలి. ఈ సర్టిఫికేట్ కోర్సులు చేయుటకు ఆసక్తి కలవారు తమ పేర్లను జూలై 20 వ తేదీ లోపు నమోదు చేసుకోవచ్చును. ఈ కోర్సులకు సంబంధించి పూర్తి వివరాలు మా వ్యవసాయ విశ్వవిద్యాలయం వెబ్ సైట్ (**www.angrau.ac.in**) ను సందర్శించి తెలుసుకోవచ్చును.

**మరింత సమాచారం కొరకు సంప్రదించవలసిన ఫోన్ నెం : 80087 88776, 83096 26619, 91105 62727. (ఉదయం 9 గం. నుండి సాయంత్రం 7 గం. వరకు మాత్రమే).**



# పొగాకు నారుమళ్ళు - సస్యరక్షణ


డా॥ బి. శైలజ జయశేఖరన్, శాస్త్రవేత్త (కీటక శాస్త్రం);
డా॥ వి. వెంకటేశ్వర్లు, సీనియర్ శాస్త్రవేత్త (కీటక శాస్త్రం);
డా॥ యు. శ్రీధర్, ప్రధాన శాస్త్రవేత్త (కీటక శాస్త్రం) మరియు
డా॥ ఎస్. భాస్కర్ నాయక్, సాంకేతిక అధికారి,
ఐ.సి.ఎ.ఆర్. - కేంద్ర పొగాకు పరిశోధనా సంస్థ,
రాజమహేంద్రవరం.


ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మరియు కర్ణాటక ప్రాంతాల్లో విరివిగా సాగు చేయబడే ముఖ్యమైన వాణిజ్య పంట పొగాకు. నారుమడిలో విత్తనం చల్లిన దగ్గర నుంచి వివిధ రకాల చీడపీడలు ఆశించి నష్టం కలిగిస్తాయి. పొగాకు నారు వేసుకునే సమయం వచ్చేసింది కాబట్టి నారుమళ్ళలో చీడ పురుగులు మరియు తెగుళ్ళ యాజమాన్య పద్ధతులను తెలుసుకుందాం. పురుగులలో ముఖ్యంగా పొగాకు లద్దెపురుగు, బుడ్డ పురుగు, తెల్లదోమ పొగాకు నారుని ఆశిస్తాయి. అలాగే మాగుడు, ఆకుమచ్చ, తెల్ల చుక్క, కప్పకన్ను తెగుళ్ళు కూడా నష్టం కలుగజేస్తాయి. వీటిని ఏ విధంగా నివారించాలో తెలుసుకుందాం.


## చీడపురుగుల నివారణ :

### చీమలు మరియు రోవ్ బీటిల్స్ :

మృదువైన మట్టి, తేమ ఉండటం వలన ఎర్ర చీమలు నారుమళ్ళను ఆక్రమిస్తాయి. అలాగే రోవ్ బీటిల్ అనబడే పొడవాటి పెంకు పురుగులు నారుమళ్ళలో మట్టిని తొలుచుకుంటూ బొరియలు చేసుకుని నివసిస్తాయి. ఇవి నల్లటి శరీరంపై కాషాయ రంగు చారలు కలిగి ఉంటాయి. ఇవి నిజానికి కుళ్ళుతున్న పదార్థాలను తీసుకునే పూతికాహారులు లేక చీడ పురుగులను హరించే మిత్ర పురుగుల కోవకు చెందుతాయి, కానీ మట్టిని తొలచే క్రమంలో లేత మొక్కలను కూడా చెదరగొట్టి నష్టం చేకూరుస్తాయి. వీటినీ, చీమలనీ అదుపు చేయటానికి ఫెన్వెలరేట్ డస్ట్ లేక క్లోరిపైరిఫాస్ డస్ట్‌ను విత్తనం చల్లే ముందు పైపైన మట్టిలో కలపాలి.

### పొగాకు లద్దె పురుగు / జల్లెడ పురుగు :

తల్లి రెక్కల పురుగు మొక్కల ఆకులపైన సుమారు 2000 గుడ్లను రాశిగా పెట్టి సన్నని రోమాలతో వాటిని కప్పివేస్తుంది. చిరు గొంగళి పురుగులు గుంపులుగా ఉండి ఆకుల పైపొరను గీరి తినడం వలన ఆకులు ఎండినట్లుగా జల్లెడలా పారదర్శకంగా కనిపిస్తాయి. చిరు గొంగళి పురుగులు వెలువడిన వెంటనే గుంపులుగా ఉంటాయి, కానీ పెరిగే కొద్దీ విడి విడిగా నష్టం కలుగ చేస్తాయి. రెండు రోజుల వయసున్న గొంగళి పురుగులు లేతాకుపచ్చని శరీరము ప్రస్ఫుటమైన నల్లటి తల కలిగి ఉంటాయి. అవి పెరిగే కొద్దీ ముదురు ఆకుపచ్చ, క్రమేపి బూడిద లేక నలుపురంగు లోకి మారి తల భాగంపై ఆంగ్ల అక్షరం 'Y' మాదిరిగా గీతలు కలిగి ఉంటాయి. ఎదిగిన లద్దె పురుగులు నున్నగా, నూగు లేకుండా, మూడు నిలువు పసుపు పచ్చ చారలు



లద్దె పురుగుల జీవితచక్రం



లద్దె పురుగులు ద్వారా కలిగే నష్టం



తల్లి రెక్కల పురుగులు



ఎర పంట ఆముదము     లింగాకర్షక ఎర

కలిగి ఉంటాయి. తలవైపు రెండు, తోకవైపు రెండు నల్లని పెద్ద మచ్చలు, స్పష్టంగా కనిపిస్తాయి. పెద్ద గొంగళి పురుగులు ఆకులను అమితంగా తిని ఆకు ఈనెలను మాత్రం వదిలేస్తాయి. చిన్న మొక్కలను కొట్టివేయడం వలన వీటిని కత్తెర పురుగులు అని కూడా అంటారు. వీటిని నియంత్రించకపోతే నారుమళ్లలో 80-100% నష్టం జరుగవచ్చు.

**యాజమాన్య పద్ధతులు :**

- వేసవిలో మడులు కట్టే ప్రదేశంలో రెండు మూడు లోతు దుక్కులు చేయడం వలన ఈ పురుగు కోశస్థ దశ నాశన మవుతుంది.
- నారుమడిలో విత్తడానికి 10 రోజుల ముందు మడి చుట్టూ ఆముదమును ఎర పంటగా విత్తుకోవాలి. వాటి ఆకులపై లభించే లద్దెపురుగు గుడ్ల రాశులను, లార్వాలను ఏరి నాశనం చేయాలి.
- విత్తనం చల్లిన 20 వ రోజున ఎకరాకు 4-5 లింగాకర్షక బుట్టలు (ఫెరొమోన్ ట్రాప్స్) ఏర్పాటు చేయడం ద్వారా పురుగు ఉధృతి తెలుస్తుంది, అలాగే ఎరలో చిక్కిన మగ పురుగులను నాశనం చెయ్యొచ్చు, ఆపై సస్యరక్షణ చర్యలనూ మొదలు పెట్టొచ్చు. ఒక శాతం వేప గింజల కషాయాన్ని, మూడు వారాల మొక్కలపై మరియు రెండు శాతం వేపగింజల కషాయాన్ని నాలుగు వారాల మొక్కలపై పిచికారి చేయాలి.
- స్పోడోప్టేరా ఎన్.పి.వి. ద్రావణం హెక్టారుకు 250 ఎల్.ఇ. (అంటే 250 జబ్బు పడ్డ లార్వాలను నలపగా వచ్చిన మిశ్రమం) చొప్పున సాయంత్రపు వేళల్లో పిచికారి చేయాలి. సరిగ్గా 250 వైరస్ సోకిన పెద్ద పురుగులను (లార్వాలను) నలిపి 1125 లీ. నీటిలో కలిపి దానికి 100 గ్రా. గంజిపిండి లేదా 10 గ్రా. బ్లూ, 10 గ్రా. బెల్లం కలుపుకుని వాడు కోవాలి. ఒక ఎకరానికైతే 100 ఎల్.ఇ. అంటే జబ్బుపడ్డ లార్వాల నుండి తీసిన వైరస్ ద్రావణాన్ని 400 లీటర్ల నీటిలో కలిపి వాడుకోవాలి. సూర్యరశ్మి (అతినీల లోహితకిరణాలు) నుంచి ఎన్.పి.వి.ని గంజిపిండి, బ్లూ సంరక్షిస్తాయి, ఎన్.పి.వి. ని పురుగులు తినడానికి బెల్లం ప్రేరకంగా పనిచేస్తుంది.
- ఐదు వారాల తర్వాత ఆర్థిక నష్ట పరిమితిని (చ.మీ. లో 6 మొక్కలకు నష్టం) మించి పురుగు తాకిడి ఉంటే, ఇమామెక్టిన్ బెంజొయేట్ 5 ఎస్.జి. 5 గ్రా. లేక నొవల్యురాన్ 10 ఇ.సి. 10 మి.లీ. ని 10 లీ. నీటికి కలిపి పిచికారి చేయాలి.
- తుఫాను హెచ్చరిక ఉన్నప్పుడు, పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నపుడు పురుగు మందు విషపు ఎరలను సాయంత్రపు వేళల్లో మడులపై చల్లుకోవాలి. ఎకరం నారుమడికి విషపు ఎరల తయారీ కోసం 2.5 కిలోల బెల్లాన్ని 5 లీ. నీటిలో కరగబెట్టి దానికి ఇమామెక్టిన్ బెంజొయేట్ 5 ఎస్.జి. 100 గ్రా. కలిపి, 10 కిలోల తవుడు చేర్చి బాగా కలిపి వాడుకోవాలి. పురుగు మందు విషపు ఎరలను కోళ్ళు, పక్షులు ఎక్కువగా సంచరించే ప్రాంతాలలో వాడరాదు.

**కాండం తొలుచు పురుగు / బుడ్డ / పుట్ట (స్టెమ్ బోరర్) :**

తల్లి రెక్కల పురుగు బూడిద రంగులో 1 సెం.మీ. కన్నా చిన్నగా ఉంటుంది. అది ఆకులపై 50-80 గుడ్లను విడివిడిగా పెడుతుంది. గొంగళి పురుగు ఆకు ఈనెలో ప్రవేశించి, ప్రధాన ఈనె ద్వారా కాండం లోనికి తొలుచుకుంటూ పోతుంది. లార్వా కాండములో స్థిరపడి ఆహారం తీసుకోవడం వలన మొక్కకు నీరు, ఆహారం అందటంలో అవరోధం కలిగి ఆ ప్రదేశంలో కాండం ఉబ్బినట్టు, బుడగ వలె కనిపిస్తుంది. క్రమేపీ మొక్క ఎదగక వెర్రి తలలు వేస్తుంది. నారుమళ్ళనుంచే పొగ తోటకు కూడా ఇది సంక్రమిస్తుంది. పొగాకు జాతి (సొలనేసీ) మొక్కలను మాత్రమే ఈ పురుగు ఆశిస్తుంది.



కాండం తొలుచు పురుగు / బుడ్డ/ పుట్ట (స్టెమ్ బోరర్)

**యాజమాన్య పద్ధతులు :**

- ఆకు రెలిచిన తర్వాత పంట మోళ్లను నాశనం చేయాలి, తోటలో వదిలి వేయకూడదు.
- నారు మొలకెత్తిన 30 రోజుల కొకసారి, 45 రోజులకి ఇంకోసారి ఫ్లూబెండిఎమైడ్ 480 ఎస్.సి. 2.5 మి.లీ. లేదా క్లోరాంట్రనిలిప్రోల్ 18.5 ఎస్.సి. 3 మి.లీ. ను 10 లీ. నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి.
- పురుగు ఉధృతి తీవ్రంగా ఉంటే నారు పీకడానికి రెండు మూడు రోజుల ముందు పైన వివరించిన ఏదో ఒక కీటక నాశినిని తప్పకుండ వినియోగించాలి.
- పురుగు సోకిన ఆకు క్రింది భాగములో కత్తి లేక సూదితో చీరితే, పురుగు చనిపోతుంది.
- కాండం ఉబ్బినట్టున్న మొక్కలను తోటలలో నాటకూడదు.
- నారు పీకిన తర్వాత, మిగిలిన నారును నాశనం చేసి, నారుమళ్ళను తప్పనిసరిగా దున్నివేయాలి.
- ఆకు రెలిచిన తరువాత పంట మోళ్లను కాల్చి లేదా కంపోస్టు గుంటల్లో వేసి నాశనం చేయాలి.

**తెల్లదోమ (వైట్ ఫ్లై) :**

పొగాకును ఆశించే తెల్లదోమ ప్రత్తి, మిరప, టమాటా, వంగ, బెండ, మినుము, ప్రొద్దు తిరుగుడు మొదలగు 300 పైచిలుకు మొక్కలని, పంటలని ఆశిస్తుంది. కాబట్టి పొగ తోట చుట్టూ పైన పేర్కొన్న పంటలు ఉంటే, ఈ పురుగు ఆశించడానికి ఆస్కారం ఎక్కువగా ఉంటుంది. తెల్లదోమ ఆశించిన మొక్కల ఆకులు ముడుచుకుని వికృతంగా కనిపిస్తాయి. తెల్లదోమలు తెల్ల నువ్వుగింజ కంటే చిన్నగా ఉండే రసం పీల్చు పురుగులు. అవి కలుపు మొక్కలను ఆశించి ఆకు అడుగు భాగంలో గుంపులుగా ఉంటూ వాటి పిల్లల (నింఫ్స్) తో సహా ఆకు సారాన్ని పీలుస్తాయి. అవి ప్రత్యక్షంగా రసం పీల్చడం వలన కలిగే హాని కన్నా ఆకుముడత వైరస్ ను వ్యాప్తిజేసి ఎక్కువ నష్టాన్ని కలుగజేస్తాయి. ఆకుముడత సోకిన మొక్కల ఆకు ఈనెలు మందముగా ఉండి ఆకులు వంకరలు పోతాయి.

**యాజమాన్య పద్ధతులు :**

- పొగతోట సమీపంలో తెల్లదోమ ఆశించే కలుపు మొక్కలను పూర్తిగా నాశనం చేయాలి.
- పొగతోట చుట్టూ రెండు వరుసలు జొన్న లేక మొక్కజొన్నను నాటుకోవడం వలన తెల్లదోమ ఉధృతిని కొంత వరకు తగ్గించవచ్చు.
- తీవ్రంగా ఆకుముడత బారినపడ్డ మొక్కలను పీకి నాశనం చేయాలి.
- తెల్ల దోమ ఉనికిని గమనించడానికి పసుపు రంగు జిగురు అట్టలను హెక్టారుకు 10-12 చొప్పున (ఎకరాకు 4-5) అమర్చుకోవాలి. వాటి పరిమాణం 12×15 సెం.మీ. మరియు 2 మి.మీ. మందము ఉంటే సరిపోతుంది.
- జిగురు అట్టల మీద 100 తెల్లదోమలు కనిపిస్తే, (సుమారు నారుమళ్లలో విత్తనం మొలకెత్తిన నెల రోజులు, మళ్ళీ తోటలో నాటిన 10వ రోజు నుండి) 15 రోజుల వ్యవధిలో మూడు సార్లు క్రింద తెలిపిన కీటకనాశినులను ఉపయోగించవచ్చు.
- ఇమిడాక్లోప్రిడ్ 17.8 ఎస్.ఎల్. 2.5 మి.లీ. లేదా థయామిథాక్సామ్ 25 డబ్ల్యు.జి. 2 గ్రా. లేదా ఫ్లోనికామిడ్ 50 డబ్ల్యు.జి. 4 గ్రా. లేదా పైమెట్రోజిన్ 50 డబ్ల్యు.జి. 4 గ్రా. చొప్పున 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయవచ్చు.
- ఎక్కువ సార్లు మందు చల్లవలసి వస్తే మందులు మార్చి మార్చి వాడాలి.
- రైతులందరూ సామూహికంగా సస్యరక్షణ చర్యలు చేపడితే తెల్లదోమ బెడదను అరికట్టవచ్చు.

మరింత సమాచారం కొరకు సంప్రదించాల్సిన ఫోన్ నెం : 94940 55344



# కరివేపాకు సాగులో మెలకువలు



డా॥ యం. శివ, శాస్త్రవేత్త (ఉద్యాన శాస్త్రం);
డా॥ యం. ఉష, శాస్త్రవేత్త (విస్తరణ శాస్త్రం);
డా॥ టి. వెంకటేశ్వర రెడ్డి, శాస్త్రవేత్త (కీటక శాస్త్రం)
మరియు డా॥ ఎస్.వి.వి.ఎస్. దుర్గాప్రసాద్, కార్యక్రమ సమన్వయ కర్త, కృషి విజ్ఞాన కేంద్రం, దర్శి.

కరివేపాకు పరిస్థితులను బట్టి నీటి పారుదల పంటగా, నీరు లేనప్పుడు మెట్ట పొలాల్లో వర్షాధార పంటగా సాగు చేయవచ్చు. ఇది నిలువుగా పెరిగే బహు శాఖీయ, బహువార్షిక పొద, దీని ఆకులు మంచి సువాసన కలిగి వుంటాయి. కరివేపాకు దక్షిణ భారత వంటకాల్లో తప్పకుండా ఉపయోగిస్తారు.

**వాతావరణం :** $26-37^0$ సెల్సియస్ గరిష్ట ఉష్ణోగ్రత మరియు $15^0$ సెల్సియస్ కనిష్ట ఉష్ణోగ్రత అవసరం. నీరు ఎక్కువయితే తట్టుకోలేదు.

**నేలలు :** నీరు నిలవని తేలికపాటి గరప నేలలు అనుకూలము. నీరు నిలిచే నల్లరేగడి భూములు సాగుకు పనికిరావు. మురుగు నీటి పారుదల వసతి గల ఎర్ర గరప నేలలు, ఒండ్రు నేలలు అనుకూలం.

**విత్తే సమయం :** జూలై-ఆగష్టు

**రకాలు :**

**దేశవాళీ రకాలు :** ముదురు ఆకుపచ్చ రంగు గల ఆకులు, కాడలు కలవి. లేత ఆకుపచ్చ రంగు గల కాడలున్నవి.

**సువాసిని :** వేరు మొక్కల ద్వారా మాత్రమే వ్యాప్తి చెందుతుంది. మెట్ట ప్రాంతానికి అనుకూలం.

**భువనేశ్వర్ :** నీటి పారుదల ప్రాంతాల్లో ఎక్కువగా సాగు చేయబడుతుంది.

**సెంకంపు :** ఈ రకము తమిళనాడులోని కోయంబత్తూరు జిల్లాలోని కరమాడై ప్రాంతంలో పండించబడే రకము. ఆకు కాడ ముదురు ఎరుపు రంగులో వుండును. ఆకు ఎక్కువ నూనె శాతం మరియు సువాసన కలిగి వుండును.

**నారు పోయటం :** ఎకరానికి 250 కిలోల కాయలు లేదా 80-100 కిలోల విత్తనాలు సరిపోతాయి. విత్తనాలను సేకరించి వెంటనే విత్తుకోవాలి. ఆలస్యంగా నాటుకుంటే మొలక శాతం తగ్గుతుంది. నారుమడులు (1 మీ. × 1 మీ. విస్తీర్ణంలో, 15 సెం.మీ. ఎత్తుతో) తయారు చేసి వరుసల్లో 10 సెం.మీ. ఎడంతో విత్తనాలను విత్తుకోవాలి. గడ్డి కప్పి రోజుకు రెండుసార్లు నీటిని చల్లాలి. 15-20 రోజులకు విత్తనాలు మొలకెత్తుతాయి. 3 నెలల వయస్సు గల మొక్కలను పొలంలో నాటుకోవాలి. రెండవ పద్ధతిలో విత్తనాలను కూడా నేరుగా ప్రధాన పొలంలో వరుసల మధ్య 1 మీ. ఎడం ఉండేటట్లు నాటుకోవాలి. 1 మీ. ఎడంలో విత్తనాలను ప్రతి అడుగుకు 2-3 విత్తనాలు పడేటట్లు వేసుకోవాలి. మొలక

వచ్చిన తరువాత వరుసల్లో 0.30 మీ. ఉండేటట్లు చూసి మిగిలిన మొక్కలను తీసివేయాలి. విత్తనాలు వేసిన తరువాత తేలికగా నీరు పెట్టాలి.



గొంగళి పురుగు



పొలుసు పురుగు

**నేల తయారీ :** నేలను 4-5 సార్లు బాగా దుక్కి వచ్చే వరకు దున్నాలి. ఎకరాకు 8 టన్నుల పశువుల ఎరువుతో బాటుగా 26 కిలోల నత్రజని, 9 కిలోల భాస్వరం మరియు 9 కిలోల పొటాష్ వేయాలి. నారు నాటటానికి ముందుగా 30 × 30 × 30 సెం.మీ. గుంతలను 1.2-1.5 మీ. దూరంలో, దుబ్బు నేలల్లో అయితే 90×90 సెం.మీ. దూరంలో తీయాలి. 6 నెలల తర్వాత రెండవ దఫా 8 కిలోల నత్రజనిని వేయాలి. కార్శి పంటలకు రెండవ సంవత్సరములో 8 కిలోల నత్రజనిని, 20 కిలోల చొప్పున భాస్వరం, పొటాష్ ఎరువులు వేసుకోవాలి. ప్రతి మొక్కకు 20 కిలోల పశువుల ఎరువు వేయాలి. డ్రిప్ ద్వారా ఎరువులు వేసినపుడు ఎకరానికి 26 కిలోల నత్రజని, 20 కిలోల పొటాష్ ఇచ్చే ఎరువులను 10 సమాన భాగాలుగా విభజించి ప్రతి 15 రోజులకు నీటిలో కరిగించి వేయాలి.

**నీటి యాజమాన్యం :** మొక్కలు నాటిన వెంటనే బోదెల ద్వారా నీరు పెట్టాలి. వారానికి ఒకసారి నీటిని ఇవ్వాలి.

**అంతర కృషి మరియు అంతర పంటలు :** పప్పుధాన్యాలను, ఆకు కూరలను అంతర పంటలుగా పండించవచ్చును. 1 మీ. ఎత్తు పెరిగిన తర్వాత మొక్క చివర్లను తుంచి వేయడం వల్ల ప్రక్క కొమ్మలు ఎక్కువగా వచ్చి గుబురుగా పెరుగుతుంది. కలుపు మొక్కలను ఎప్పటికప్పుడు తీసి నాశనం చేయాలి.

**సస్యరక్షణ :** గొంగళి పురుగులు ఆకులను తిని నష్టపరుస్తాయి. నివారణకు మలాథియాన్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. పొలుసు పురుగులు కాండంపై చేరి రసాన్ని పీల్చి వేస్తాయి. మొక్క పెరుగుదల తగ్గిపోతుంది. నివారణకు డైమిథోయేట్ 2 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి. పిచికారి చేసిన తర్వాత 10 రోజుల వ్యవధి ఇచ్చి ఆకు కోయాలి. ఆకుమచ్చ తెగులు నివారణకు 1 గ్రా. కార్బండెజిమ్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**దిగుబడి మరియు కోత కోయటం :** మొదటి సంవత్సరం పంట వేసిన 6 నెలలకు కోతకు వస్తుంది. తరువాత ప్రతి 3 నెలలకు కోతకు వస్తుంది. ఈ రకంగా ఎకరానికి 10 టన్నుల దిగుబడి వస్తుంది. దాదాపు ఎకరానికి (కిలో 10 రూ. చొప్పున 10 టన్నులకు) లక్ష రూపాయల ఆదాయం వస్తుంది. కరివేపాకు సాగు చేపట్టి తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఆర్జించవచ్చు. నిల్వ ఆకును ఎండబెట్టి, పొడిచేసి నిల్వ చేసుకొనవచ్చును. ఎండబెట్టిన ఆకును కూడ కొన్ని రోజుల వరకు రోజువారి కూరలు, పచ్చళ్ళలో వాడుకొనవచ్చును.

మరింత సమాచారం కొరకు సంప్రదించాల్సిన
ఫోన్ నెం : 99086 43750

# వాక్కాయా ??
# ఎన్నెన్నో ప్రయోజనాలయ్యా !!!



వై. ఉమా జ్యోతి, శాస్త్రవేత్త (సామాజిక విజ్ఞాన శాస్త్రం); డా॥ ఎస్. శ్రీనివాసరాజు, శాస్త్రవేత్త (ఉద్యాన శాస్త్రం); డా॥ జి. అమృత వీణ, శాస్త్రవేత్త (సేద్య శాస్త్రం); డా॥ జి. అను, శాస్త్రవేత్త (పశు వైద్యశాస్త్రం); డా॥ ఎస్. స్రవంతి, శాస్త్రవేత్త (కీటక శాస్త్రం); డా॥ ఎం. అనంత విహారి, శాస్త్రవేత్త (విస్తరణ శాస్త్రం) మరియు డా॥ టి.ఎస్.ఎస్. కే పాత్రో, కార్యక్రమ సమన్వయ కర్త, కృషి విజ్ఞాన కేంద్రం, రస్తకుంటుబాయి, పార్వతీపురం, మన్యం జిల్లా.


కొండ ప్రాంతాలలో, అడవులలో సహజంగా పండే పండ్లలో వాక్కాయ ఒకటి. ఇది వర్షాకాలంలో అంటే ఆగష్టు నెలలో ఎక్కువగా పండుతాయి. దేశీయ క్రాన్ బెర్రీస్ అని పిలిచే వాక్కాయ శాస్త్రీయ నామం కరిస్సా కేరందాస్. వివిధ ప్రాంతాలను బట్టి దీనిని కరండ, కలే కాయలు, కలేక్కాయలు, కలివి కాయలు అని పిలుస్తారు. వానాకాలంలో కొన్ని రోజులు మాత్రమే కాయలు కాస్తుంది. ఈ చెట్టు పూవులు తెల్లగా నక్షత్రాకారంలో మంచి సువాసనతో ఉండి గుత్తులుగా పూస్తాయి. వాక్కాయలో ఔషధ గుణాలు చాలా సమృద్ధిగా ఉంటాయి. కాయలు కూడా అంగుళం పొడవులో అండాకారంలో గుత్తులుగా కాస్తాయి. కాయలు మొదట ఆకుపచ్చగా ఉండి ఆ తర్వాత గులాబీ రంగులోకి వస్తాయి. ఈ పండులో విటమిన్ ఎ, విటమిన్ సి, ఫైబర్, కాల్షియం, ఫాస్పరస్ మరియు ఆస్కార్బిక్ ఆమ్లం పుష్కలంగా ఉన్నాయి. ఆస్కార్బిక్ ఆమ్లం కడుపు నొప్పి, మలబద్ధకం వంటి సమస్యలను తగ్గించి జీర్ణక్రియ సాఫీగా జరిగేలా చేయటమే కాకుండా పిత్తాశయ సమస్యల నివారణకు సహాయపడుతుంది. వాక్కాయల్లో ఐరన్ సమృద్ధిగా ఉండటం వల్ల రక్త హీనత ఉన్నవాళ్లకు చాలా మంచిది.

అంతేకాక జ్వరం, డయేరియా, చర్మ సమస్యలకు కూడా సమర్థవంతంగా పనిచేస్తుంది. శరీరంలో కొల్లాజన్ ఉత్పత్తిని పెంచి చర్మ సమస్యలు లేకుండా చేస్తుంది. వాక్కాయలలో యాంటీ మైక్రోబియల్ లక్షణాలు ఉండుట వలన ఒత్తిడి, ఆందోళన వంటి వాటిని దూరం చేసి మానసిక ప్రశాంతతను కలిగిస్తుంది.

మధుమేహం ఉన్నవారికి వాక్కాయ చాలా బాగా పనిచేస్తుంది. రక్తంలో చక్కర స్థాయిలను నియంత్రణలో ఉండేలా చేస్తుంది. వాక్కాయ ఆకులతో తయారుచేసిన కషాయాన్ని రోజులో రెండు సార్లు తీసుకుంటే జ్వరం తగ్గుతుంది. గుండె ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. అలాగే క్యాన్సర్ కణాల మీద పోరాటం చేస్తుంది.

వాక్కాయలలో ఫైబర్ సమృద్ధిగా ఉండుట వలన మలబద్ధకం వంటి జీర్ణ సంబంధ సమస్యలను తొలగించటమే కాకుండా బరువు తగ్గించటంలో కూడా కీలకమైన పాత్రను పోషిస్తాయి. అంతర్గత రక్తస్రావాన్ని తగ్గిస్తాయి. అంతేకాక రక్తంలో మలినాలను తొలగించి రక్తాన్ని శుద్ధి చేస్తుంది. అంతేకాక వాక్కాయలో విటమిన్ ఎ సమృద్ధిగా ఉండుట వలన కంటికి సంబందించిన సమస్యలను తగ్గించటమే కాకుండా కళ్ళు ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది.

కంటి చూపు మెరుగుదలకు సహాయపడుతుంది. వాక్కాయ చెట్టులో పండు, ఆకులు, బెరడు ఔషధంగా పనిచేస్తాయి.





వాక్కాయను ఎక్కువగా ఆయుర్వేదంలో ఉపయోగిస్తారు. చర్మం మీద వచ్చే దద్దుర్లను కూడా సమర్థవంతంగా తగ్గిస్తుంది. ఆకలి లేని వారిలో ఆకలి పుట్టేలా చేస్తుంది. నిద్రలేమి సమస్యతో బాధపడేవారికి కూడా మంచి ఔషధం అని చెప్పవచ్చు.

బాగా దాహంగా అనిపించినప్పుడు వాక్కాయను తింటే సమస్య తీరిపోతుంది. గొంతు నొప్పిని తగ్గిస్తుంది. వాక్కాయలో ఎన్ని ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయో. ఈ సీజన్ లో విరివిగా దొరికే వాక్కాయలను పప్పు, కూర, పచ్చడి వంటివి చేసుకొని తిని ఈ ఆరోగ్య ప్రయోజనాలను పొందండి. వాక్కాయలను పచ్చిగా కూడా తినవచ్చు. వాక్కాయని ఎన్నో రకాలుగా వండుకుని తినవచ్చును. దీనితో పప్పు, రోటి పచ్చడి, పులిహోర, ఆవకాయ, వరుగులు, ఎండబెట్టిన వాక్కాయ పొడి చేసుకోవచ్చు.

## వాక్కాయ నిలువ పచ్చడి

### కావాలిసిన పదార్థాలు

| | |
|---|---|
| వాక్కాయ | 8 కప్పులు |
| ఉప్పు | 1 కప్పు |
| కారం | 1 కప్పు |
| వేరుశెనగ లేదా నువ్వుల నూనె | 1 కప్పు |
| వెల్లుల్లి | $^1/_2$ కప్పు |
| ఆవపొడి | $^1/_4$ కప్పు |
| మెంతు పొడి | $^1/_4$ కప్పు |

### తయారీ విధానం

- ముందుగా రంగు మారిన వాక్కాయలను కోసి బాగా కడిగి ఎండలో ఆరబెట్టాలి.
- అరగంట ఎండలో ఆరబెట్టినా తర్వాత ఒక కాయను రెండు ముక్కలు చేసి దానిలో వున్నా గింజను తీసివేయాలి. తర్వాత పల్చని పొరను ఒక బట్టతో తుడిచి పక్కన పెట్టుకోవాలి.
- పైన చెప్పిన కొలతలతో అన్ని పదార్థాలను కలుపుకొని ఒక ప్లాస్టిక్ డబ్బాలో నిలువ చేసుకోవాలి. మూడవ రోజు దానిని బాగా కలిపి ఏదైనా పదార్థం తక్కువైతే కలుపుకుని నిలువ చేసుకుంటే సంవత్సరం అంతా వాడుకోవచ్చు.


మరింత సమాచారం కొరకు సంప్రదించాల్సిన ఫోన్ నెం : **96767 65255**

### విశ్వవిద్యాలయ పరిశోధనా మరియు విస్తరణ కేంద్రాలను డ్రోన్‌ల పంపిణీ కార్యక్రమం

ఆచార్య ఎన్. జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నందు తేది 12.06.2023 న విశ్వవిద్యాల ఉపకులపతి డా॥ ఏ. విష్ణువర్ధన రెడ్డి గారి చేతుల మీదుగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, మారుటేరు వారికి ఎస్సీ, ఎస్టీ స్కీం క్రింద మరియు అటారి జోన్-X వారి ఆర్ధిక సౌజన్యంతో కృషి విజ్ఞాన కేంద్రం, రెడ్డిపల్లి మరియు ఉండి వారికి డ్రోన్‌లను అందజేయడం జరిగింది. ఈ మూడు డ్రోన్‌లను వ్యవసాయంలో డ్రోన్ల వినియోగ ప్రదర్శనకు రైతులకు అవగాహన కల్పించడానికి అలాగే గ్రామీణ యువతకు డ్రోన్ సాంకేతికతను చేరవేయుటకు ఉపయోగిస్తారు.

# పశువులు, జీవాలలో దాణా ప్రాముఖ్యత

డా॥ విజయ ప్రకాష్, సహ ఆచార్యులు
(పశు విజ్ఞాన శాస్త్రం); వ్యవసాయ కళాశాల, బాపట్ల.



గ్రామ స్థాయిలో పశువులు జీవాల సంఖ్య అధికంగా ఉన్నప్పటికీ వాటి ఉత్పత్తి తక్కువవా ఉండటానికి ఉందు ముఖ్య కారణాలు ఉన్నాయి. ఒకటి నాసికరపు పశువులు, మరొకటి పశుగ్రాసాల కొరత, మేలుజాతి పశువులకు సమృద్ధిగా పశుగ్రాసాలు ఇచ్చినప్పుడు వాటి ఉత్పత్తి గణనీయంగా పెరుగుతుంది. రైతుల అవగాహన లోపం వలన మేలు జాతి పశువులను, నాసి రకం పశువులకు ఒకే రకమైన పశుగ్రాసాలు ఇవ్వడం వలన మేలు జాతి పశువుల నుండి అధిక ఉత్పత్తిని సాధించలేకపోతున్నారు. అంతేకాక మన రాష్ట్రంలో పచ్చి మేతల కొరత తీవ్రంగా ఉంది. ఈ తరుణంలో పాడి పశువులకు మరియు జీవాలకు పోషక విలువలతో కూడిన దాణాను అందించడం చాలా ముఖ్యం. పశు పోషణ విషయంతో చాలా మంది రైతులు నేటికీ సాంప్రదాయ పద్ధతులనే పాటిస్తున్నారు. కిలోల పాడి పశువుల నుండి అధిక పాల దిగుబడిని పొందాలంటే పుష్టికరమైన మేపును-30 అందించాలి. అంటే వరిగడ్డితో పాటు సమీకృత దాణాను ఇవ్వాలి. పశుగ్రాసాలు, ఎండుగడ్డి, మాగుడు గడ్డి వగైరా ఉత్పత్తుల ఖర్చు తక్కువ దాణా దినుసులు ఖరీదు ఎక్కువ దాణాలు మేపిన కడుపు నిండడానికి గడ్డి అవసరం. అందుచేత పశువులకు, ధాన్యపు జాతిగ్రాసాలు మరియు కాయ జాతిగ్రాసాలు మేపిన తరువాత, మిగతా పోషకాలకు వాటి ఉత్పాదక శక్తి ఆధారంగా సరైన మోతాదులో దాణా మిశ్రమం ఇవ్వాలి. కొందరు తమ వద్దనున్న వరితవుడు లేక వేరుశనగ చెక్క ఏదో ఒక దానిని మాత్రమే పశువులకు మేపుతారు. ఈ పద్ధతి మంచిది కాదు, తప్పనిసరిగా అందుబాటులో ఉండే దాణా దినుసులతో మిశ్రమ దాణా తయారు చేసుకొని వాడాలి.

### దాణా మిశ్రమం ఎలా వాడాలి ?

తక్కువ ఖర్చులో తయారు చేసుకోగలగాలి.
దాణా దినుసులు సులభంగా లభ్యమవ్వాలి
సులభంగా జీర్ణమయ్యేటట్లు ఉండాలి.
శరీర పెరుగుదలకు మరియు ఉత్పత్తికి తోడ్పడాలి.

దాణా మిశ్రమములో జీర్ణమయ్యే పోషక విలువలు 70% కన్నా, జీర్ణయోగ్యమైన మాంసకృత్తులు 16% కన్నా తక్కువ ఉండకూడదు. దాణా మిశ్రమం స్థానికంగా చౌకగా లభ్యమయ్యే ధాన్యపు గింజలు, చిరుధాన్యాలు, ధాన్యపు ఉత్పత్తులు, పప్పు దినుసులు, నూనె గింజలు మరియు వాటి ఉత్పత్తులతో తయారు చేసుకోవాలి. ఇలా తయారు చేసుకొనే దాణాలో పశువులకు సరిపడా అన్ని పోషక విలువలు, విటమిన్లు, ఖనిజ లవణాలు తగు పాళ్ళలో లభ్యమగునట్లు జాగ్రత్తలు వహించాలి.

100 కిలోల సమీకృత దాణాను తయారు చేసుకోవాలంటే 30-40 కిలోల మొక్కజొన్న / జొన్న గింజల పిండి, 40 కిలోల వరి /గోధుమ తవుడు, 20-30 కిలోల వేరుశనగ / తెలగ / పత్తి / కొబ్బరి పిండి, కిలో ఉప్పు, రెండు కిలోల ఖనిజ లవణ మిశ్రమం అవసరం అవుతాయి.

పట్టికలో చూపించిన విధంగా వాటి లభ్యతను బట్టి తయారు చేసుకోవచ్చు. లభ్యత, ధరను దృష్టిలో ఉంచుకొని, అనువైన ఆహార పదార్థాలను ఎంపిక చేసుకోవాలి. ధాన్యపు గింజలల్లో పోషకాలు, మాంసకృత్తులు పశువుకు శక్తినిస్తాయి. తవుడు ద్వారా పశువుకు జీర్ణమయ్యే పోషకాలు, మాంసకృత్తులతో పాటు విటమిన్లు, భాస్వరం, పీచు పదార్థాలు కూడా లభిస్తాయి. పిండి ద్వారా మాంసకృత్తులు, అదనపు శక్తి చేకూరతాయి. దాణాలో తగినంత మొలాసిస్ కలిపితే మంచి రుచి వస్తుంది. పశువులకు శక్తి కూడా లభిస్తుంది. ఖనిజ లవణాలు పశువుల్లో రోగ నిరోధక శక్తిని పెంచుతాయి.

మరింత సమాచారం కొరకు సంప్రదించాల్సిన
ఫోన్ నెం : 94903 85909

# జూలై మాసంలో పాడి మరియు జీవాల సంరక్షణలో చేపట్టవలసిన చర్యలు

డా॥ ఏ. లావణ్య, శాస్త్రవేత్త (పశు వైద్యశాస్త్రం) మరియు డా॥ వీరయ్య, కార్యక్రమ సమన్వయ కర్త, కృషి విజ్ఞాన కేంద్రం, ఊటుకూరు.

1. జూలై మాసంలో దుమ్ముతో కూడిన తీవ్రమైన గాలి మరియు అధిక వర్షాలు వచ్చే అవకాశాలు ఎక్కువ గనుక పశువులను మరియు జీవాలను చిత్తడి, వరదలు, ఉరుములు మెరుపులతో కూడిన వాతావరణం నుండి కాపాడుకోవాలి.
2. పశువులకు, గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందులు త్రాపించవలెను.
3. రైతులు ఇప్పటి వరకు పశువులకు మరియు జీవాలకు గాలికుంటు, గొంతువాపు, ఆంథ్రాక్స్ (నల్లజాడ్యం) మరియు ఎంటరో టాక్సీమియా (అతిగా తినడం వల్ల కలిగే వ్యాధి) వ్యాధులకు టీకాలు వేయించక పోయినట్లయితే ఈ నెలలో తప్పక వేయించాలి. ముఖ్యంగా ఎదిగిన గొర్రెలకు మరియు మేకలకు తప్పకుండా ఎంటరో టాక్సీమియా వ్యాధి టీకాలు వేయించాలి.
4. అపుడే పుట్టిన గేదె, ఆవు దూడలకు, గొర్రె, మేక పిల్లలకు పుట్టిన 2 గంటలలోపు రోగ నిరోధక శక్తి అధికంగా కలిగిన జున్ను/ముర్రు పాలు త్రాపించవలెను.
5. ఈనిన 7-8 రోజులలో పాలిస్తున్న పశువులలో "పాల జ్వరం" అనే వ్యాధి వచ్చే అవకాశం ఉంది. ఈ సమస్యను అధిగమించడానికి పశువు చూడితో ఉన్నపుడే బాగా సూర్యరశ్మి తగిలేలా జాగ్రత్త వహించాలి. దీనితో పాటు పశువు ప్రసవించే సమయంలో మాయ వేయకపోవడం వంటి సమస్యలు రాకుండా చూడి చివరి మాసంలో పశువుకు విటమిన్-ఇ మరియు సెలినియం ను ఇంజక్షన్ ద్వారా ఇప్పించాలి. రోజు 5-10 గ్రాముల సున్నం (లైమ్) లేదా 70-100 మి.లీ. కాల్షియం + పాస్ఫరస్ మిశ్రమాన్ని పశువుకు ఇవ్వాలి.
6. పశువులను నీరు పారే పొలంలో పెరిగే పచ్చిగడ్డిలో నేరుగా మేపరాదు. ఎందుకంటే సుదీర్ఘ వేసవి కాలం తర్వాత వర్షం కారణంగా త్వరిత గతిన పెరిగిన పచ్చిగడ్డిలో విష పూరితమైన "సైనైడ్" అనబడే విషకారకం ఉంటుంది. ముఖ్యంగా జొన్న పంటలో ఇది అధికంగా ఉంటుంది. కనుక పచ్చి గడ్డి పూర్తి పక్వ తదశకు వచ్చినపుడు మాత్రమే కోసి మేపవలసి వుంటుంది.
7. దీర్ఘకాలిక గడ్డి రకాలైన పారా గడ్డి, గిని గడ్డి, అంజన్ గడ్డి, రోడ్స్ గడ్డి, దీనానథ్ గడ్డి, హెడ్జి లూసర్న్ మెదలైన వాటిని ఈ నెలలోనె నాటుకోవాలి. ఈ రకాలు నాటిన 40-50 రోజుల తర్వాత కోతకు వస్తాయి. సమతుల ఆహారం కొరకు మొక్కజొన్న, జొన్న, సజ్జ వంటి గ్రాసాలను చిక్కుడు జాతి వంటి పశుగ్రాస రకాలతో కలిపి విత్తుకోవాలి.
8. గొర్రెలలో ఉన్ని తీసిన 21 రోజుల తర్వాత వాటి శరీరాలను అంటురోగ క్రిములను చంపు మందులతో (మలాథియాన్, ఫెన్ వలరేట్, సుమిసిడిన్ మొ.) పిచికారి లేదా డిప్పింగ్ చేయాలి.

మరింత సమాచారం కొరకు సంప్రదించాల్సిన ఫోన్ నెం : 90009 77322

## గమనిక : రైతు సేవలో టోల్ ఫ్రీ నెంబర్లు

| | | |
|---|---|---|
| ఫార్మర్స్ కాల్ సెంటర్ (ఆంగ్రూ) | : | 1800 425 0430 |
| ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ (డా॥ వై.ఎస్.ఆర్. రైతు భరోసా కేంద్రం) | : | 155251 |
| కిసాన్ కాల్ సెంటర్ | : | 1800 180 1551 |
| ఉద్యాన శాఖ | : | 1800 425 2960 |
| డా॥ వై.ఎస్.ఆర్. సంచార పశు ఆరోగ్య సేవ టోల్ ఫ్రీ నెం | : | 1962 |
| శ్రీ వెంకటేశ్వర పశు వైద్య విశ్వ విద్యాలయం | : | 1800 120 4209 |
| కిసాన్ సారథి | : | 1800 123 2175 లేదా 14426 |
| మత్స్య శాఖ | : | 1800 425 1188 |
| వాతావరణ సూచనలు (భారత ప్రభుత్వం) | : | 1800 180 1717 |

# ట్రాక్టర్ల వాడకంలో సమర్ధ యాజమాన్యం మరియు ఇంధనం ఆదా



డా॥ సి.హెచ్. మురళీ కృష్ణ, శాస్త్రవేత్త (అగ్రి ఇంజనీరింగ్), వ్యవసాయ పరిశోధనా స్థానం; డా॥ సాయి గంగాధరరావు, సహ ఆచార్యులు (అగ్రి ఇంజనీరింగ్), వ్యవసాయ కళాశాల, రాజమహేంద్రవరం మరియు
డా॥ సహదేవ రెడ్డి, ప్రధాన శాస్త్రవేత్త & అధిపతి, వ్యవసాయ పరిశోధనా స్థానం, అనంతపురం.

మన దేశంలో పెట్రో ఉత్పత్తుల వినియోగంలో 12 శాతం వ్యవసాయ రంగానికి ఖర్చు అవుతుంది. ఇక మన దేశ అవసరాలకు కావాల్సిన మొత్తం పెట్రో ఉత్పత్తులలో 75 శాతం దిగుమతి అవుతుండగా, 25 శాతం మాత్రమే మనం ఉత్పత్తి చేసుకోగలుగుతున్నాం. ప్రపంచ పెట్రో ఉత్పత్తులలో మన దేశంలో ఉత్పత్తి అయ్యేది 0.6 శాతం మాత్రమే. ప్రధాన ఉత్పత్తులైన పెట్రోల్, డీజిల్, కిరోసిన్ మొదలగునవి భూమి లోపలి నుండి తవ్వి తీసే ఇంధనాల ద్వారా లభ్యమవుతున్నాయి. కానీ ఇవి ఇంకా 40 సంవత్సరాలు మాత్రమే లభ్యమవుతాయి. అటు తర్వాత మనం పూర్తిగా భూమిపై పంటలు పండించే బయోడీజిల్, గోబర్ గ్యాస్ మరియు ప్రత్యామ్నాయాలు (గ్యాస్ కొరకు), ఇథనాల్ (పెట్రోల్‌కు బదులుగా) మొదలగు వాటిపై ఆధారపడవలసి ఉంటుంది. కావున పెట్రో ఉత్పత్తులను మనం పొదుపుగా వాడుకోవలసిన అవసరం ఉంది. కావున ట్రాక్టర్ వాడకంలో ఇంధన పొదుపు చర్యల ద్వారా రైతులు 20% వరకు డీజిల్ ఆదా చేసుకోవచ్చు.

### ట్రాక్టర్ వాడకంలో డీజిల్ ఆదా :

రైతులు ట్రాక్టర్ కొన్నప్పుడు ఇచ్చిన పుస్తకంలో ట్రాక్టర్ నిర్వహణకు సక్రమంగా నడుపుకొనేందుకు ఏమి చేయాలో వివరించి ఉంటుంది. దాని ప్రకారం సూచనలు పాటించడం. నిర్వహణ సమర్థంగా చేయడం వలన డీజిల్ 20-25% వరకు ఆదా చేయవచ్చు. ట్రాక్టరుకు సంబంధించిన తెలియని రిపేర్లు వస్తే గ్యారేజిలో లేదా అధీకృత డీలర్లను సంప్రదించవలెను.

### డీజిల్ వృధాగా కారడాన్ని నివారించడం :

మీ ట్రాక్టర్ జాయింట్లలో అనగా డీజిల్ ట్యాంక్ జాయింట్, డీజిల్ పంపు జాయింట్. డీజిల్ ఇంజెక్టర్ జాయింట్, ప్యూయల్ లైన్స్ జాయింట్స్ వద్ద డీజిల్ లీకయ్యే ప్రమాదం ఉంది. కావున ట్రాక్టర్‌ను ప్రతి రోజు తనిఖీ చేయాలి, దీన్ని చూడకుండా వదిలేస్తే సెకనుకు ఒక బొట్టు చొప్పున కారిపోతే ఒక సంవత్సరానికి 2000 లీటర్ల డీజిల్ రైతులు నష్టపోతారు.

### ట్రాక్టర్‌ను నిలిపినప్పుడు ఇంజన్‌ను ఆపుచేయడం :

ఇంజన్ పని చేస్తూ ట్రాక్టర్ నిలబడి ఉన్నట్లయితే ప్రతి గంటకు ఒక లీటర్ డీజిల్ వృధా అవుతుంది.

### ఎల్లప్పుడూ సరైన గేరుతోనే నడపడం :

తప్పుడు గేరును వాడితే 30% ఇంధనం వృధా అవుతుంది. పొలం పని 50% తగ్గుతుంది. కావున ట్రాక్టర్ బరువు లాగడానికి కష్టపడుతుంటే తక్కువ గేర్, వేగంతో ఉన్నప్పుడు ఎక్కువ గేర్ వాడాలి.

### ట్రాక్టర్ పొగ ఎక్కువగా వదలకూడదు :

అధికంగా పొగ వదిలే ట్రాక్టర్ అమూల్యమైన డీజిల్‌ను

వృధా చేస్తుంది. తప్పుడు గేరుతో నడిపినా, అధిక లోడు వేసినా ట్రాక్టర్‌కు ఎక్కువ పొగ వస్తుంది. ఫ్యూయల్ ఇంజెక్షన్ లోపం ఉంటే 25% డీజిల్ ఎక్కువ కాలుతుంది. క్రమపద్ధతిన ఇంజన్‌ను సర్వీసు చేయించాలి.

### మురికి డీజిల్ వలన దుమ్ము సోకిన గాలి వలన ఇంజన్ త్వరగా పాడవుతుంది :

ఎయిర్ ఫిల్టర్‌ను నిర్ణీత గడువులోగా శుభ్రం చేయాలి. రెండు ఫిల్టర్‌లను ఒకేసారి మార్చకూడదు. ఫ్యూయల్ ఫిల్టర్‌లు సరిగా లేకపోతే మురికి ఇంధనం వల్ల ఇంజను దెబ్బతింటుంది. సిఫార్సు చేసిన ప్రకారం పాతవి మార్చి కొత్త ఫిల్టర్‌లను బిగించాలి.

### చక్రాలు జారిపోతుంటే డీజిల్ వృధా :

ట్రాక్టర్ చక్రాల లోపల వాటర్ బ్యాలెస్ట్‌లు లేదా పాత ఇనుము చక్రాలు చేర్చడం ద్వారా చక్రాలు జారడం తగ్గుతుంది. కావున సరైన బరువును జోడించాలి. తరువాత బ్యాలెస్టులను తొలగించాలి. రోడ్లపై ట్రాక్టర్‌ను నడిపేటప్పుడు బ్యాలెస్టులు ఉండరాదు.

### అరిగిపోయిన టైర్ల వలన లాగుడు శక్తి తగ్గుతుంది :

సకాలంలో ట్రాక్టర్ టైర్లను రీలగ్ చేయించుకోవాలి. తిరిగి అమర్చేటప్పుడు ముందు నుండి చూసినట్లయితే 'వి' ట్రేడ్‌లు క్రింది వైపుగా ఉండేటట్లుగా జాగ్రత్త వహించాలి. సరైన టైర్ ప్రెజర్ ఉండేట్లు చూసుకోవాలి. రోడ్ల మీద, పొలాల్లో పనులకు వివిధ టైర్ పీడనం (ప్రెజర్) సిఫార్సు చేసారు. ట్రాక్టరు పుస్తకాన్ని చదవాలి. అధికృత డీలర్లని కాని, సర్వీసు ఇంజనీరును కానీ సంప్రదించాలి.

### ట్రాక్టర్ లాగుడు శక్తి బరువుతో సరి సమానంగా ఉండాలి :

ట్రాక్టర్ ఇంజన్ యొక్క పూర్తి హార్స్‌పవర్‌తో సరి సమానంగా ఉండేటట్లు పరికరం సైజుని, ట్రాక్టర్‌ని పని చేయించే స్పీడ్ (వేగం) ను ఎంచుకోవాలి. ట్రాక్టర్ పొగ వదలకుండా వీలైనంత అత్యధిక గేరుతో వెళ్ళాలి. తక్కువ సైజు పరికరాలు వాడినా లేదా తక్కువ స్పీడులో నడిపినా 30% డీజిల్ వృధా అవుతుంది. కావున పరికరాలను ఎంచుకునేటప్పుడు నిపుణులను సంప్రదించాలి. కంపెనీ సర్వీసు ఇంజనీరు ద్వారా సర్వీసు చేయించుకోవాలి.

### సేద్య మార్గాన్ని ముందు గానే నిర్ణయించుకుని ట్రాక్టర్‌ను పొలంలో నడపాలి :

పొలంలో దున్నవలసిన మార్గాన్ని ముందుగానే నిర్ధారించడం వలన సమయం డీజిల్ ఆదా అవుతుంది. పొట్టి చాలల్లో దున్నితే డీజిల్ ఎక్కువ కాలుతుంది. పొడవాటి చాలల్లో దున్నితే డీజిల్ తక్కువ కాలుతుంది.

### ట్రాక్టర్ సాధారణ సంరక్షణ :

ట్రాక్టర్ తయారి కంపెనీ వారు సంరక్షణ విధానం తెలియజేసే పుస్తకం కూడా ట్రాక్టర్‌తో పాటే ఇస్తారు. దానినను సరించి ట్రాక్టర్‌ను సంరక్షించుకొనుట మంచిది. దానితో పాటు క్రింద తెలిపిన సంరక్షణ చర్యలు చేపట్టుట మంచిది.

### ట్రాక్టర్ ప్రతి 8 నుండి 10 గంటల పని చేసిన తరువాత తీసుకోవాల్సిన చర్యలు :

- ట్రాక్టర్ పనిముట్లు శుభ్రం చేయాలి.
- క్రాంక్ కేస్‌నో హైడ్రాలిక్ ట్యాంక్‌లో అయిన మట్టం గమనించి అవసరమైతే నింపాలి.
- ట్రాక్టర్ దుమ్ముతో కూడిన వాతావరణంలో పని చేస్తే ఎయిర్ క్లీనరును శుభ్రం చేయాలి.
- డీజిల్ అవసరమైతే నింపాలి.
- రేడియేటర్ శుభ్రం చేసి మంచి నీటితో నింపాలి.
- ఫ్యాన్ బెల్ట్ సరిగా ఉండేట్లు చూసుకోవాలి.
- టైర్లలో గాలి సరిచూసి అవసరమైతే నింపాలి.
- బ్యాటరిని శుభ్రం చేసి అవసరమైతే శుద్ధి చేసిన నీరు నింపాలి.
- అవసరమైన కొన్ని గ్రీజ్ పాయింట్లు గ్రీజ్‌తో నింపాలి.
- ఆయిల్ పైపులు గాని, డీజల్ పైపులు గాని, హైడ్రాలిక్ ఆయిల్ పైపులు గాని మరియు రేడియేటర్ పైపులు కారకుండా చూడాలి.

### ప్రతి 50 నుండి 60 గంటలు పని చేసిన తరువాత ...

- పైన ఉన్న అన్ని చర్యలు తీసుకోవాలి.
- డీజిల్ ఫిల్టర్, ఆయిల్ ఫిల్టరులను శుభ్రం చేయాలి.
- బ్రేకులు బాగా పని చేసేటట్లు సరిచూసుకోవాలి.

### ప్రతి 100 నుండి 120 గంటలు పని చేసిన తరువాత :

- పైన ఉదహరించిన చర్యలు తీసుకోవాలి.
- బ్యాటరి టెర్మినల్స్ ఊడతీసి మెరుగు కాగితంతో శుభ్రం చేసి గ్రీజ్ లేదా వాక్సు పూయాలి.

- వాటర్ పంపు గమనించి ఏమైనా నీరు కారుతుందేమో గమనించాలి.
- డైనమో బేరింగుకు కొన్ని ఆయిల్ చుక్కలు వేయాలి.

**ప్రతి 200-250 గంటలు పని చేసిన తరువాత :**

- పైన ఉదహరించిన అన్ని చర్యలు చేపట్టాలి.
- పంపులో ఉన్న ఆయిల్ కార్చి వేసి శుభ్రం చేసిన తరువాత ఆయిల్‌తో నింపాలి.
- ఫిల్టర్లు మార్చాలి.
- ముందు చక్రాల హబ్ బేరింగ్ క్లియరెన్సు సరిచేయాలి.

**ప్రతి 480-500 గంటలు పని చేసిన తరువాత :**

- పైన ఉదహరించిన చర్యలు తీసుకోవాలి.
- రేడియేటరు శుభ్రం చేయాలి. కూలింగ్ విభాగం శుభ్రం చేయాలి.
- ముందు చక్రాలు అటు ఇటు మార్చాలి.
- డీజిల్ ట్యాంక్ శుభ్రం చేయాలి.
- సెల్ఫ్ స్టార్టర్ డైనమో శుభ్రం చేయాలి.
- ఇంజక్టర్స్ శుభ్రం చేసి అడ్జస్టు చేయాలి.

**ప్రతి 960-1000 గంటలు పని చేసిన తరువాత :**

- పైన ఉదహరించిన అన్ని చర్యలు తీసుకోవాలి.
- గేరు బాక్స్, స్టీరింగ్ బాక్సు, పి.టి.ఒ. మరియు హైడ్రాలిక్ ట్యాంక్‌లలో ఆయిల్ లైనింగులు సరిచేయాలి.
- బ్రేకు లైనింగ్‌లు సరి చేయాలి.

**ట్రాక్టర్ బ్యాటరి విషయంలో జాగ్రత్తలు :**

- బ్యాటరీ ఎప్పటికప్పుడు తుడిచి శుభ్రం చేయాలి.
- అప్పుడప్పుడు బ్యాటరి టెర్మినల్‌ని మెరుగు కాగితంతో తుడిచి వాక్సు పూయాలి.
- అప్పుడప్పుడు బ్యాటరి సెల్స్ మూతలు తీసి సాంద్రత పరిశీలించాలి. సాంద్రత 1.225 కంటే తక్కువగా ఉంటే బ్యాటరి చార్జి చేయాలి.
- బ్యాటరి సెల్ విద్యుత్తు 1.5 ఓల్ట్‌లుంటే బ్యాటరి చార్జీ చేయాలి.
- బ్యాటరి సెల్స్‌లో ద్రావకం ప్లేటులపై 12-14 మి.మీ. ఉండేటట్లు చూడాలి. తక్కువగా ఉంటే శుద్ధి చేసిన నీటితో నింపాలి.
- బ్యాటరి అతి త్వరగా ఛార్జీ చేయుట కాని, ఎక్కువ ఛార్జీ చేయకూడదు.
- బ్యాటరి క్రొత్తదైతే గుర్తింపు పొందిన ఎలక్ట్రీషియన్ దగ్గర ఛార్జి చేయాలి.
- బ్యాటరి క్లాంపులు గాని, టర్మినల్స్ గాని ఎక్కువగా లేదా తేలికగా బిగించరాదు.
- స్టార్టింగ్ మోటారు 1/2 నిమిషం మించి వేయరాదు.
- ట్రాక్టరు ఎక్కువ కాలం పని లేకుండా షెడ్‌లో ఉంచాల్సి వస్తే, బ్యాటరిలోని ద్రావకం తీసి వేసి నీటితో కడిగి శుభ్రం చేసి జాగ్రత్త పరచాలి.

**ట్రాక్టరు టైర్లు ఎక్కువ కాలం పని చేయాలంటే :**

- టైర్లలో గాలి సరైన వత్తిడితో నింపాలి.
- ఎక్కువ వేగం టైర్లకు హానికరం.
- ఆకస్మికంగా బ్రేకులు వేయుట హానికరం.
- క్లచ్ జాగ్రత్తగా వాడితే టైర్లకు మేలు.
- అధికమైన బరువు టైర్లకు హానికరం.
- ట్రాక్టరుపై అధిక భారం వేయునప్పుడు టైర్లు అక్కడే తిరిగితే మిక్కిలి హానికరం.
- ట్రాక్టరుతో అధిక భారం లాగించుటకు టైర్ల క్రింద ఏవిధమైన రాళ్ళు వేయకూడదు.
- మిక్కిలి వేగంగా ట్రాక్టరు పక్కకు తిప్పుట వలన టైర్లకు హాని కలుగుతుంది.
- ట్రాక్టరు అతివేగంగా బయలు దేరుట, ఆపివేయుట వలన టైర్లు ఎక్కువగా అరిగిపోతాయి.
- టైర్లు అటు ఇటు మార్చడం వలన అరుగుదల సమంగా ఉండును.
- టైర్లలో గాలి పూర్తిగా పోయిన యెడల కొంచెం దూరం కూడా నడుపరాదు.
- టైర్లపై భాగం అరిగినట్లైతే రీ ట్రేడింగ్ లేదా రీక్యాపింగ్ చేయించాలి.
- ట్రాక్టరు ఎక్కువ కాలం వృధాగా ఉండవలసి వస్తే ట్రాక్టరు క్రింద సపోర్టులు పెట్టి టైర్లపై భారం పడకుండా చూడాలి.

పై సూచనలు రైతులు పాటించినచో ట్రాక్టరు దీర్ఘ కాలం మన్నుతుంది.

మరింత సమాచారం కొరకు సంప్రదించాల్సిన
ఫోన్ నెం : 94938 16825

## విశ్వవిద్యాలయ 55 వ వార్షిక స్నాతకోత్సవం

ఆచార్య ఎన్. జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 55 వ వార్షిక స్నాతకోత్సవంను తేది 22.05.2023 న, వ్యవసాయ కళాశాల, బాపట్లలో నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ గవర్నర్ మరియు విశ్వవిద్యాలయ ఛాన్సలర్, గౌరవనీయులు శ్రీ ఎస్ అబ్దుల్ నజీర్ గారు ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ రాజేంద్ర సింగ్ పరోడ గారు, మాజీ సెక్రటరీ, డి.ఎ.ఆర్.ఇ. డైరెక్టర్ జనరల్ ఐ.సి.ఎ.ఆర్., చైర్మన్ టి.ఎ.ఎ.ఎస్. పాల్గొన్నారు. గౌరవ ఉపకులపతి డా॥ ఏ. విష్ణువర్ధన్ రెడ్డి గారు ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ మరియు విశ్వవిద్యాలయ కులపతి ఎస్.అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ చిరుధాన్యాల పంటలపై మరింత దృష్టి పెట్టి చిరుధాన్యాల గ్రామాలను ఏర్పాటు చేయవలసిన ఆవశ్యకతను ఆయన వివరించారు. ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం అమలు చేస్తున్న అడ్వైజరీ సిస్టం విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తుని ఇవ్వడానికి తోడ్పడుతుందని, పెరుగుతున్న జనాభాకు ఆహారా భద్రతను కలిపించడానికి అధునాతన సాంకేతికతలు ఉపయోగపడతాయని డి.ఎ.ఆర్.ఇ. మాజీ సెక్రటరీ మరియు ఐ.సి.ఏ.ఆర్. డైరెక్టర్ జనరల్ పద్మభూషణ్ ప్రొఫెసర్ రాజేంద్రసింగ్ పరోడ అన్నారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ఉపకులపతి డా॥ ఏ. విష్ణువర్ధన రెడ్డి, మాట్లాడుతూ ఐ.సి.ఎ.ఆర్. డిసెంబర్ 3, 2021 న అగ్రికల్చరల్ యూనివర్సిటీ ర్యాంకింగ్ సిస్టం కింద జాతీయ ర్యాంకింగ్‌లను ప్రకటించగా 2020-21 సంవత్సరానికి జాతీయ స్థాయిలో 11వ స్థానం మరియు రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాలలో 7 వ స్థానాన్ని సముపార్జించుకున్నట్లు తెలిపారు.

ఈ స్నాతకోత్సవంలో 1476 మంది విద్యార్థినీ విద్యార్థులు డిగ్రీ సెర్టిఫికెట్లు అందుకున్నారు. ఈ స్నాతకోత్సవం లో ఉత్తమ శాస్త్రవేత్తలకు పురస్కారాలను ప్రధానం చేసారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆంగ్రూ మరియు నాబార్డ్ మధ్య రైతుల అభివృద్ధి కొరకు చర్చా కార్యక్రమం

ఆచార్య ఎన్. జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, లాం, గుంటూరు నందు తేది 30.05.2023 న విశ్వవిద్యాలయ ఉపకులపతి డా॥ ఏ. విష్ణువర్ధన్ రెడ్డి గారి అధ్యక్షతన, నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్ శ్రీ యం.ఆర్. గోపాల్ ముఖ్య అతిథిగా; విశ్వవిద్యాలయ అధికారులు మరియు వివిధ విస్తరణ విభాగాల అధిపతులు మరియు నాబార్డ్ అధికారుల మధ్య రైతులను సంఘటిత పరచి, అననుకూల వాతావరణ మరియు మార్కెట్ ధరల మధ్య నష్టపోతున్న వ్యవసాయ రంగాన్ని స్థిరీకరించే విధంగా వివిధ కార్యక్రమములు చేపట్టే అవకాశాలను చర్చించడం జరిగినది.

## విశ్వవిద్యాలయ వ్యవస్థాపక దినోత్సవం

ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ వ్యవస్థాపక దినోత్సవంను తేది 12.06.2023 న ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, లాం, కృష్ణా ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలకు అధ్యక్షుడిగా విశ్వవిద్యాలయ ఉపకులపతి డా॥ ఏ. విష్ణువర్ధన్ రెడ్డి గారు, ప్రత్యేక అతిధిగా డా॥ త్రిలోచన్ మొహాపాత్ర, చైర్మన్ పి.పి.వి.ఎఫ్.ఆర్.ఎ. మాజీ సెక్రటరీ డి.ఎ.ఆర్.ఇ. డైరెక్టర్ జనరల్ ఐ.సి.ఎ.ఆర్. పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఉపకులపతి డా॥ ఏ. విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ 11 వ్యవసాయ, వ్యవసాయ ఇంజనీరింగ్, ఫుడ్ అండ్ కమ్యూనిటీ సైన్స్ నుంచి 45115 మంది విద్యార్థులు వివిధ రంగాల్లో విశ్వవ్యాప్తంగా విస్తరించి ఉన్నారని, జాతీయ స్థాయిలో 33% వరి వంగడాలు 54% వేరుశనగ రకాలు వ్యాపించి ఉన్నాయని తెలియజేశారు. వ్యవసాయంలో కూలీల కొరత తగ్గించడానికి డ్రోన్ టెక్నాలజీ లో విశ్వవిద్యాలయం ముందు ఉందని, ఈ విషయంలో శిక్షణ ఇవ్వడంతో పాటు ఆర్.బి.కె. ద్వారా డ్రోన్లను అందజేయనున్నారని తెలియజేశారు.

ప్రత్యేక అతిధిగా డా॥ త్రిలోచన్ మొహాపాత్ర, చైర్మన్ పి.పి.వి.ఎఫ్.ఆర్.ఎ., మాజీ సెక్రటరీ డార్క్, డైరెక్టర్ జనరల్ ఐ.సి.ఎ.ఆర్.-ఫుడ్ ఫర్ న్యూట్రిషన్ - ప్రొడక్షన్ అనే విషయం మీద విశదీకరించారు. ఈ విశ్వవిద్యాలయం నాణ్యమైన మానవ వనరులను ఉత్పత్తి చేసిందని కొనియాడారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వ్యవసాయ ప్రదర్శనలో విశ్వవిద్యాలయంలోని, వివిధ పరిశోధనా స్థానాలు కృషి విజ్ఞాన కేంద్రాలు వివిధ పంటల ఫౌండేషన్ ధృవీకరణ విత్తనాలను వరి, పెసర, మినుము, కంది, జొన్న, కొర్ర, రాగి, మొదలగు పంటలను రైతులు కొనుగోలు చేసేందుకు ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా 11 మంది ఉత్తమ రైతులకు, 8 మంది శాస్త్రవేత్తలకు, 2 చెఱుకు పరిశ్రమ ఉద్యోగులకు అవార్డులను ప్రధానం చేసారు. ఈ కార్యక్రమంలో డా॥ ఎ. రఘువర్ధన్ రెడ్డి గారు, మాజీ ఉపకులపతి, ఐ.సి.ఎ.ఆర్. - ఐ.ఐ.ఓ.ఆర్. డైరెక్టర్ డా॥ ఆర్.కె. మాథూర్; గుంటూరు జిల్లా కలెక్టర్ మరియు మేజిస్ట్రేట్ శ్రీ యం. వేణుగోపాల్ రెడ్డి, ఐ.ఎ.ఎస్., ఎ.పి. ఫిషరీస్ యూనివర్శిటి ఒ.ఎస్.డి. డా॥ ఓ. సుధాకర్; ఎ.పి.ఎస్.ఎస్.సి.ఎ. డైరెక్టర్ డా॥ వి. త్రివిక్రమ్ రెడ్డి; విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా॥ జి. రామారావు, విశ్వవిద్యాలయ అధికారులు, విశ్రాంత ఆచార్యులు, పూర్వ విద్యార్థులు, రైతులు, శాస్త్రవేత్తలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సమస్యలు - శాస్త్రవేత్తల సలహాలు

డా॥ ఏ. మనోజ్, శాస్త్రవేత్త (విస్తరణ) మరియు డా॥ యం. వెంకటరాములు, సీనియర్ శాస్త్రవేత్త (విస్తరణ శాస్త్రం);
వ్యవసాయ సమాచార మరియు ప్రసార కేంద్రం, గుంటూరు – 522 034

**సి. హెచ్. సత్యనారాయణ రెడ్డి, మెదక్, తెలంగాణ.**

**ప్ర. చౌడును తట్టుకునే వరి రకాలను తెలియజేయండి ?**

జ. చౌడును తట్టుకునే వరి రకాలైన ఇంద్ర, నెల్లూరు సోన, పాండురంగ, నెల్లూరు సిరి, యం.సి.యం. రైస్ 103, స్వర్ణముఖి, సోమశిల, నెల్లూరు మషూరిలను సార్వాలో సాగు చేసుకోవచ్చు.

**ఆర్. వెంకటేశ్వరరావు, తిమ్మర్తిపాడు, కారంచేడు, బాపట్ల జిల్లా.**

**ప్ర. ఆరుతడి వరిలో కలుపు సమస్య ఎక్కువగా ఉంది. నివారణ తెలియజేయండి ?**

జ. ఈ పద్ధతిలో నీరు నిల్వగట్టడం ఉండదు. కాబట్టి, కలుపు సమస్య ఎక్కువగా ఉంటుంది. కలుపు నివారణకు సమగ్ర నివారణ చర్యలు చేపట్టాలి. విత్తిన పిదప భూమిలో తగు మాత్రం తేమ ఉండే పరిస్థితులలో కలుపు మందు వాడాలి. ఒక ఎకరానికి 1.5 లీటర్లు పెండిమిథాలిన్ లేదా 500 మి.లీ. ప్రిటిలాక్లోర్ + సేఫనర్ లేదా 35 గ్రా. ఆక్సాడయార్జిల్ వంటి వాటిలో ఏదో ఒక మందును 200 లీటర్లు నీటిలో కలిపి భూమిపై విత్తిన 2-3 రోజుల్లోపల పిచికారి చేయాలి. విత్తిన వెంటనే వర్షం పడే సూచనలున్నట్లయితేపెండిమిథాలిన్ పిచికారి చేయకూడదు. పెండిమిథాలిన్ పిచికారి చేసిన వెంటనే నీటి తడి పెట్టకూడదు. విత్తిన 15-20 రోజులకు కలుపు ఉధృతిని బట్టి బిస్‌పైరిబాక్ సోడియం అనే మందును ఎకరాకు 120 మి.లీ. పిచికారి చేయాలి. విత్తిన 20-25 రోజులపుడు వెడల్పాటి ఆకు జాతి కలుపు మొక్కలు ఎక్కువగా ఉన్నట్లయితే 2,4 డి సోడియం సాల్ట్ 2 గ్రా. /లీ. లేదా 2,4 డి అమైన్‌సాల్ట్ ఏ 2 మి.లీ./ లీ. నీటికి కలిపి పిచికారి చేయాలి.

**బి. శ్రీనివాసరెడ్డి, కోరుకొండ, రాజమహేంద్రవరం, తూర్పు గోదావరి జిల్లా.**

**ప్ర. వరిలో యం.టి.యు. రైస్ 1318 రకం లక్షణాలు తెలియజేయండి ?**

జ. యం.టి.యు. రైస్ 1318 రకం సార్వాలో సాగుకు అనుకూలంగా ఉండి 150 రోజుల పంట కాలంను కలిగి ఉంటుంది. ఈ రకం అగ్గి తెగులు, మెడ విరుపు మరియు పొట్టకుళ్ళు తెగులును తట్టుకుంటుంది. దీని కాండం ధృడంగా ఉండి చేనుపై పడిపోదు, తక్కువ నత్రజనితో అధిక దిగుబడినిచ్చే రకము. గింజ మధ్యస్థ సన్నంగా ఉండి, పచ్చి బియ్యానికి అనుకూలం. బియ్యం పారదర్శకంగా ఉండి ఎక్కువ నిండు గింజలు కలిగి ఉంటుంది.

**జి. సత్యం, రాజాం, శ్రీకాకుళం జిల్లా.**

**ప్ర. ఖరీఫ్‌లో సాగుకు అనువైన పెసర రకాలు తెలియజేయండి మరియు పెసర మార్కెట్ ధర ఎంత ఉంది ?**

జ. ఖరీఫ్‌లో పెసర సాగుకు ఎల్.జి.జి. 407, 460, 450, 410, 574, 604; టి.యం. 96-2, డబ్ల్యు.జి.జి. 42, ఐ.పి.యం. 2-14 రకాలు అనుకూలం. ప్రస్తుతంగా పెసర మోడల్ మార్కెట్ ధర రూ./క్వి. 5,292 నుంచి 7,516 వరకు ఉంది.

**జి. వెంకటేశ్వర్లు, పొన్నూరు, గుంటూరు జిల్లా.**

**ప్ర. ట్రైకోడెర్మా విరిడిని ఏవిధంగా ఉపయోగించాలి ?**

జ. ఎకరాకు ట్రైకోడెర్మా విరిడి 2 కిలోలను బాగా చివికిన పశువుల ఎరువు 90 కిలోలు మరియు 10 కిలోల వేపపిండిలో కలిపి 15 రోజులు నీడలో ఉంచిన తర్వాత దుక్కిదున్నే సమయంలో నేలలో వేసుకోవచ్చు మరియు కిలో విత్తనానికి 8 నుంచి 10 గ్రా. ట్రైకోడెర్మా పొడిని కలిపి విత్తనశుద్ధి చేసుకోవచ్చు.

**ఎ. వీరేశ్వరరావు, ఐనవెల్లి, డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా.**

**ప్ర. డ్రోన్ పైలెట్ శిక్షణ గూర్చి వివరించండి ?**

జ. ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, గుంటూరు ఆధ్వర్యంలో డ్రోన్‌పై 5 రోజులు మరియు 12 రోజులు శిక్షణలను నిర్వహిస్తున్నారు. శిక్షణ తీసుకోవాలనే ఆశక్తి ఉన్న అభ్యర్థులు తప్పని సరిగా 10 వ తరగతి చదివి 2 సం॥ ఇంటర్మీడియట్ లేదా డిప్లమోకి సమానమైనవి చేసి ఉండాలి మరియు భారత పాస్‌పోర్ట్ ఖచ్చితంగా కలిగి ఉండాలి. మరిన్ని వివరాలకు మీ మండల వ్యవసాయ అధికారిని గాని లేదా విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌ను www.angrau.ac.in ను సంప్రదించగలరు.



పంటల సాగులో సలహాల కోసం ఫార్మర్స్ కాల్ సెంటర్ 1800 425 0430 ను సంప్రదించండి.

# ఐరోపా తేనెటీగల పెంపకంలో సిరులు పండిస్తున్న ఉద్యోగి

డా॥ ఎ. రాజేష్, శాస్త్రవేత్త (కీటక శాస్త్రం); డా॥ యన్. మల్లిఖార్జున రావు, కార్యక్రమ సమన్వయ కర్త; డా॥ ఎన్. డెబోర మెస్సియాన, సీనియర్ శాస్త్రవేత్త (గృహ విజ్ఞాన శాస్త్రం); డా॥ ఎ. శ్రీనివాస్, శాస్త్రవేత్త (మత్స్య శాస్త్రం); డా॥ పి. వినయలక్ష్మీ, శాస్త్రవేత్త (సేద్య శాస్త్రం) మరియు డా॥ బి. రజిత, శాస్త్రవేత్త (విస్తరణ శాస్త్రం); కృషి విజ్ఞాన కేంద్రం, ఉండి.



రైతులు ఒకే పంట మీద ఆధారపడడం మరియు వాతారవరణ మార్పుల వలన వివిధ పంటలలో సరియైన, స్థిరమైన దిగుబదులు పొందలేకపోతున్నారు. రైతులు వ్యవసాయంతో పాటు అదనపు మరియు స్థిరమైన ఆదాయం పొందవచ్చు. ఈ అనుబంధ రంగాలలో ముఖ్యమైనది తేనెటీగల పెంపకం. ఈ తేనెటీగల పరిశ్రమ వలన ఆదాయాన్ని పొందడమే కాకుండా పరిసరాలలో ఉన్న వివిధ పంటల దిగుబడులు కూడా 3 నుండి 30% వరకు పెరుగుతాయి. ఈ తేనె పరిశ్రమ వలన తేనెతో పాటు వివిధ ఉత్పత్తులైన రాజహారం, మైనం, పుప్పొడి, తేనెటీగల విషం మరియు ప్రోపోలిస్‌తో అదనపు ఆదాయం పొందవచ్చు.

తేనె పరిశ్రమ నుండి వచ్చే తేనె మరియు ఉప ఉత్పత్తుల నుండి వచ్చే ఆదాయంతో పాటు తేనె పట్టుల అమ్మకం ద్వారా, తేనె పెట్టెలను పరపరాగ సంపర్కానికి అద్దెకు ఇవ్వడం ద్వారా, రాణి ఈగలను పెంపొందించి అమ్మడం ద్వారా కూడా అందనపు ఆదాయన్ని పొందవచ్చు.

యలమంచిలి మండలం చించినాడ గ్రామానికి చెందిన ఏం.ఎస్. రాజు (90599 02399) అనే వ్యక్తి, తేనెటీగల పెంపకం పై మక్కువతో ఉద్యోగం చేస్తూనే 2015 లో సి.బి.ఆర్.టి.ఐ. పుణెలో శిక్షణ తీసుకుని 2017 లో 20 పెట్టెలను కొని పార్ట్ టైమ్ లో తేనెటీగల పెంపకం చేపట్టారు. అయితే తేనెటీగలను సీజన్లు అనుసరించి వివిధ పంటలపై మార్చేటప్పుడు రవాణా చార్జీలు 20 పెట్టెలకు అయ్యే ఖర్చుతో 50 పెట్టెలను కూడా రవాణా చేయవచ్చునని గమనించి మరొక 30 పెట్టెలను కొనుగోలు చేసి తద్వారా వచ్చిన తేనెను చుట్టూ ప్రక్కల ఉంటే వారికి అమ్ముతూ కొంత అదనపు ఆదాయం పొందగలగారు. అయితే తేనెటీగల పెంపకంలో వివిధ రకాల సమస్యలు ఉంటాయి. ఉదాహరణకు రాణి ఈగ గుడ్లు పెట్టడం మానివేయడం, చిన్ని చిన్ని సమస్యలు (రోగాలు) వచ్చినపుడు రాజమండ్రికి చెందిన సత్యనారాయణ అను వ్యక్తి మీ దగ్గరలో ఉన్న ఉండి కృషి విజ్ఞాన కేంద్రం ఉండి శాస్త్రవేత్తలను కలవమని చెప్పగా, అప్పటినుండి ఉండి కె.వి.కె. వారి సలహా మేరకు క్రమంగా ఇప్పుడు 300 పెట్టెల వరకు తేనెటీగల పెంపకాన్ని అభివృద్ధి చేశారు.

అంతే కాకుండా పెట్టెలను డివిజన్ చేయడం ద్వారా కొత్త కాలనీలు అభివృద్ధి చేసి కొత్తగా తేనెటీగల పెంపకం చేపట్టే వారికి తేనె పెట్టెలను, ఇతర పరికరాలను అమ్ముతూ ఇప్పుడు తానే స్వయంగా ఒక బ్రాండ్ పెట్టుకుని తేనె, తేనెటీగల పుప్పొడి వంటివి అమ్ముచున్నారు. సంవత్సరానికి సుమారు రూ. 8 లక్షల నుండి 10 లక్షలు ఆదాయం పొందుతున్నారు.

**తేనెటీగల పరిశ్రమ వలన ఆదాయ మార్గాలు :**

1. తేనె, తేనెటీగల పుప్పొడిని అమ్మడం
2. కొత్త కాలనీలు అభివృద్ధి చేసి అమ్మడం
3. తేనెటీగల పెంపకానికి సంబంధించిన పరికరాలు వంటివి అమ్మడం.

తేనెటీగల కాలనీలో ఏదైనా సమస్య వచ్చినప్పుడు ఉండి కె.వి.కె. శాస్త్రవేత్తలకు ఫోటోలు పెట్టిన యెడల పరిష్కార మార్గాలు చూపిస్తున్నారు అని తెలిపారు. అలాగే తన తేనెటీగల పరిశ్రమను సందర్శించడానికి వెళ్లినప్పుడు సలహాలు, సూచనలు ఇచ్చేవారు అని పేర్కొన్నారు.

కొన్ని రోజుల క్రితం కె.వి.కె. ఉండిలో కొత్తగా తేనెటీగల పరిశ్రమను చేపట్టిన 25 గ్రామీణ యువతకు ఉచితంగా శిక్షణ ఇచ్చి అవసరమైనప్పుడు తేనెటీగల పరిశ్రమను సందర్శించి సలహాలు, సూచనలు ఇస్తున్నారు అని తెలిపారు.

మరింత సమాచారం కొరకు సంప్రదించాల్సిన
ఫోన్ నెం : 72002 59877

# ఏరువాక కేంద్రాలు

1. ఏరువాక కేంద్రం
**పాడేరు - 531 024,**
**అల్లూరి సీతారామరాజు జిల్లా**
సెల్ నెం : 99896 23800

2. ఏరువాక కేంద్రం
వ్యవసాయ పరిశోధనా స్థానం ఆవరణ
**గాజులరేగ-535 001, విజయనగరం జిల్లా**
ఫోన్ నెం : 08922-228812
సెల్ నెం : 99896 23801

3. ఏరువాక కేంద్రం
ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాల ఆవరణ,
2వ అంతస్తు, ముమ్మిడివరం,
**అమలాపురం - 533 216**
**డా॥ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా**
సెల్ నెం : 99896 23802

4. ఏరువాక కేంద్రం
వ్యవసాయ పరిశోధనా స్థానం ఆవరణ
**పెద్దాపురం-533 437, కాకినాడ జిల్లా**
సెల్ నెం : 99896 23803

5. ఏరువాక కేంద్రం
ఆం.ప్ర., వ్యవసాయ అధికారుల కమిటీ భవనం,
రిజిస్ట్రార్ ఆఫీస్ ఎదురు, ఎస్.బి.ఐ. మైన్ రోడ్,
నరసింహారావు పేట, **ఏలూరు - 534 006**
**ఏలూరు జిల్లా**
సెల్ నెం : 99896 23804

6. ఏరువాక కేంద్రం
**రాజమహేంద్రవరం - 533 296**
**తూర్పు గోదావరి జిల్లా**
సెల్ నెం : 99896 23805

7. ఏరువాక కేంద్రం
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఆవరణ
**లాం - 522 034, గుంటూరు జిల్లా**
ఫోన్ నెం : 0863-2524009
సెల్ నెం : 99896 23806

8. ఏరువాక కేంద్రం
**రావిపాడు - 522 603**
**నరసరావు పేట,**
**పల్నాడు జిల్లా.**
సెల్ నెం : 99896 23807

9. ఏరువాక కేంద్రం
వ్యవసాయ కళాశాల ఫామ్ ఆవరణ, రైలు పేట్,
**బాపట్ల, బాపట్ల జిల్లా - 522 101**
సెల్ నెం : 99896 23808

10. ఏరువాక కేంద్రం
పాత కలెక్టరేట్ ఆఫీస్ ఆవరణ, గ్రీమ్స్‌పేట్
**చిత్తూరు - 517 002, చిత్తూరు జిల్లా**
సెల్ నెం : 99896 23809

11. ఏరువాక కేంద్రం
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఆవరణ
**నంద్యాల - 518 503,**
**నంద్యాల జిల్లా**
సెల్ నెం : 99896 23810

12. ఏరువాక కేంద్రం
కృషి విజ్ఞాన కేంద్రం ఆవరణ
**ఊటుకూరు, కడప - 516 003,**
**డా॥ వై.ఎస్.ఆర్. కడప జిల్లా**
సెల్ నెం : 99896 23811

13. ఏరువాక కేంద్రం
బిల్డింగ్ నెం : 24, దీనా జనోద్ధరణ బిల్డింగ్
**పుట్టపర్తి - 515 134**
**శ్రీ సత్యసాయి జిల్లా**
సెల్ నెం : 99896 23812

RNI NO : APTEL/2012/46939 JULY 2023 Postal Regd. No. GTR/82/2022-24
Date of Publication : 07-07-2023
Date of Posting 09-07-2023




ANGRAU

# ఆచార్య ఎన్. జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయము

**లాం, గుంటూరు - 522 034**

ముద్రణ & ప్రచురణ కర్త : ప్రధాన వ్యవసాయ సమాచార అధికారి, ఆచార్య ఎన్. జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయము, గుంటూరు.
ముద్రణాలయం : ప్రజాశక్తి ప్రింటర్స్ & పబ్లిషర్స్ ప్రై.లి., కృష్ణనగర్, తాడేపల్లి, గుంటూరు జిల్లా.